بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ

# బదర్

(Telugu)వార పత్రిక ఖాదియాన్

Weekly **BADAR**
Qadian

సంపుటి: 11 www.akhbarbadr.in సంచిక: 37-38

సంపాదకులు: హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్,
ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్.

## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

**మీలో కొందరు ఒక సంఘముగా ఏర్పడి ఉత్తమత్వమును బోధించవలెను.**

وَلۡتَکُنۡ مِّنۡکُمۡ اُمَّۃٌ یَّدۡعُوۡنَ اِلَی الۡخَیۡرِ وَیَاۡمُرُوۡنَ بِالۡمَعۡرُوۡفِ وَیَنۡہَوۡنَ عَنِ الۡمُنۡکَرِ ؕ وَاُولٰٓئِکَ ہُمُ الۡمُفۡلِحُوۡنَ ﴿۱۰۵﴾ (آلِ عمران:105)

అనువాదం: " మీలో కొందరు ఒక సంఘముగా ఏర్పడి ప్రజలను ఉత్తమత్వము వైపు ఆకర్షించి ఉత్తమత్వమును నేర్పి దౌష్ట్యము నుండి దూరముగా నుండునట్లు చేయవలెను. ఇట్టి వారికే విజయము చేకూరును. **(ఆలే ఇమ్రాన్: 105)**

తేది: **10-17 సెప్టెంబర్ 2026** క్రీ, శ. **10-17** తబూఖ్ **1405** హి, శ.
**27** రబీఉల్ అవ్వల్ - **5** రబీఉస్సాని **1448** హి,ఖ.



## ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచనాలు:

## మార్గదర్శకము వైపు ఆహ్వానించు వ్యక్తి యొక్క ప్రతిఫలము మార్గదర్శకమును అనుసరించువారి ప్రతిఫలమును పోలి ఉండును.

عَنْ أَبِي هُرَيْرَةَ ، أَنَّ رَسُولَ اللهِ صَلَّى اللهُ عَلَيْهِ وَسَلَّمَ، قَالَ مَنْ دَعَا إِلَى هُدًى كَانَ لَهُ مِنَ الْأَجْرِ مِثْلُ أُجُورِ مَنْ تَبِعَهُ، لَا يَنْقُصُ ذَلِكَ مِنْ أُجُورِهِمْ شَيْئًا، وَمَنْ دَعَا إِلَى ضَلَالَةٍ كَانَ عَلَيْهِ مِنَ الْإِثْمِ مِثْلُ آثَامِ مَنْ تَبِعَهُ، لَا يَنْقُصُ ذَلِكَ مِنْ آثَامِهِمْ شَيْئًا". (صحیح مسلم کتاب العلم/حدیث:6804)

అనువాదం: హజ్రత్ అబూహురైరహ్ రజి ఇలా ఉల్లేఖించారు: ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు: మార్గదర్శకము వైపు ఆహ్వానించు వ్యక్తి యొక్క ప్రతిఫలము మార్గదర్శకమును అనుసరించువారి ప్రతిఫలమును పోలి ఉండును. అయితే అనుసరించువారి ప్రతిఫలములో ఎలాంటి తగ్గుదల ఉండదు. అదే విధముగా దుర్మార్గము వైపు ఆహ్వానించు వ్యక్తి యొక్క పాపము, అట్టి దుర్మార్గమును అనుసరించు వారి పాపములకు సమానంగా యుండును. అయితే అనుసరించు వారి పాపములలో ఎలాంటి తగ్గుదల ఉండదు.

عَنْ حُذَيْفَةَ بْنِ الْيَمَانِ، عَنِ النَّبِيِّ صَلَّى اللهُ عَلَيْهِ وَسَلَّمَ قَالَ :وَالَّذِي نَفْسِي بِيَدِهِ لَتَأْمُرُنَّ بِالْمَعْرُوفِ، وَلَتَنْهَوُنَّ عَنِ الْمُنْكَرِ، أَوْ لَيُوشِكَنَّ اللهُ أَنْ يَبْعَثَ عَلَيْكُمْ عِقَابًا مِنْهُ، ثُمَّ تَدْعُونَهُ فَلَا يُسْتَجَابُ لَكُمْ. (ترمذی كتاب الفتن باب الامر بالمعروف والنهي عن المنكر2169)

అనువాదం: హజ్రత్ ఉజైఫా రజియల్లాహ్ అన్హు ఇలా ఉల్లేఖించారు: ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా తెలిపారు: " నా ప్రాణములు అరచేతిలో ఉన్నటు వంటి దైవము ప్రణాముగా తెల్పుచున్నాను. మీరు మంచిపనులు చేయండని చెడు పనులకు దూరముగా ఉండండి అని ఆదేశించండి. లేనిచో అతి సమీప కాలంలోనే అల్లాహ్‌తాలా మీపై అతి కఠినకాలమును తీసుకవచ్చును. అప్పుడు మీరు దుఆలు చేసినా కూడ అవి స్వీకరించబడవు.



## మిత్రులందరు కేవలం అల్లాహ్ కొరకు, అల్లాహ్ తెల్పిన విషయాలను వినడానికి మరియు దుఆలో భాగస్వాములు కావడానికి ఈ నిర్ణీత తేదీన జాల్సాలో పాల్గొనుటకు తప్పక హాజరు కావాలి.

**హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ ( మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని) అలైహిస్సలాతు వస్సలాం ఇలా పేర్కొన్నారు:** "ఈ జల్సా, ప్రపంచపు జాతరల మాదిరిగా కేవలం ఒక ఆచారంగా తప్పనిసరిగా నిర్వహించునది కాదు. వాస్తవానికి దీని నిర్వాహణ నిష్కపటమైన లక్ష్యములు మరియు శుభప్రదమైన ఫలితాలపై ఆధారపడి ఉంటుంది." **(మజ్మూఆ-ఎ- ఇష్తిహారాత్, సంపుటి 1, పేజీ 440)**

హుజూర్ (అ) మరల ఇలా తెలిపారు: "సాధ్యమైనంతవరకు మిత్రులందరు కేవలం అల్లాహ్ కొరకు, అల్లాహ్ తెల్పిన విషయాలను వినడానికి మరియు దుఆలో భాగస్వాములు కావడానికి ఈ నిర్ణీత తేదీన జాల్సాలో పాల్గొనుటకు తప్పక హాజరు కావాలి. ఈ జల్సాలో విశ్వాసం, నమ్మకం మరియు ఆధ్యాత్మిక పరిజ్ఞానాన్ని పెంపొందించడానికి అవసరమైన వాస్తవాలను మరియు ఆంతర్యములను వినిపించడం జరుగుతుంది. అలాగే, ఈ మిత్రుల కోసం ప్రత్యేక దుఆలు చేయడం మరియు ప్రత్యేక శ్రద్ధచూపడం వంటివి ఉంటాయి. అల్లాహ్ వారిని తనవైపు ఆకర్షించి, తన కొరకు స్వీకరించి, వారిలో పవిత్రమైన మార్పును ప్రసాదించుటకు సాధ్యమైనంతవరకు అత్యంత కరుణామయుడైన అల్లాహ్ సన్నిధిలో ప్రయత్నించబడుతుంది. ఈ జల్సాలలో కలిగే ఒక తాత్కాలిక ప్రయోజనం ఏమిటనగా, ప్రతి సంవత్సరం ఈ జమాఅత్‌లో చేరునట్టి కొత్త సోదరులు, ఈ నిర్ణీత తేదీన హాజరై తమ కంటే ముందు ఈ జమాఅత్‌లో చేరిన సోదరులను కలుసుకుంటారు. పరస్పర పరిచయం ఏర్పడిన తరువాత, ఒకరిపై ఒకరికి ప్రేమాభిమానాలు మరియు పరిచయ సంబంధాలు క్రమంగా అభివృద్ధి చెందుతూనే ఉంటాయి.....ఈ ఆధ్యాత్మిక జల్సాలో ఇంకా అనేక ఆధ్యాత్మిక ప్రయోజనాలు మరియు లాభాలు ఉంటాయి. అవి, ఇన్షా అల్లాహ్, ఒకదాని తరువాత మరొక్కటిగా త్వరిత గతిలోనే వెలుగులోకి వస్తూనే ఉంటాయి." **(ఆస్మానీ ఫైసలా, 30 డిసెంబర్ 1891, రూహానీ ఖజాయిన్, సంపుటి 4, పేజీలు 351-352)**

హుజూర్ (అ) ఇలా తెలిపారు: "ఇది ప్రపంచపు వినోద ప్రదర్శనలలోని ఒక వినోద కార్యక్రమం కాదు."

**(మజ్మూఆ -ఏ - ఇష్తిహారాత్, సంపుటి 1, పేజీ 443)**

## " జల్సా సాలాన అల్లాహ్ సంకేతాలలో ఒక గొప్ప సంకేతం."

**హజ్రత్ మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ అహ్మద్, ఖలీఫతుల్ మసీహుస్సాని రజియల్లాహ్ అన్హు ఇలా పేర్కొన్నారు:** "ఈ జల్సా గురించి నేను గతంలో కూడా అనేకసార్లు వివరించినట్లుగా, ఇది అల్లాహ్ తఆలా యొక్క సంకేతాలలో ఒక సంకేతం. ఖాదియాన్ అనే ఈ గ్రామం వైపు ఒకప్పుడు ఎవ్వరూ కూడ చూసేవారు కాదు. అనేకులు ఖాదియాన్ మరియు హజ్రత్ మసీహ్‌మౌఊద్ అలైహిస్సలాతువస్సలాం పేరు విని, సుదూర ప్రాంతాల నుండి ఖాదియాన్ చేరుకోవాలనే కోరికతో బయలు దేరేవారు, కాని బటాలా లేదా అమృత్‌సర్ చేరుకున్న తర్వాత తిరిగి వెళ్ళిపోయేవారు. ఎందుకంటే వారికి, 'ఖాదియాన్‌లో చాలా పెద్దమొత్తంలో దజ్జాలీ ఫిత్నా (మోసపూరితమైన కార్యకలాపాలు) కొనసాగుతున్నాయఅని చెప్పబడేది. మన జమాఅత్‌కు చెందిన అనేక మంది నేటికి కూడ 'పశ్చాత్తాపంతో తమ చేతులను నలుపుకుంటూ, 'హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కాలంలో తామెందుకు ఖాదియాన్‌కు రాలేక పోయాము?' అని బాధపడే వారున్నారు. కేవలం శత్రువులు చెప్పిన కొన్ని మాటలు విన్నందువల్ల, వారికి ఖాదియాన్‌కు రావడానికి ఇష్టం కల్గులేదు. **(14వ పేజిలో )**

## (అహ్మదియ్యా వార్తలు)

**సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యద హుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు అల్లాహ్ తాలా కృపతో క్షేమంగా ఉన్నారు. జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ గారి కొరకు ప్రత్యేముగా దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ అన్వర్‌కు ఆరోగ్య వంతమైన, చురుకైన, దీర్ఘాయుష్షును ప్రసాదించు గాకా!. ఉన్నత ఆశయ సాధనాలను సమకూర్చు గాకా!, అనుక్షణం హుజూర్‌ను రక్షించుగాకా!, దేవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్).***

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

لَا اِلٰہَ اِلَّا اللّٰہُ مُحَمَّدٌ رَّسُوْلُ اللّٰہِ

**సంపాదకీయం:**

# 131వ జల్సా సాలానా.....
# ఖాదియాన్ దారుల్ అమాన్.

పాఠకులకు తెలిసినట్లుగా, ఈ సంవత్సరం సయ్యద్నా హజ్రత్ అఖ్దస్ అమీరుల్ మోమినీన్ (అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్) వారి అనుమతితో ఖాదియాన్ దారుల్ అమాన్‌లో 131వ జల్సా సాలానా దివి: 25, 26, 27 డిసెంబర్ 2026న నిర్వహించబడుతోంది. ఈ జల్సా నిర్వహణకు ఇంకా కేవలం మూడు నెలల సమయం మాత్రమే మిగిలి ఉంది. కాబట్టి, జల్సాలో పాల్గొనేందుకు నేటి నుండే ఏర్పాట్లు ప్రారంభించాల్సిన సమయం ఆసన్నమైంది.

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌఊద్ (అలైహిస్సలాము) 1891లో ఈ జల్సాకు పునాది వేసినప్పుడు, బైఅత్ యొక్క ప్రాథమిక ఉద్దేశ్యాలను నెరవేర్చడానికి ఈ జల్సాను ఒక సాధనంగా పేర్కొన్నారు.

(1) జల్సా స్థాపన యొక్క లక్ష్యం: **బైఅత్ ఉద్దేశ్యాన్ని నెరవేర్చడం.**

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌఊద్ (అలైహిస్సలాము) ఇలా తెలిపారు:

"ఈ భవదీయుడి బైఅత్‌లో ప్రవేశించిన నిజాయితీ పరులందరికీ తెలియ జేయున దేమనగా, ఈ బైఅత్ యొక్క ఉద్దేశ్యం ఏమిటంటే, ప్రాపంచిక ప్రేమ చల్లారిపోయి, మన కరుణామయుడైన అల్లాహ్ మరియు ఆయన మహనీయ ప్రవక్త (స) పట్ల గల ప్రేమ తమ హృదయాలపై ఆధిపత్యం పొందాలి. అంతేకాక, పరలోక ప్రయాణం పట్ల గల భయభ్రాంతులు తొలిగిపోయి, అనుబంధమయమైన స్థితి కలగాలి. కాని ఈ ఉద్దేశ్యాన్ని సాధించడానికి సత్సాంగత్యంలో ఉండటం, అలాగే తమ జీవితంలోని కొంత భాగాన్ని ఈ మార్గంలో వెచ్చించడం చాలా అవసరం. తద్వారా అల్లాహ్ తఆలా సంకల్పిస్తే, ఏదైనా నిశ్చయమైన సంకేతాన్ని ప్రత్యక్షంగా దర్శించడం వలన, బలహీనత, దౌర్బల్యం, అలసత్వం తొలగిపోయి, సంపూర్ణ విశ్వాసం ఏర్పడి, ఆధ్యాత్మిక ఆనందం, ఉత్సాహం మరియు ప్రేమాభిమానపు ఉత్తేజం కలుగుతుంది. అందువల్ల ఈ లక్ష్యాన్ని సాధించడానికి ఎల్లప్పుడూ శ్రద్ధ వహిస్తూ, అల్లాహ్ తఆలా ఈ సామర్థ్యాన్ని తమకు ప్రసాదించమని ప్రార్థిస్తూ ఉండాలి. ఈ సామర్థ్యం పూర్తిగా లభించే వరకు అప్పుడప్పుడు పరస్పరం తప్పని సరిగా కలుసుకోవాలి. ఎందుకంటే బైఅత్ వ్యవస్థలో ప్రవేశించిన తరువాత పరస్పర భేటీ గురించి శ్రద్ధ చూపకపోవడం వల్ల ఆ బైఅత్ పూర్తిగా ఆశీర్వాదరహితమైనదిగా మారి, కేవలం ఒక ఆచారంగా మాత్రమే మిగిలిపోతుంది. వాస్తవానికి ప్రతి ఒక్కరికీ తన సహజ బలహీనత, ఆర్థిక సామర్థ్యం లేకపోవడం లేదా దూర ప్రయాణం కారణంగా సత్సాంగత్యంలో ఉండటం లేదా సంవత్సరంలో పలుమార్లు కష్టపడి భేటీకి రావడం సాధ్యం కాదు. ఎందుకంటే చాలామంది హృదయాల్లో ఇంకా భేటీ కోసం పెద్ద పెద్ద కష్టాలను, ప్రయాణపు ఇబ్బందులను భరించే అంతటి స్థాయి ఉత్సాహం ఏర్పడలేదు. అందువల్ల, సంవత్సరంలో మూడు రోజులను ఇలాంటి జల్సా కోసం నిర్ణయించడం సముచితంగా అనిపిస్తోంది. ఫలితముగా నిజాయితీ పరులందరూ, అల్లాహ్ తఆలా అనుమతిస్తే, ఆరోగ్యం, సమయం మరియు తీవ్రమైన అడ్డంకులు లేని పక్షంలో నిర్ణయిత తేదీన హాజరు కావచ్చు."

(2) జల్సా యొక్క ఉద్దేశ్యం :

**దైవిక విషయాలను వినడం మరియు వర్తమాన ఇమాం వారి ప్రార్థనలో పాల్గొనడం.**

మరల జల్సా యొక్క ఉద్దేశ్యాలను వివరిస్తూ హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌఊద్ (అలైహిస్సలాము) ఇలా తెలిపారు:

"సాధ్యమైనంత వరకు స్నేహితులందరూ కేవలం అల్లాహ్ కొరకే దైవిక విషయాలను వినడానికి మరియు ప్రార్థనలో పాల్గొనడానికి ఈ నిర్ణయిత తేదీన రావాలి. ఈ జల్సాలో విశ్వాసం, నిశ్చయత మరియు ఆధ్యాత్మిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడానికి అవసరమైన సత్యాలు మరియు జ్ఞానాన్ని వినిపించడమే ప్రధాన కార్యక్రమంగా ఉంటుంది. అలాగే ఈ స్నేహితుల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేయడం మరియు ప్రత్యేక శ్రద్ధను కల్గియుండడం ఉంటుంది. అత్యంత కరుణామయుడైన అల్లాహ్ సన్నిధిలో 'అల్లాహ్ వారిని తన వైపుకు ఆకర్షించి, తన కోసం స్వీకరించి, వారిలో పవిత్రమైన మార్పును కల్పించుటకై' సాధ్యమైనంత వరకు ప్రయత్నించబడును."

**(3) కొత్త సోదరులను కలుసుకోవడం:-**

మరల జల్సా యొక్క ఉద్దేశ్యాలను వివరిస్తూ హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌఊద్ (అలైహిస్సలాము) ఇలా తెలిపారు:

"ఈ జల్సాల ద్వారా కలిగే తాత్కాలిక ప్రయోజనాల్లో మరొకటి ఏమిటంటే, ప్రతి సంవత్సరం ఈ జమాఅత్‌లో ఎంతమంది కొత్త సోదరులు చేరుతారో, వారు నిర్ణయిత తేదీన హాజరై తమ పాత సోదరులను ముఖాముఖిగా కలుసుకుంటారు. పరస్పరం పరిచయం ఏర్పడటం ద్వారా ప్రేమ, స్నేహం మరియు పరిచయ సంబంధం మరింత అభివృద్ధి చెందుతూ ఉంటుంది."

**(4) మృతుల కోసం ప్రార్థించడం:**

"ఈ మధ్యకాలంలో ఈ ఇహలోకాన్ని ఏ సోదరుడైనా విడిచిపెట్టిఉంటే, ఈ జల్సాలో అతని క్షమాపణ కోసం ప్రార్థన చేయబడుతుంది."

**జల్సా యొక్క మహత్త్వం మరియు ప్రాముఖ్యత:-**

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌఊద్ (అలైహిస్సలాము) ఈ జల్సా యొక్క ఉద్దేశ్యాలు మరియు లక్ష్యాలను వివరించినందున, ఇందులో పాల్గొనడం యొక్క ప్రాముఖ్యత మరింత పెరుగుతుంది. ఈ విషయమై వారు (అ) ఇలా తెలిపారు:

"ఈ జల్సాను సాధారణ సమావేశాల వలె భావించకండి. ఇది సత్యానికి సంపూర్ణ మద్దతు మరియు ఇస్లాం యొక్క కలిమాను ఉన్నతపరచడంపై ఆధారపడిన కార్యం. దీని పునాది రాయిని అల్లాహ్ తఆలా స్వయంగా తన చేతులతో వేశాడు. దీని కోసం ఆయన జాతులను సిద్ధం చేశాడు. అవి త్వరలోనే ఇందులో చేరనున్నాయి. ఎందుకంటే ఇది ఆ సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క కార్యం. ఆయన సమక్షంలో అసాధ్యమైనది ఏదీ లేదు." (7 డిసెంబర్ 1891 నాటి ప్రకటన)

ఈ సందర్భంలో గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటంటే, హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం దైవ ఆజ్ఞ ప్రకారం, తాను మసీహ్ మౌఊద్ (వాగ్దానిత మసీహ్) అని ప్రకటించిన అదే సంవత్సరంలో ఈ జల్సాను ప్రారంభించారు. ఆ సమయంలో దేశమంతటా తీవ్రమైన వ్యతిరేకతతో కూడిన తుఫాను చెలరేగి ఉంది. భారతదేశంలోని వివిధ మతపరమైన వర్గాలకు చెందిన ప్రముఖ మౌలానాలు వారిపై కుఫ్ర్ (అవిశ్వాసం) ఫత్వాలు జారీ చేస్తూ, వారిని ఇస్లాం పరిధి నుండి వెలివేసినట్లు ప్రకటిస్తున్నారు. అటువంటి పరిస్థితుల్లో, సాధారణంగా ముస్లింలలో ప్రాచుర్యంలో ఉన్న మసీహ్ సజీవంగా ఉన్నాడనే విశ్వాసానికి పూర్తిగా విరుద్ధమైన ఒక ప్రకటనను హుజూర్ (అ) చేసినందున, ప్రజలు ఖాదియాన్‌లో సమావేశం కావడం అసాధ్యమనే భావన కలగడం సహజమే. అయినప్పటికీ, తీవ్రమైన వ్యతిరేకతలు, అడ్డంకులు ఉన్నప్పటికీ, 1891లో ఖాదియాన్‌లోని మస్జిద్ అక్సాలో నిర్వహించబడిన ప్రప్రథమ జల్సాలో 75 మంది పాల్గొన్నారు. ఆ జల్సాలో పాల్గొన్న అదృష్టవంతులైన సహాబీల జాబితాను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తమ విలువైన గ్రంథం "ఆస్మానీ ఫైసలా"లో నమోదు చేశారు. తర్వాత కూడా తీవ్రమైన వ్యతిరేకతలు, అడ్డంకులు, వేధింపులు ఎదురైనప్పటికీ, అంతేకాకుండా మసీదుల నుండి తోసివేసి బయటకు పంపబడినప్పటికీ, 1892 జల్సా సాలానాలో పాల్గొన్న వారి సంఖ్య 500కు చేరింది. వారిలో ఖాదియాన్ బయటినుండి అనగా సుదూర ప్రాంతాల నుండి వచ్చిన వారి సంఖ్య 325. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ జాబితాను తమ విలువైన గ్రంథం "ఆయినా కమాలాతే ఇస్లాం"లో నమోదు చేశారు. దీని ద్వారా, వ్యతిరేకతల తుఫానులను దాటుకుంటూ ఈ నౌక ఎంత విజయవంతంగా ముందుకు సాగుతోందో అర్థమవుతుంది. 1908లో హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం పరమపదించే ముందు, వారి పవిత్ర జీవితపు చివరి జల్సా సాలానాలో పాల్గొన్న వారి సంఖ్య 2,000కు చేరింది. ప్రతి సంవత్సరం అల్లాహ్ తఆలా ఈ జమాఅత్‌కు ఎలా అభివృద్ధిని ప్రసాదిస్తూ వచ్చాడో దీని ద్వారా స్పష్టమవుతుంది.

1908లో ఖిలాఫతే అహ్మదియ్యా కాలంలోని మొదటి జల్సా సాలానా జరిగింది. అందులో పాల్గొన్న వారి సంఖ్య 3,000. మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం మరణం కారణంగా, అలాగే వ్యతిరేకులు కుఫ్ర్ ఫత్వాలు జారీ చేయడం వల్ల, ఈ జమాఅత్ ఇక నశించిపోతుందని వారు భావించారు. అయితే అల్లాహ్ ఒక్క సంవత్సరంలోనే ఈ దైవిక జల్సా హాజరులో మరో 1,000 మందిని పెంచాడు.

ఖిలాఫతే సానియా (రెండవ ఖిలాఫత్) ప్రారంభ సంవత్సరమైన 1914 నాటి జల్సాలో 6,000 మంది పాల్గొన్నారు. ఇక ఖిలాఫతే సానియా (రెండవ ఖలీఫా) చివరి జల్సా, 1964 డిసెంబరులో రబ్వాలో జరిగినప్పుడు, దాని హాజరు ఒక లక్షకు పైగా చేరింది. (అల్-ఫజల్, 24 డిసెంబర్ 1965)

ఖిలాఫతే సానియా కాలంలోని జల్సాలలో లివాయే అహ్మదియ్యా (అహ్మదియ్యా పతాకం) ఎగురవేయడం ప్రారంభమైంది. అలాగే ఈ జల్సాల హాజరు ఖాదియాన్ మరియు భారతదేశపు పరిధిని దాటి ప్రపంచంలోని వివిధ దేశాలకు విస్తరించసాగింది. ప్రపంచంలోని అనేక దేశాల ప్రతినిధులు ఈ జల్సాలలో పాల్గొనడం ప్రారంభించారు.

ఖిలాఫత్-ఎ-సాలిసా (మూడవ ఖిలాఫత్) యొక్క చివరి జల్సా డిసెంబర్ 1981లో రబ్వాలో జరిగింది. అల్లాహ్ కృపతో దానికి రెండు లక్షల మంది హాజరయ్యారు. జల్సాకు వచ్చిన అతిథుల కోసం ఆధునిక సౌకర్యాలు కల్పించడం ప్రారంభమైంది. రొట్టెలు తయారు చేయడానికి యంత్రాలను ఏర్పాటు చేశారు. ఈ యంత్రాలను అహ్మదీ ఇంజినీర్లే స్వయంగా తయారు చేశారు.

ఖిలాఫత్-ఎ-సాలిసా అనంతరం ఖిలాఫత్-ఎ-రాబియా (నాలుగవ ఖిలాఫత్) కాలంలో ఒకవైపు బ్రిటన్‌లో కేంద్ర జల్సా-ఎ-సాలానా కొనసాగుతుండగా, మరోవైపు ఈ జల్సా శాఖలు ప్రపంచంలోని అనేక దేశాల్లో విస్తరించడం ప్రారంభించాయి. అక్కడ విశాలమైన భూములను కొనుగోలు చేసి జల్సా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. అందువల్ల నేడు మీరు చూస్తే, ఖాదియాన్ మరియు రబ్వాతో పాటు బ్రిటన్, అమెరికా, కెనడా, ఆఫ్రికా మరియు దీవులలోని అనేక దేశాల్లో అన్ని సౌకర్యాలతో కూడిన విశాలమైన కేంద్రాలు ఏర్పడ్డాయి. **(15 వ పేజిలో )**



# జుమా ప్రసంగము

**హ(జత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారు తన ప్రత్యర్థులతో కూడా అత్యంత దయతో వ్యవహరించేవారు. వారి ముందు ఎల్లప్పుడూ ఎంతో వినయంగా ఉండేవారు. ఏనాడూ అహంకారాన్ని ప్రదర్శించేవారు కాదు....**
**సంక్షిప్తంగా చెప్పాలంటే, హ(జత్ మసీహ్ మౌవూద్ (అ) తనను కలవడానికి వచ్చిన ప్రతి ఒక్కరినీ అత్యంత వినయంతో స్వాగతించేవారు.**

---

**సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనలో నిజమైన వినమ్రతను మరియు సాత్విక గుణాన్ని పెంపొందించుకునే సామర్థ్యాన్ని ప్రసాదించుగాకా!. అలాగే, హ(జత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బైఅత్ చేసిన వారిగా, మనం ఇస్లాం యొక్క నిజమైన బోధనలకు అనుగుణంగా నడుచుకుంటూ, చిత్తశుద్ధి మరియు స్థిరచిత్తంతో దాని పట్ల మన బాధ్యతలను నెరవేర్చేవారిగా ఉందుము గాకా!.**

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హ(జత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 05 జూన్ 2026 ( 05 ఎహసాన్ 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

اَشْهَدُ اَنْ لَّا اِلٰهَ اِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَاَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ

اَمَّا بَعْدُ فَاَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ -

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ○

اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ ۙ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

గత శుక్రవారం ప్రసంగంలో, హ(జత్ మసీహ్ మౌవూద్ (అ) గారి వినయశీలత, నమ్రతకు సంబంధించిన కొన్ని సంఘటనలను, అలాగే ఈ విషయంలో వారు (అ) ఇచ్చిన మార్గదర్శకత్వాన్ని నేను వివరించాను. ఈ రోజు కూడా దీనికి సంబంధించిన మరికొన్ని సంఘటనలను, అలాగే వారు (అ) ఇచ్చిన కొన్ని మార్గదర్శకాలను ప్రస్తావించుతాను.

హ(జత్ షేఖ్ ముహమ్మద్ ఇస్మాయీల్ సాహిబ్ ఇలా వివరిస్తున్నారు: హ(జత్ మసీహ్ మౌవూద్ (అ.స.) గారి ఉన్నత నైతిక గుణాలు ఎంత అద్భుతంగా ఉండేవంటే, వారిని ఎప్పుడూ వ్యతిరేకిస్తూ ఉండే వారు, వారిని వ్యతిరేకించడానికి ఏ అవకాశాన్నీ వదులుకోని వారు కూడ వారి ఇంటి తలుపు తట్టి వచ్చినప్పుడు, హ(జత్ మసీహ్ మౌవూద్ (అ) వెంటనే చెప్పులు లేకుండా వారిని కలుసుకోవడానికి రావడాన్ని నేను గమనించాను. వారిని చూడగానే అత్యంత దయతో వారి సలామ్‌కు జవాబిచ్చి, వారిని మరియు వారి కుటుంబ సభ్యులు క్షేమంగా, ఆరోగ్యంగా ఉన్నారా అని అడిగేవారు. ఆ తరువాత, వారు తనను కలవడానికి ఎందుకు వచ్చారో విచారించేవారు. వారు తమ అవసరాన్ని తెలియజేసేవారు. అప్పుడు వారికి ఎంత డబ్బు అవసరమో అడిగి, వారికి అవసరమైన దానికంటే ఎక్కువ మొత్తాన్ని ఇచ్చి, "ఇంకా అవసరమైతే, ఇంకా తీసుకోండి!" అని చెప్పేవారు. **(అషాబ్-ఏ-అహ్మద్, సంపుటి 2, పుటలు 395-396)**

హుజూర్ (అ) తన ప్రత్యర్థులతో కూడా అత్యంత దయతో వ్యవహరించేవారు. వారి ముందు ఎల్లప్పుడూ ఎంతో వినయంగా ఉండేవారు. ఏనాడూ అహంకారాన్ని ప్రదర్శించేవారు కాదు.

హ(జత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ (రజి) ఇలా వివరిస్తున్నారు: తాను మున్షీ జఫర్ అహ్మద్ సాహిబ్ నుండి విన్నానని, మౌల్వీ షేర్ అలీ సాహిబ్ ఆయనకు ఒక సంఘటనను వివరించారని చెప్పారు. ఒకసారి మానసికంగా అస్వస్థుడైన మీరాన్ బక్ష్ సుదాయి ప్రధాన మసీదు నుండి వస్తూ, హ(జత్ మసీహ్ మౌవూద్ (అ)ను వారి పేరుతో పిలిచాడు. అతను మానసికంగా అస్వస్థుడైనందున, అతని పిలుపు కొంత అగౌరవంగా ఉండేది. అతని నుండి మరేమి ఆశించగలం? అతను గట్టిగా, "ఓ గులామ్ అహ్మద్!" అని అరిచాడు.

హ(జత్ మసీహ్ మౌవూద్ (అ) వెంటనే ఆగి, "అవును" అని సమాధానమిచ్చారు. హుజూర్ (అ) ఏమాత్రం బాధపడకుండా, "నువ్వు ఏమి చెప్పాలనుకుంటున్నావు?" అని అడిగారు. దానికి అతను పంజాబీలో, "ముందుగా సలామ్ చేయాలి!" అని అన్నాడు. ఈ పేదవాడు తనను తాను ఒక అధికారిగా భావించే వాడు. హ(జత్ మసీహ్ మౌవూద్ (అ) "అస్సలాము అలైకుమ " అని పలికారు. అప్పుడు ఆ వ్యక్తి, "ముఆమలా" అనగా భూమి పన్నురి చెల్లించండి! అని అన్నాడు. భూమి యజమానులు ప్రభుత్వానికి చెల్లించాల్సిన ఒక రకమైన పన్నును 'ముఆమలా' అని పిలిచేవారు. ఏది ఏమైనప్పటికీ, ఇది విన్న వెంటనే హ(జత్ మసీహ్ మౌవూద్ (అ) తన జేబులో నుండి ఒక రుమాలు తీసి, అందులో నాలుగు లేదా ఎనిమిది అణాలు పెట్టి అతనికి ఇచ్చారు. ఆ వ్యక్తి ఎంతో సంతోషించి, స్తుతి గీతాల పద్యాలను పాడుకుంటూ తిరిగి వెళ్లిపోయాడు.

**(సీరతుల్ మహ్దీ, సంపుటి 1, కథనము 805, పుట 734)**

హ(జత్ మసీహ్ మౌవూద్ (అ) మానసికంగా అస్వస్థత కలిగిన వ్యక్తి మాటలను ఎప్పుడూ కూడ మనసులో పెట్టుకునేవారు కాదు. అలాంటి వ్యక్తి కోసం కూడా ఆగేవారు.

మాస్టర్ నజీర్ హుసైన్ సాహిబ్ ఇలా వివరిస్తున్నారు: నేను నా తండ్రితో కలిసి ఖాదియాన్‌లో హ(జత్ మసీహ్ మౌవూద్ (అ)ను దర్శించడానికి వెళ్లినప్పుడల్లా, హకీమ్ మర్హమ్-ఎ-ఈసా సాహిబ్ వచ్చారని హుజూర్ (అ)కు తెలియజేసిన వెంటనే, వారు (అ) బయటకు వచ్చి ఆయనను స్వాగతించేవారు. ఆయనకు తినడానికి ఏదైనా కూడా అందించేవారు. కొన్ని సందర్భాల్లో స్వయంగా వెళ్లి ఆహారం తీసుకు వచ్చేవారు. మరల ఇలా వ్రాసారు: హ(జత్ మసీహ్ మౌవూద్ (అ) తన అతిథులను ఎంతో సరళతతో కలుసుకునేవారు. కొన్నిసార్లు వారు (అ) తమ చేతిలో కలం పట్టుకుని బయటకు రావడం నేను చూశాను. మరికొన్ని సందర్భాల్లో చెప్పులు లేకుండానే బయటకు వచ్చేవారు. అంటే, ఇంట్లోని ఒక గదిలో కూర్చుని ఉన్నప్పటికీ, తలుపు తట్టిన శబ్దం వినగానే అదే స్థితిలో బయటకు వచ్చేవారు. ఒకవేళ హ(జత్ మసీహ్ మౌవూద్ (అ) మసీదులో ఉన్నప్పుడు ఒక అతిథి వస్తే, తరచుగా లేచి నిలబడి ఆయనతో చేతులు కలిపేవారు. అలాగే, హుజూర్ (అ) మరొకరితో సంభాషణలో ఉండగా ఒక అతిథి వచ్చి, వారి(అ) పక్కన కూర్చుని చేతులు కలపడానికి ప్రయత్నిస్తే, వెంటనే తన దృష్టిని అతిథి వైపు మళ్లించి, ఆయన ఆరోగ్యం మరియు క్షేమం గురించి అడిగేవారు.

సంక్షిప్తంగా చెప్పాలంటే, హ(జత్ మసీహ్ మౌవూద్ (అ) తనను కలవడానికి వచ్చిన ప్రతి ఒక్కరినీ అత్యంత వినయంతో స్వాగతించేవారు. **(అస్హాబే అహ్మద్ సంపుటి 3, పేజి 173, కథకుడు హ(జత్ మాస్టర్ నజీర్ హుస్సేన్ గారు)**

హ(జత్ ముఫ్తీ ముహమ్మద్ సాదిక్ సాహిబ్ ఇలా వివరిస్తున్నారు:

"ఒక సందర్భంలో నేను లాహోర్ నుండి ఖాదియాన్‌కు వచ్చాను. అది బహుశా 1897 లేదా 1898 సంవత్సరం అయి ఉండవచ్చు. హ(జత్ మసీహ్ మౌవూద్ (అ) నన్ను ముబారక్ మసీదులో కూర్చోబెట్టారు. ఆ సమయంలో మసీదు చాలా చిన్నదిగా ఉండేది. అనంతరం వారు (అ) ఇలా అన్నారు: 'దయచేసి కూర్చోండి; నేను కొంత ఆహారం తీసుకువస్తాను.' ఇలా చెప్పి హుజూర్ (అ) లోపలికి వెళ్లారు. వారు తన సేవకుల్లో ఎవరో ఒకరి ద్వారా ఆహారం పంపిస్తారని నేను అనుకున్నాను. అయితే కొన్ని నిమిషాల తర్వాత తలుపు తెరుచుకున్నప్పుడు, హుజూర్ (అ) స్వయంగా తన చేతులతో ఒక ఆహారపు ట్రే తీసుకుని నా వద్దకు రావడం చూశాను. హుజూర్ (అ) నా వైపు చూసి, 'దయచేసి తినడం ప్రారంభించండి. నేను నీళ్లు తీసుకువస్తాను' అని అన్నారు. ఆయన చెబుతున్నారు: హుజూర్ (అ) చూపిన ఆప్యాయతకు నా కళ్లలో నుంచి కన్నీళ్లు అనుకోకుండా ప్రవహించడం ప్రారంభించాయి.

హ(జత్ మసీహ్ మౌవూద్ (అ) మన మార్గదర్శకుడు మరియు నాయకుడు, ఈ విధంగా మనకు సేవ చేస్తుంటే, మనం ఒకరి కొకరం ఎంతగా సేవ చేసుకోవాలి?"

**(జికరే హబీబ్, హ(జత్ ముఫ్తి ముహమ్మద్ సాదిఖ్ గారు, పేజి 258)**

హ(జత్ మసీహ్ మౌవూద్ (అ) వారి సరళత మరియు వినయాన్ని వివరించే మరో వృత్తాంతాన్ని హ(జత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ (రజి) 'మాయి భోలి' మాయి జీవాఁ అనే మహిళను ఆధారం చేసుకోని ఇలా వివరించారు.

ఆమె ఇలా చెప్పింది:"ఒకసారి హుజూర్ (అ) మా గ్రామానికి వచ్చినప్పుడు, నేను అప్పుడే కోసిన గోధుమలను వేయించి హుజూర్ (అ) వద్దకు తీసుకువచ్చాను. హుజూర్ (అ) వాటిని తనతో ఉన్నవారందరికీ పంచి, తాను కూడా కొంత రుచి చూసి, సంతోషాన్ని వ్యక్తం చేశారు. హుజూర్ (అ) ఆ ప్రాంతంలో నడకకు వచ్చినప్పుడల్లా, మా సాధారణ మట్టి మసీదులో ఇష్రాక్ అనగా మధ్యాహ్నానికి ముందు చేసే నఫిల్ నమాజ్ చదివేవారు. మేము వారికి పాలకూర మరియు రొట్టె సమర్పించే వాళ్లం. వారు(అ) ఎప్పుడూ కూడ అసంతృప్తిని లేదా అఇష్టంను వ్యక్తం చేయలేదు. బదులుగా, మా ఆతిథ్యాన్ని ఎంతో సంతోషంగా స్వీకరించేవారు."

**( సీరతుల్ మహ్దీ, సంపుటి 2, పేజి 202, కథనము సంఖ్య 1318)**

కపూర్తలాకు చెందిన హ(జత్ మున్షీ జఫర్ అహ్మద్ సాహిబ్ ఇలా వివరిస్తున్నారు: " హ(జత్ మసీహ్ మౌఊద్ (అ) తలుపు తెరిచి కూర్చునేవారు కాదు (వారు (అ) తలుపు తెరిచి కూర్చోరు). బదులుగా, ఆయన ఎల్లప్పుడూ తలుపు వేసుకుని కూర్చునేవారు." మరల ఇలా చెబుతున్నారు: "హ(జత్ రాజకుమారులు మియాఁ మహ్మూద్ సాహిబ్ రజి తరచూ వచ్చి, 'అబ్బా, తలుపు తీయండి' అని చెప్పేవారు. అప్పుడు హ(జత్ మసీహ్ మౌఊద్ (అ) లేచి తలుపు తెరిచేవారు. "ఒకసారి నేను హుజూర్(అ)ను కలవడానికి వెళ్లాను. హుజూర్ (అ) ఒక సాధారణ చాపపై కూర్చుని ఉన్నారు. నన్ను చూసిన వెంటనే, వారు (అ) స్వయంగా ఒక మంచాన్ని తీసుకొని లోపలికి తీసుకువచ్చారు. "నేను, 'హుజూర్ (అ), నేను దాన్ని మోసుకువస్తాను' అని అన్నాను. అందుకు హుజూర్ (అ) 'ఇది చాలా బరువుగా ఉంది. నువ్వు ఎత్తలేవు' అని సమాధానమిచ్చారు. "తర్వాత హుజూర్ (అ) నన్ను ఆ మంచంపై కూర్చోమని చెప్పారు. దానిని ఉంచిన తరువాత, నన్ను దానిపై కూర్చోబెట్టి, తన గురించి ఇలా అన్నారు: 'నేను ఇక్కడ నేలపై కూర్చోవడంలో సౌకర్యంగా భావిస్తున్నాను. నువ్వు మంచంపై కూర్చో.' "మొదట నేను నిరాకరించాను. కానీ , 'ఏ సంకోచం లేకుండా కూర్చో' అని హుజూర్ (అ) పట్టుబట్టారు. అందువల్ల నేను వారి (అ) మాటను పాటించాను. "నాకు దాహంగా అనిపించి, నీటి కుండల వైపు చూశాను. అయితే సమీపంలో త్రాగడానికి

గ్లాసు ఏదీ లేదు. ఇది గమనించిన హుజూర్, 'నీకు దాహంగా ఉందా? నేను నీళ్లు తీసుకొస్తాను' అని అన్నారు. "హుజూర్ (అ) కింద అంతస్తులోని స్త్రీల నివాస భాగానికి వెళ్లి, ఒక గ్లాసు తీసుకువచ్చారు. ఆ తర్వాత, 'ఒక్క క్షణం ఆగు' అని అన్నారు."మళ్లీ కిందకు వెళ్లి, మణిపూర్ నుంచి ఎవరో పంపించిన రెండు సీసాల తీపి శర్బత్ తీసుకు వచ్చారు. అది ఎంతో రుచికరమైన పానీయం. హజ్రత్ మసీహ్ మౌఊద్ (స) ఇలా అన్నారు: "'ఈ సీసాలను చాలా కాలంగా ఇక్కడే ఉంచాము. ఎందుకంటే మనం వాటిని ముందుగా ఒక స్నేహితునికి ఇచ్చి తాగించాలి, ఆ తర్వాత మనం తాగాలని అనుకున్నాము. ఈ రోజు అవి నాకు గుర్తుకు వచ్చాయి.' "హుజూర్ (అ) ఆ శర్బత్‌తో ఒక పానీయం తయారు చేసి నాకు అందించారు. (తనకు అందిన ఈ బహుమతిని ముందుగా ఒక స్నేహితునికి తాగించాలనే ఉద్దేశంతో దాచమని హుజూర్ (అ) చెప్పారు.) నేను, 'హుజూర్, దయచేసి మీరు ముందుగా కొంచెం తాగండి' అని అన్నాను. (హుజూర్ (అ) పానీయాన్ని పోసిన గ్లాసులో నుంచి ముందుగా మసీహ్ మౌఊద్ (అ) కొంచెం తాగాలని, ఆ తర్వాతే తాను తాగుతానని చెప్పాడు.) అప్పుడు "హుజూర్ (అ) ఒక గుక్క తాగి, తరువాత గ్లాసును నాకు అందించారు. నేను దానిని తాగాను. నేను ఆ పానీయాన్ని ప్రశంసించగా, హుజూర్ (అ) ఇలా అన్నారు: "ఒక సీసాను నీతో తీసుకెళు మరొకదాన్ని బయట ఉన్న స్నేహితులకు ఇచ్చి తాగించు. ఆ రెండు సీసాల నుంచి హుజూర్ (అ) బహుశా ఆ ఒక్క గుక్క మాత్రమే తాగి ఉంటారు. హుజూర్ (అ) ఆదేశం ప్రకారం, నేను ఆ సీసాలను తీసుకెళ్లాను."

**(అస్‌హాబే అహ్మద్ సంపుటి 4, పుటలు 168-169)**

అదేవిధంగా, హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ (రజి) ఉల్లేఖించిన దాని ప్రకారం, అహ్మద్ జాన్ సాహిబ్ కుమార్తె అయిన ఆయిషా సాహిబా ఇలా వివరించారు: "1906లో, మా అమ్మగారు మరణించినప్పుడు, హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ అవ్వల్ (రజి) గారి సతీమణి అయిన అమ్మాజీ నన్ను తన ఇంటికి తీసుకువెళ్లారు. ఆమె నాకు అల్పాహారం తినిపించి, నా బాగోగులు చూసుకున్నారు. నాలుగు లేదా ఐదు రోజుల తరువాత, హజ్రత్ ఉమ్ముల్ మోమినీన్ (రజి) నన్ను తన సొంత ఇంటికి తీసుకువెళ్లారు. "ఇప్పుడు వంటగది ఉన్న చోట, అమ్మా జాన్ (రజి) నాకు తల స్నానం చేయిస్తున్నారు. (అమ్మా జాన్ (ర.అ.) గారు స్వయంగా తల్లిని కోల్పోయిన ఈ అమ్మాయికి తల స్నానం చేయిస్తున్నారు) ఒక స్త్రీ నా తలపై నీళ్ళు పోస్తోంది. హజ్రత్ ఉమ్ముల్ మోమినీన్ (రజి) నా జుట్టుకు సబ్బు రాసి, కడిగేవారు. సహాయం చేస్తున్న ఆ స్త్రీ చాలా ఎక్కువగా నీళ్ళు పోస్తోంది. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) సమీపంలోనే నడుస్తూ వెళ్తున్నారు. హుజూర్ (అ) ఇది గమనించి, ఆమె చేతిలోని నీటి పాత్రను తీసుకుని, హజ్రత్ అమ్మా జాన్, ఉమ్ముల్ మోమినీన్ (రజి), నా జుట్టు దువ్వుతుండగా, స్వయంగా నెమ్మదిగా, సున్నితంగా నా తలపై నీళ్ళు పోయడం ప్రారంభించారు. ఆపై హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా అన్నారు: 'ఈ విధంగా చేస్తే పేలు బయటకు వస్తాయి."

**(సిరతుల్ మహదీ, సంపుటి 2, కథనం 1509, పేజీ 285)**

(ఆమె తల్లి మరణించడానికి ముందు చాలా కాలం అనారోగ్యంతో ఉన్నందున, ఆమెను సరిగ్గా చూసుకునేవారు ఎవరూ లేరు, అందువల్ల ఆమె జుట్టులో పేలు పట్టి ఉండవచ్చు. అంతేకాకుండా, ఆ రోజుల్లో ఆ ప్రాంతంలో ఇది సర్వ సాధారణంగా జరిగే విషయం కూడా.) హుజూర్ (అ) ఇలా ఆదేశించారు: "జుట్టును ఈ విధంగా కడుక్కో, ఇలాగే దువ్వుతూ ఉండు; పేలు బయటకు వస్తాయి." హుజూర్ (అ) ఇంటి పనులలో కూడా సహాయం చేయడానికి ఏమాత్రం సంకోచించేవారు కాదు.

ముఫ్తీ ముహమ్మద్ సాదిఖ్ సాహిబ్ (రజి) ఇలా వివరించారు:

"ఒకసారి నేను వజూ కోసం నీటిని వెతుకుతూ, చేతిలో ఒక కుండను పట్టుకుని, మస్జిద్ ముబారక్ నుండి హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వారి ఏకాంత నివాసానికి దారితీసే ద్వారం గుండా ప్రవేశించాను. లోపలి నుండి నీరు తీసుకు రమ్మని హుజూర్ (అ) వారి పరిచారకులలో ఒకరికి ఆ కుండను ఇవ్వాలన్న ఉద్దేశ్యంతో నేను వెళ్లాను. యాదృచ్ఛికంగా, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) లోపలి నుండి బయటకు వచ్చి, నేను అక్కడ నిలబడి ఉండటం చూసి, 'నీకు నీరు కావాలా?' అని అడిగారు. నేను, 'అవును, హుజూర్ (అ)' అని జవాబిచ్చాను. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) నా చేతి నుండి ఆ కుండను తీసుకుని, 'నేనే స్వయంగా తీసుకువస్తాను' అని అన్నారు. ఆ తర్వాత వారు లోపలికి వెళ్లి, దానిని నీటితో నింపి, తిరిగి తీసుకువచ్చి ఇచ్చారు."

**(జిక్ర్-ఎ-హబీబ్, పేజీలు 257-258)**

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ (రజి) ఇలా వివరించారు: డాక్టర్ ఖలీఫా రషీదుద్దీన్ సాహిబ్ (రజి) వారి గౌరవనీయమైన సతీమణి మురాద్ ఖతూన్ సాహిబా గారు ఇలా పేర్కొన్నారు: ఒకసారి హజ్రత్ ఉమ్ముల్ మోమినీన్ (రజి) మరియు అక్కడ ఉన్నవారందరూ కలిసి మామిడి పండ్లు తిన్నారు. (అది మామిడి పండ్ల కాలం, మరియు ఆ సమయంలో ఎక్కువగా కోయకుండా రసం పీల్చే రకం మామిడి పండ్లు ఉండేవి.) ఆవరణలో, రెండు మూడు కుప్పలుగా తొక్కలు మరియు గింజలు పేరుకుపోయాయి. అక్కడ చాలా మంది స్త్రీలు కూర్చుని ఉన్నారు, మరియు పెద్ద సంఖ్యలో ఈగలు గుమిగూడటం ప్రారంభించాయి. వారు సంభాషణలో నిమగ్నమై, వెంటనే శుభ్రం చేయడం గురించి ఆలోచించలేదు. ఆ సమయంలో తాను కూడా అక్కడే కూర్చుని ఉన్నానని, మరియు కొంతమంది మహిళా పరిచారికలు కూడా అక్కడ ఉన్నారని ఆమె చెప్పారు. (ఆ సమయంలో అక్కడ మహిళా కార్మికులు మరియు పరిచారికలు ఉన్నారు.) ఈ సమయంలో, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వచ్చారు, వారు (అ) ఆ స్థితిని చూసి, స్వయంగా ఒక కుండను తీసుకుని, అందులో ఫినైల్ క్రిమిసంహారక మందు కలిపి, ఈగలు వెళ్లిపోవడానికి మరియు ఆ ప్రదేశం శుభ్రపడి ఎటువంటి దుర్వాసన రాకుండా ఉండటానికి దానిని తన చేతితో ఆవరణలోని మామిడి తొక్కల కుప్పల మీద పోశారు.

**(సిరతుల్ మహదీ, సంపుటి 2, కథనం 1470, పుట 261)**

హుజూర్ (అ) ఎవరిని ఏమీ అనకుండా, పరిశుభ్రతను వెంటనే పాటించాలని తన చేతల ద్వారా చేసి చూపించారు. ఇక్కడ, హుజూర్ (అ) వినయంతో పాటు, పరిశుభ్రత పట్ల వారికున్న శ్రద్ధ కూడా స్పష్టంగా కనిపిస్తుంది.

లాహోర్‌కు చెందిన డాక్టర్ అల్లామా ఇక్బాల్ మరియు సర్ షహాబుద్దీన్‌తో సహా కొంతమంది ప్రముఖులు ఉన్న ఒక ప్రతినిధి బృందం, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)ను కలవడానికి వచ్చింది. ఈ సమావేశాన్ని వివరిస్తూ, బాబు గులాం ముహమ్మద్ సాహిబ్ (రజి) ఇలా తెలిపారు: రాత్రి భోజనం తర్వాత, మంచాలు సాంప్రదాయ నేత మంచాలు పంపిణీ చేస్తున్నప్పుడు, నేను ఒక దృఢమైన మరియు పెద్ద మంచాన్ని తీసుకున్నాను. అయితే, తరువాత సర్ షహాబుద్దీన్‌గా ప్రసిద్ధి చెందిన చౌదరి షహాబుద్దీన్ సాహిబ్, దానిని నా నుండి లాక్కుని, నా మంచంపై పడుకున్నారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వచ్చి, అందరూ సౌకర్యంగా ఉన్నారా అని అడిగారు. అందరూ తాము బాగానే ఉన్నామని చెప్పారు. కానీ హుజూర్ (అ) నా దగ్గరికి వచ్చేసరికి, నా మంచాన్ని చౌదరి షహాబుద్దీన్ తీసుకున్నారని నేను ఆందోళనగా నిలబడి ఉన్నాను. నేను, "హుజూర్ (అ), నా మంచాన్ని చౌదరి షహాబుద్దీన్ తీసుకున్నాడు, నేను ఎక్కడ పడుకోవాలో తెలియక అయోమయంలో ఉన్నాను" అని అన్నాను. అందుకు హుజూర్ (అ) "ఆగుము, నీకోసం మంచం తెస్తాను" అన్నారు. హుజూర్ (అ) వెళ్ళిపోయారు, చాలా సేపటికి మంచం రాలేదు. అప్పుడు నేను హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వారి నివాసంలోని ప్రాంగణపు తలుపులోంచి చూశాను. అక్కడ ఒక వ్యక్తి వేగంగా మంచం అల్లుతుండగా, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) అతని పక్కన కూర్చుని, చేతిలో దీపం పట్టుకుని అతనికి చూపిస్తున్నారు. ఇది చూసి, నాకు చాలా సిగ్గుగా అనిపించింది. తలుపు తెరి ఉండటంతో నేను ముందుకు వెళ్ళాను. "హుజూర్ (అ) దయచేసి నాకు ఈ దీపాన్ని ఇవ్వండి" అని అన్నాను. కాని హజ్రత్ మసీహ్ మౌవూద్(అ) "ఇక ఒక్క చుట్టు మాత్రమే మిగిలి ఉంది" అని జవాబిచ్చారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వారి ఈ ఉదాత్తమైన నైతిక విలువలను గమనించినప్పుడు నాపై ఎంతటి ప్రభావం పడిందంటే నా కళ్ళ నుండి నీళ్ళు తిరిగాయి. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వారి ధన్యమైన ముఖాన్ని చూస్తూ, నేను నాలో నేను ఇలా అనుకుంటూ ఉన్నాను: "ఇది ఎంత మాత్రం ఒక అబద్ధికుని ముఖం కాజాలదు." **(లాహోర్ తారీఖ్-ఎ-అహ్మదియ్యత్, పేజీలు 217-218)**

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారికి సేవలు అందించిన దివంగత మిర్జా ఇస్మాయిల్ బేగ్ గారి సాక్ష్యం ఈ విధంగా ఉంది: తమ వాగ్దానంను ప్రకటించడానికి ముందు, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారు తమ తండ్రిగారి ఆదేశం మేరకు న్యాయపరమైన కేసుల నిమిత్తం ప్రయాణం చేసేవారు. అప్పుడు ప్రయాణ సాధనంగా తరచుగా ఒక గుర్రం ఉండేది మరియు సాధారణంగా నేను వారితో పాటు వెళ్ళేవాడిని. అయితే, వారు ఎప్పుడు బయలుదేరినా కాలినడకనే బయలు దేరేవారు. గుర్రంపై నన్ను ఎక్కించి, వారు స్వయంగా నడిచేవారు. మరల ఇలా తెలిపారు: "నేను పదే పదే నిరాకరిస్తూ, 'హుజూర్ (అ), నాకు సంకోచంగా (సిగ్గుగా) అనిపిస్తోంది' అని విన్నవించే వాడిని. దానికి హుజూర్ (అ) 'కాలినడకన వెళ్ళడంలో నాకు ఎలాంటి సంకోచం లేదు , మరి గుర్రంపై వెళ్ళడంలో మీకు ఎందుకు సంకోచిస్తున్నారు?' అని సమాధానమిచ్చేవారు." ఖాదియాన్ నుండి బయలు దేరేటప్పుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారు ఎప్పుడూ నన్నే ముందుగా గుర్రంపై ఎక్కించేవారు. ప్రయాణంలో సగం దూరం లేదా అంతకంటే కొంచెం తక్కువ లేదా ఎక్కువ దూరం వెళ్ళిన తర్వాత, నేను దిగిపోయేవాడిని మరియు హుజూర్ (అ) గుర్రంపై ఎక్కేవారు. అదే విధంగా, కోర్టు నుండి తిరిగి వచ్చేటప్పుడు కూడా, వారు (అ) ముందుగా నన్ను గుర్రంపై ఎక్కించేవారు, ఆ తర్వాత వారు (అ) స్వయంగా గుర్రంపై ఎక్కేవారు. వారు (అ) గుర్రంపై వెళ్ళేటప్పుడు, గుర్రాన్ని దాని సహజ నడక వేగంతోనే వెళ్ళనిచ్చేవారు, తద్వారా వారి పక్కన నడుస్తున్న నాకు ఎలాంటి ఇబ్బందీ కలిగేది కాదు.

**(అబ్దుల్ ఖాదిర్ సాబిక్ సౌదాగర్ ముల్, హయాత్-ఎ-తయ్యిబా, పేజీ 16)**

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ (రజి) ఇలా ఉల్లేఖించారు: మౌల్వి షేర్ అలీసాహిబ్ (రజి) నాతో ఇలా అన్నారు: హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారికి మౌల్వి ముహమ్మద్ అలీ సాహిబ్ గారిని ఏదైనా విషయం గురించి అడగవలసి వచ్చినప్పుడల్లా, ఆయనను పిలిపించుకోవడానికి బదులుగా, స్వయంగా మౌల్వి సాహిబ్ గారి చిన్న గదికి వెళ్ళేవారు. హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ (రజి) మరల ఇలా అన్నారు. నేను ఒక విషయం చెప్పాలి, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వారి జీవితకాలంలో, మౌల్వి ముహమ్మద్ అలీ సాహిబ్ హుజూర్ (అ) ఇంటిలోని ఒక భాగంలో నివసించేవారు . హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారు ఆయనకు ఒక గదిని ఇచ్చారు, మరియు మస్జిద్ ముబారక్‌కు తూర్పున ఉన్న ఆ చిన్న గదిలోనే ఆయన కార్యాలయం ఉండేది.

**(సిరతుల్ మహదీ, సంపుటి 1, కథనం 394, పేజీ 357)**

అక్కడికే హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)వారు స్వయంగా ఆయన వద్దకు వెళ్ళేవారు. మౌల్వీ సాహిబ్, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వారి వినయం నుండి తాను నేర్చుకోవలసిన పాఠాన్ని నేర్చుకోకపోవడం విచారకరమైన విషయం, మరియు చివరికి ఆయన అహంకారమే ఆయన నాశనానికి కారణమైంది.

అల్ హకం సంపాదకులు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వారి నిరాడంబరత గురించి ఇలా వ్రాశారు: హుజూర్ (అ) నడకకు బయలుదేరినప్పుడు, ఎటువంటి భేదాభిప్రాయం పాటించేవారు కాదు. ఎవరూ వెనుకబడి ఉండవలసిన అవసరం లేదు. నిజానికి, ఒకవేళ హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ముందు నడిచినచో దుమ్ము, మట్టి ఎగురుతాయని ప్రముఖ అనుచరులు భావించేవారు. కంకర వేయని రోడ్ల నుండి దుమ్ము లేచేది, అయినప్పటికీ హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) అటువంటి విషయాన్ని

ఏ మాత్రం పట్టించుకునేవారు కాదు. తరచుగా హుజూర్ (అ) వెనుక నడిచేవారు ప్రమాదవశాత్తు హుజూర్ (అ)కు తగలడం, లేదా ఎవరిదైనా పాదానికి హుజూర్ (అ) కాలు తగిలి వారి బూటు ఊడిపోవడం, లేదా ఆ దెబ్బకు హుజూర్ (అ) చేతికర్ర కింద పడిపోవడం జరిగేది. అయినప్పటికీ, హుజూర్ (అ) ఎలాంటి అసంతృప్తిని వ్యక్తం చేయడం గానీ, ఏదైనా ప్రత్యేక ప్రాధాన్యతను చూపించడం గానీ ఎవరూ చూడలేదు, వినలేదు. అంతేగాకా హుజూర్ (అ) "మీరు కొంచెం చూసుకుంటూ నడవలేరా? అని కూడ ఎన్నడు అనలేదు.  మసీదులో అనేక సందర్భాల్లో ఇలా జరిగేది. హుజూర్ (అ) తన సహచరుల మధ్య కూర్చుని ఉండగా ఒక అపరిచితుడు అక్కడికి వచ్చేవారు. ఆ వ్యక్తి మౌలానా మౌల్వీ అబ్దుల్ కరీం లేదా హజ్రత్ హకీమ్-ఉల్-ఉమ్మత్ హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ అవ్వల్ (రజి)లలో ఒకరిని 'మౌవూద్ మసీహ్' (అ) అని భావించి, ముందుగా వారితో కరచాలనం చేసేవాడు. అప్పుడు ఆ పెద్దలు 'మౌవూద్ మసీహ్' (అ) ఎక్కడ కూర్చుని ఉన్నారో వారికి చూపించేవారు. క్లుప్తంగా చెప్పాలంటే, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) తన గురువుగారైన దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (స) గారి ఆచరణ విధానమునే  తన సొంత విధానముగా మలుచుకున్నారు. తన జీవితమంతా అదే ఆదర్శాన్ని ఆచరించి చూపారు.

**(మల్ఫూజాత్, సంపుటి 2, పేజీ 270, పాదిక, ప్రచురణ 2022)**

డాక్టర్ బషారత్ అహ్మద్ సాహెబ్ ఒక కథనాన్ని ఇలా తెలిపారు:

మాలేర్‌కోట్ల నవాబ్ ముహమ్మద్ అలీ ఖాన్ గారి భార్య మరణించారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) అంత్యక్రియల ఊరేగింపుతో పాటు స్మశానవాటికకు వెళ్లి, స్వయంగా జనాజా నమాజ్‌ను చదివించారు. అప్పటికి సమాధి సిద్ధం కాలేదు. నేను కూడా ఆ ఊరేగింపులో ఉన్నాను. మరల ఇలా తెలిపారు: ప్రజలు సమాధిని చూడటంలో నిమగ్నమయ్యారు, నేను కూడా నా దృష్టిని అటువైపు మళ్లించాను. కాసేపటి తర్వాత చుట్టూ చూస్తే, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఎక్కడా కనిపించ లేదు. నేను ఆందోళనతో వెతకగా, తోటలోని ఒక మూలలో హుజూర్ (అ) ఒంటరిగా నేల మీద కూర్చుని ఉండటం కనిపించింది. నేను వెంటనే ఒక చెట్టు కింద తెల్లని దుప్పటిని పరిచి, హుజూర్ (అ) దగ్గరకు వెళ్లి ఇలా విన్నవించుకున్నాను: "ఇక్కడ ఎండ నేరుగా పడుతోంది. దయచేసి అక్కడున్న చెట్టు నీడలో వచ్చి కూర్చోండి." అప్పుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) "అవును, అది సరైనదే" అని చెప్పి, అక్కడికి వచ్చి చెట్టు నీడలో ఉన్న దుప్పటిపై కూర్చున్నారు. నేను కూడా దగ్గరలోనే కూర్చున్నాను. మరల ఇలా తెలిపారు: కొద్ది సేపటికే, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) చెట్టు కింద కూర్చుని ఉండటం గమనించిన ప్రజలు హుజూర్ (అ) దగ్గరకు రావడం మొదలు పెట్టారు. అప్పుడు, ఒక్కొక్కరు అక్కడికి వస్తుండగా, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వారితో "రండి, రండి – దయచేసి ఇక్కడ కూర్చోండి" అని చెప్పేవారు. అంతేకాక, తాము వెనక్కి జరిగి, కొత్తగా వచ్చిన వారిని ఆ దుప్పటిపై కూర్చోబెట్టేవారు. జనం వస్తూనే ఉన్నారు, హుజూర్ (అ) వెనక్కి జరుగుతూ ప్రతి ఒక్కరినీ ఆ దుప్పటిపై కూర్చోబెడుతూ వచ్చారు. చివరికి, కొద్ది సేపటి తర్వాత నేను గమనించగా, ఆ దుప్పటిపై హుజూర్ (అ) వారి సహచరులందరూ కూర్చుని ఉండగా, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) మాత్రం నేల మీద కూర్చుని ఉండటం నాకు కనిపించింది. హుజూర్ (అ)ను కలుసుకోవాలనే ఉత్సాహంలోనూ ఆనందం లోనూ మునిగిపోయిన వారికి, తాము దుప్పటిపై కూర్చుని ఉండగా హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) నేల మీదకు మారారన్న విషయం గమనించే అవకాశం కలగలేదు. కానీ మరల ఇలా తెలిపారు. "నేను ఆ దృశ్యాన్ని చూస్తూ, అంతరంగంలో ఎంతో ప్రభావితమయ్యాను. అదే సమయంలో నా విశ్వాసం కూడా బలపడింది. అల్లాహ్ హుజూర్ (అ)కు ఎంతటి ఉన్నత స్థానాన్ని ప్రసాదించారో, అలాగే వారి(అ) ఆత్మలో ఎంతటి గాఢమైన వినమ్రత మరియు నిరాడంబరత ఇమిడి ఉన్నాయో అని నేను భావించాను." **(ముజద్దిద్-ఎ-ఆజమ్, సంపుటి 2, పేజీలు 1293-1294)**

అమృత్‌సర్‌లో అబ్దుల్లా ఆథమ్‌తో చర్చ జరుగుతున్న రోజుల్లో జరిగిన ఒక సంఘటనను మున్షీ జాఫర్ అహ్మద్ ఇలా వివరించారు. మేము బహుశా కరీం బక్ష్ ఇంట్లో బస చేసి ఉన్నప్పుడు, కల్నల్ అల్తాఫ్ అలీ ఖాన్ మాతో చేరారు. ఆయన నాతో మాట్లాడుతూ, తాను హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)ను ఏకాంతంగా కలవాలను కుంటున్నానని చెప్పారు. ఆ కల్నల్ కోటు, ప్యాంటు ధరించి, గడ్డం గీసుకుని ఉన్నారు. నేను ఆయనతో, "దయచేసి లోపలికి వెళ్ళండి. బయటి నుండి మరెవరినీ లోపలికి రానివ్వము" అని చెప్పాను. దాంతో ఆ కల్నల్ లోపలికి వెళ్లి,హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)తో దాదాపు అరగంట పాటు ఏకాంతంగా ఉన్నారు. కల్నల్ బయటకు వచ్చినప్పుడు, ఆయన కళ్ళ నుండి నీళ్ళు ధారగా కారుతున్నాయి. నేను ఆయనను, "మీ మధ్య ఏం చర్చ జరిగింది, మీరు ఏ స్థితిలో ఉన్నారు?" అని అడిగాను. అతను ఇలా చెప్పాడు: "నేను లోపలికి వెళ్ళినప్పుడు, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఒక రెల్లు చాప మీద గాఢమైన ఆలోచనలలో కూర్చుని ఉన్నారు . అయితే నిజానికి హుజూర్ (అ) మోకాలు మాత్రమే చాప మీద ఉంది, మిగతా శరీరం నేల మీద ఉంది. నేను అన్నాను: 'హుజూర్ (అ)! మీరు నేల మీద కూర్చున్నారు.' అందుకు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) బహుశా నేను ఒక కల్నల్‌గా చాప మీద కూర్చోవడానికి ఇష్టపడనని భావించి, తన తలపాగా వస్త్రాన్ని తీసి, దానిని విప్పి నేల మీద పరిచి, నాతో ఇలా అన్నారు: 'దయచేసి ఇక్కడ కూర్చోండి, కల్నల్. బహుశా మీరు చాప మీద కూర్చోవడానికి ఇష్టపడక పోవచ్చు, ఇదిగో, నేను ఈ వస్త్రాన్ని పరుస్తాను, దయచేసి దీనిపై కూర్చోండి.' తన తల నుండి వస్త్రాన్ని తీసి నేల మీద పరుస్తూ." కల్నల్ ఇలా అన్నారు: "ఇది చూసి నా కళ్ళ నుండి నీళ్ళు ప్రవహించాయి, మరియు నేను ఇలా విన్నవించుకున్నాను: 'నేను బాప్తిస్మం పొందినప్పటికీ" అంటే నేను క్రైస్తవ మతాన్ని స్వీకరించినప్పటికీ "హుజూర్ (అ) వారి తలపాగాపై కూర్చునేంత విశ్వాసహీనుడను నేను కాదు."హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా జవాబిచ్చారు: "దానిలో తప్పు ఏమీ లేదు, ఏ హానీ లేదు. దయచేసి స్వేచ్ఛగా కూర్చోండి." ఏది ఏమైనప్పటికీ, ఆయన ఇలా చెప్పారు: "నేను నా చేతితో ఆ వస్త్రాన్ని పక్కకు జరిపి చాపపై కూర్చున్నాను. నా పరిస్థితిని హుజూర్ (అ)కు వివరించడం మొదలుపెట్టాను. అంటే నేను విపరీతంగా మద్యం సేవించేవాడినని, ఇతర పాపాలు కూడా చేసేవాడినని, దేవుని గురించి గానీ లేదా ప్రవక్త గురించి గానీ నాకు ఏమీ తెలియదని చెప్పాను. కానీ ఇప్పుడు మీ సమక్షంలో ప్రకటిస్తున్నాను. నేను క్రైస్తవ మతాన్ని విడనాడి ముస్లింను అవుతున్నాను. గతంలో నేను క్రైస్తవ మతాన్ని స్వీకరించినప్పటికీ, ఇప్పుడు మీ స్థితిని చూసి, మీ మాటలు విని ముస్లింను అవుతున్నాను. అయితే, నన్ను ఆవహించిన దుర్గుణాలను వదిలించుకోవడం చాలా కష్టంగా అనిపిస్తోంది." అప్పుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)) ఇలా అన్నారు: "ఇస్తిగ్ఫార్ (పాప క్షమాపణ కోరడం) పఠించండి మరియు రోజుకు ఐదు పూటల నమాజు చేసే అలవాటును ఏర్పరచుకోండి." ఇదే దానికి పరిష్కారం. ఒకవేళ పాపాలు పాతుకుపోయి, మనిషి మతం నుండి దారితప్పినట్లయితే, అతను అధికంగా ఇస్తిగ్ఫార్ పఠించాలి మరియు తన నమాజుల పట్ల శ్రద్ధ వహించాలి. మరల ఇలా అన్నా రు: "హుజూర్ (అ) సమక్షంలో కూర్చున్నంత సమయం నా స్థితి మారుతూనే ఉంది, నేను నిరంతరం ఏడుస్తూనే ఉన్నాను. ఆ స్థితిలోనే నేను కచ్చితంగా ఇస్తిగ్ఫార్ పఠిస్తానని, నమాజులు చేస్తానని ప్రతిజ్ఞ చేశాను. అలా ప్రమాణం చేసి, హుజూర్ (అ) వద్ద సెలవు తీసుకుని అక్కడి నుండి వెళ్ళిపోయాను. ఆ రోజు నా హృదయంపై కలిగిన ప్రభావం ఇప్పటికీ అలాగే నిలిచి ఉంది." ఈ కల్నల్ ఆ చర్చా కార్యక్రమంలో పాల్గొని క్రైస్తవుల వైపు కూర్చునేవారు. కానీ ఆయన స్వతహాగా మంచి స్వభావం కలవారు, అందుకే సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆయనకు తిరిగి ఇస్లాంను స్వీకరించే భాగ్యాన్ని ప్రసాదించారు. **(అస్‌హాబ్-ఎ-అహ్మద్, సంపుటి 4, పేజీలు 150-151)**

మౌల్వీ అబ్దుల్ కరీం సియాల్కోటీ సాహెబ్ (రజియల్లాహు అన్హు) 1896 లేదా ఆ ప్రాంతంలో జరిగిన ఒక సంఘటనను ఇలా వివరించారు. ఎందుకంటే ఆయన ఈ వృత్తాంతాన్ని 1900లో ప్రచురించారు మరియు అంతకు నాలుగేళ్ల క్రితం జరిగిన విషయాన్ని వివరిస్తున్నారు. ఆయన ఇలా వివరిస్తున్నారు: "హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వారి కుటుంబ సభ్యులు లుధియానాకు వెళ్లారు. అది జూన్ నెల, మరియు ఆ ఇంటి లోపలి భాగం అప్పుడే నిర్మించబడింది. ఒక మధ్యాహ్నం, నేను అక్కడ పరిచిన ఒక మంచం మీద పడుకున్నాను. ఆ సమయంలో, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) సమీపంలో తీరికగా నడుస్తున్నారు. ఒకానొక సమయంలో నేను మేల్కొన్నప్పుడు, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) నా మంచం కింద నేలపై పడుకుని ఉండటం చూశాను. ఉలిక్కిపడి, గౌరవంతో నేను లేచి కూర్చున్నాను. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఎంతో ఆప్యాయంగా, 'ఎందుకు లేచావు?' అని అడిగారు. నేను, 'మీరు కింద పడుకుని ఉండగా నేను మంచం మీద ఎలా నిద్రపోగలను?' అని విన్నవించుకున్నాను. అందుకు హుజూర్ (అ) చిరునవ్వుతో, 'నేను నీకోసం కాపలా కాస్తున్నాను. పిల్లలు అల్లరి చేస్తున్నారు, నీ నిద్రకు భంగం కలగకూడదని నేను వారిని ఆపుతున్నాను' అని బదులిచ్చారు." **(హజ్రత్ షేక్ యాకూబ్ అలీ ఇర్ఫానీ (ర.అ), సిరత్ హజ్రత్ మసీహ్-ఎ-మౌవూద్, పేజీ 147)**

హజ్రత్ మున్షీ ఇమామ్ దీన్ సాహిబ్ తన బైఅత్ నాటి దృశ్యాన్ని ఈ విధంగా వర్ణించారు: "1894లో, నేను హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వారి పవిత్ర హస్తంపై బైఅత్ చేశాను. సాయంకాల నమాజ్ సమయం వరకు నా సోదరుడు మున్షీ అబ్దుల్ అజీజ్ సాహిబ్ మరియు సిఖ్వాన్‌కు చెందిన భాయ్ జమాలుద్దీన్ సాహిబ్ నాతో ఉన్నారు. ప్రార్థన ముగిసిన తరువాత, మున్షీ సాహిబ్ నా వైపు సైగ చేసి, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వారికి ఇలా విన్నవించారు, 'హుజూర్ (అ)! దయచేసి ఇతని బైఅత్ స్వీకరించండి.' హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వారు, 'అతన్ని లోపలికి రానివ్వు' అన్నారు. నేను ఒంటరిగా బైతుల్ ఫిక్ర్‌లోకి ప్రవేశించి నప్పుడు, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వారు ఒక మంచం పాదాల వద్ద కూర్చుని, దాని తలవైపు కూర్చోమని నాకు సూచించారు. మొదట నేను సంకోచించాను, కానీ హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వారు ఆ సూచనను పునరావృతం చేయగా, నేను కూర్చున్నాను. అప్పుడు హుజూర్ (అ) నా బైఅత్ తీసుకున్నారు. నేను ఆశ్చర్యపోయాను హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) నుండి ఈ విధమైన ప్రవర్తనను చూడండి. ఒకవైపు, వారి పక్కన సమానంగా కూర్చోవడానికి కూడా ఎవరికీ అర్హత లేని పీర్‌లుగా పిలవబడే ఆధ్యాత్మిక గురువులు ఉండగా, మరోవైపు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క హజ్రత్ మసీహ్ మౌవూద్ ఒక అల్పమైన సేవకుడిని మంచం తలవైపున, అంతకంటే శ్రేష్ఠమైన ఆసనంలో కూర్చోబెట్టారు. నా సోదరుడు మున్షీ అబ్దుల్ అజీజ్ సాహిబ్ గదిలోకి ప్రవేశించనప్పటికీ, ఆయన ఈ దృశ్యాన్ని బయటి నుండే గమనిస్తున్నారు."

**(అషాబ్-ఎ-అహ్మద్, సంపుటి 1, పేజీ 112)**

హజ్రత్ మున్షీ జఫర్ అహ్మద్ సాహెబ్ ఇలా పేర్కొన్నారు: "ఒకసారి లూధియానాలో, దివంగత మున్షీ అరోరా సాహెబ్ మరియు నేను 'హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారికి ఇలా విన్నవించాము: 'ఏదో ఒక సమయంలో మీరు కపుర్తలాను సందర్శించాలి.' ఆ రోజుల్లో కపుర్తలాకు ఇంకా రైలు మార్గం చేరుకోలేదు. అప్పుడు 'హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారు, 'మేము తప్పక ఒక రోజు అక్కడికి వస్తాము' అని వాగ్దానం చేశారు. ఆ తర్వాత కొద్ది కాలానికే, 'హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారు మాకు ముందుగా ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే ఒక రోజు కపుర్తలాకు వచ్చారు. వారు(అ)గుర్రపు బండిలో వచ్చి, బండి దిగిన తర్వాత కపుర్తలాలోని 'నజ్దిక ఖాన్' ప్రాంతంలో ఉన్న ఫతేవాలీ మసీదుకు వెళ్లారు. అప్పుడు హాఫిజ్ హామీద్ అలీ సాహెబ్ వారితో పాటు ఉన్నారు. మసీదు నుండి, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)

గారు అక్కడి స్థానిక మత గురువును (ఆయన అహ్మదీ కాదు) పిలిచి, తన రాక గురించి మున్షీ అరోరా సాహెబ్‌కు లేదా మున్షీ జఫర్ అహ్మద్ సాహెబ్‌కు తెలియ జేయమని పంపారు.” మరల ఇలా తెలిపారు: “నేను మరియు మున్షీ అరోరా సాహిబ్ కోర్టు కార్యాలయంలో షార్ట్‌హ్యాండ్ రచయితలుగా పని చేస్తున్నప్పుడు, ఒక మౌల్వీ అక్కడికి వచ్చి మాకు ఇలా చెప్పారు: ‘మిర్జా సాహిబ్ మసీదులో ఉన్నారు, మీకు ఈ విషయం తెలియజేయమని ఆయన నన్ను పంపారు.’ ఆశ్చర్యపోయిన మున్షీ అరోరా సాహిబ్ ఆశ్చర్యంతో కూడిన స్వరంతో పంజాబీలో ఇలా అన్నారు: ‘మిర్జా సాహిబ్ నిజంగా మీ మసీదుకు వచ్చి బస చేసారా? అది ఎలా సాధ్యం? అబద్ధం చెప్పకండి.’ అప్పుడు నేను, ‘మనం కనీసం వెళ్లి చూద్దాం’ అని అన్నాను. దాంతో మున్షీ సాహిబ్ త్వరగా తన తలపాగా చుట్టుకుని నాతో పాటు బయలుదేరారు. మేము మసీదులోకి ప్రవేశించినప్పుడు, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) నేలపై పడుకుని ఉండటం, హాఫిజ్ హమీద్ అలీ సాహిబ్ వారి పాదాలను ఒత్తుతూ ఉండటం చూశాము. దగ్గరలో ఒక గిన్నె మరియు చెంచా ఉన్నాయి. వాటిని చూస్తుంటే హుజూర్(అ) బహుశా పాలు తాగి ఉండవచ్చని లేదా పాలలో నానబెట్టిన రొట్టె తిని ఉండవచ్చని అనిపించింది. మున్షీ అరోరా సాహిబ్ ఇలా విన్నవించారు: ‘అయ్యా, మీరు ఈ మార్గంలో వస్తున్నట్లు మాకు తెలియజేసి ఉండాల్సింది. మిమ్మల్ని ఆహ్వానించడానికి మేము కర్తార్‌పూర్ స్టేషన్‌కు వచ్చి ఉండే వాళ్ళం కదా!.’ దానికి హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా సమాధానమిచ్చారు: ‘మీకు తెలియజేయాల్సిన అవసరం ఏముంది? నేను మీకు ఒక మాట ఇచ్చాను, దానిని నెరవేర్చాల్సి ఉంది. ఇప్పుడు నేను దానిని నెరవేర్చాను.”

**(అషాబ్-ఎ-అహ్మద్, సంపుటి 4, పేజీలు 141-142)**

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా పేర్కొన్నారు:

“నా పరిస్థితి ఏమిటంటే, నేను నమాజ్‌లో నిమగ్నమై ఉన్నప్పుడు, ఎవరైనా బాధలో ఉండి వారి ఆర్తనాదం నా చెవిన పడితే, నా నమాజ్‌ను మధ్యలో ఆపాల్సి వచ్చినా సరే, వారికి సహాయం చేయడానికి మరియు సాధ్యమైనంత వరకు సానుభూతి చూపడానికి నేను కదులుతాను. బాధలో మరియు కష్టాల్లో ఉన్న సోదరుడికి అండగా నిలవకపోవడం నైతిక సూత్రాలకు విరుద్ధం. మీరు మరేమీ చేయలేక పోయినా, కనీసం వారి కోసం దుఆ చేయండి. మన వారి గురించి మాత్రమే కాదు, హిందువులు మరియు ఇతరుల పట్ల కూడా మీరు అటువంటి నైతికత మరియు సానుభూతిని ప్రదర్శించాలని నేను చెబుతాను. మనిషి ఆలోచనా రహిత స్వభావాన్ని కలిగి ఉండకూడదు.”

ఇది కేవలం ఒక సలహా మాత్రమే కాదు. పైగా, వివరించబడిన అన్ని సంఘటనల నుండి స్పష్టమవుతున్నట్లుగా,హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) స్వయంగా ఆచరించిన విధానం ఇదే. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా వ్రాస్తున్నారు:

“ఒకసారి నేను నడక కోసం బయటకు వెళ్తుండగా, అబ్దుల్ కరీం అనే వ్యక్తి, అతను ఒక గ్రామంలో భూముల రిజిస్ట్రార్‌గా ఉండేవారు, కూడా నాతో పాటు వచ్చారు. ఆయన నాకంటే కొంచెం ముందు నడుస్తుండగా, నేను కొంత వెనుకగా నడుస్తున్నాను. దారిలో, సుమారు డెబ్బై లేదా డెబ్బై ఐదు ఏళ్ల వయసున్న ఒక బలహీనమైన వృద్ధురాలు మాకు ఎదురయ్యారు. ఆమె అబ్దుల్ కరీంకు ఒక ఉత్తరాన్ని ఇచ్చి, దానిని తనకు చదివి వినిపించమని కోరింది. కానీ ఆయన ఆమెను మందలించి పక్కకు పంపేశారు. ఇది నా హృదయాన్ని కలచివేసింది. అప్పుడు ఆ వృద్ధురాలు ఆ ఉత్తరాన్ని నాకు ఇచ్చింది. నేను ఆ ఉత్తరాన్ని తీసుకుని అక్కడే ఆగి పోయాను. ఆ తర్వాత, నేను ఆమెకు ఆ ఉత్తరాన్ని చదివి వినిపించి, అందులోని విషయాలను ఆమెకు వివరంగా వివరించాను. దీనికి అబ్దుల్ కరీం ఎంతో సిగ్గుపడ్డారు; ఎందుకంటే ఆయన ఎలాగూ వేచి ఉండాల్సిందే కదా, పైగా ఆ ఆధ్యాత్మిక పుణ్య ఫలాన్ని కూడా కోల్పోయారు.”

**(మల్ఫూజాత్, సంపుటి 2, పేజీలు 176-177)**

అతను ఆ లేఖను వినమ్రతతో చదివి ఉంటే, అది అతనికి మేలు చేసేది.

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ (రజి) ఇలా పేర్కొన్నారు:

“ఈ అల్పుడు (నేను) విన్నవించేదేమిటంటే, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఎవరిని కలిసినా చిరునవ్వుతో కలిసేవారు, దాంతో వారి చింతలు మరియు బాధలు తక్షణమే తొలగిపోయేవి. వారి(అ) సాంగత్యంలోకి అడుగుపెట్టగానే హృదయంలోని దుఃఖాలన్నీ కరిగిపోయాయని ప్రతి అహ్మదీ భావించేవారు. వారి(అ) చిరునవ్వు చిందించే ముఖంపై దృష్టి పడగానే, శరీరం అంతటా ఆనంద తరంగాలు ప్రవహించేవి.

“అత్యంత సామాన్యమైన వ్యక్తి మాటలను కూడా శ్రద్ధగా వినడం మరియు ఎంతో ఆప్యాయతతో సమాధానం ఇవ్వడం హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) అలవాటు. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) తమను అందరికంటే ఎక్కువగా ప్రేమిస్తున్నారని ప్రతి ఒక్కరూ తమదైన రీతిలో భావించేవారు. అల్లాహ్ ప్రవక్తల సమావేశాలలో పాటించాల్సిన మర్యాదల గురించి తెలియని కొందరు సాధారణ మరియు నిరక్ష రాస్యులైన వ్యక్తులు, అసంబద్ధమైన కథలను చాలా సేపు చెబుతూ ఉండేవారు. అయిన ప్పటికీ, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) నిశ్శబ్దంగా కూర్చుని వినేవారు మరియు ఎవరినీ మాట్లాడటం ఆపేయమని ఎప్పుడూ చెప్పేవారు కాదు.”

**(సీరతుల్ మహదీ, సంపుటి 1, కథనం 247, పేజీ 227)**

“ఒక వ్యక్తి హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) సమక్షానికి వచ్చారు. ఆయన సాష్టాంగ నమస్కారం చేసి, తన తలను హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)పాదాలపై ఉంచాలని అనుకున్నారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) తన చేతితో వారి తలను పక్కకు జరిపి ఇలా అన్నారు: ‘ఇలా చేయడం ఇస్లాం పద్ధతి కాదు. అస్సలాము అలైకుమ్ అని పలకరించి, కరచాలనం చేయాలి.” **(మల్ఫూజాత్, సంపుటి 9, పేజీ 256)**

హజ్రత్ ముఫ్తీ ముహమ్మద్ సాదిక్ సాహిబ్ ఇలా రాశారు:

‘కాశ్మీర్‌కు చెందిన ఒక పేద పొడుగాటి అహ్మదీ వ్యక్తి, ఎంతో చిత్తశుద్ధి తో తన గ్రామం నుండి ఖాదియాన్‌కు మొత్తం దూరం కాలినడకన వచ్చేవారు. ఆయన పేరు అకలు. ఒకసారి, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) నడకకు బయలు దేరుతున్న సమయంలో ఆయన ఖాదియాన్‌కు చేరుకున్నారు. ఆ కాశ్మీరీ వ్యక్తి కూడా ఆ ప్రాంగణంలో నిలబడి ఉన్నారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)ను చూడగానే ఆయన ప్రేమతో ఉప్పొంగి పోయారు, కన్నీరు కారుస్తూ హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) పాదాలపై తన తలను ఉంచారు.” హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)వంగి, అతన్ని పైకి లేపి ఇలా అన్నారు: ‘ఇది అనుమతించబడదు. ఏ మనిషి ముందు కూడ ఇలా సాష్టాంగ నమస్కారం చేయకూడదు.” **(జిక్ర్-ఎ-హబీబ్, పేజీ 162)**

అంటే, ఒక వ్యక్తి ఎవరి ముందు సాష్టాంగ నమస్కారం చేయకూడదు లేదా ఎవరి పాదాల వద్ద తల వంచి నమస్కరించకూడదు.

హజ్రత్ మౌల్వీ అబ్దుల్ కరీం సాహిబ్ సియాల్కోటీ (రజి) ఇలా రాశారు: “ఒకసారి ఒక వ్యక్తి మా మసీదుకు వచ్చాడు; అతను అప్పటికే ప్రపంచంలో కనిపించే త్యాగులు (ఆధ్యాత్మిక సాధకులు) మరియు సమాధుల సంరక్షకుల వద్దకు వెళ్ళడానికి అలవాటు పడిన వ్యక్తి.” మరల ఇలా రాశారు: “అతను మా మసీదుకు వచ్చినప్పుడు, ప్రజలు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)తో ఎంతో స్వేచ్ఛగా సంభాషించడం చూసి ఆశ్చర్యపోయాడు మరియు హుజూర్ (అ) తో ఇలా అన్నాడు: ‘మీ మసీదులో గౌరవ మర్యాదలు లోపించాయి; ప్రజలు మీతో ఏమాత్రం భయం లేకుండా మాట్లాడుతున్నారు.” మత పెద్దల సభలలో కూర్చోవడానికి అలవాటు పడిన ఆ వ్యక్తి, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)కు మసీదులో గౌరవం ఇవ్వడం లేదని అన్నాడు. ప్రజలు వారి సభలో ఎటువంటి భయం లేకుండా స్వేచ్ఛగా కూర్చుని సంభాషిస్తూ ఉండేవారు. వారు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) పట్ల తగిన గౌరవాన్ని చూపడం లేదని అతను పరోక్షంగా అన్నాడు. అందుకు ‘హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా సమాధానమిచ్చారు: ‘మాంసాహార క్రూర మృగాన్ని చూసి ప్రజలు భయపడినట్లుగా, నన్ను చూసి భయపడేలా భయంకరమైన రీతిలో కూర్చోవడం నా పద్ధతి కాదు. విగ్రహంలా కూర్చోవడాన్ని నేను ఎంతగానో అసహ్యించుకుంటాను. నేను విగ్రహారాధనను నిర్మూలించడానికి వచ్చాను, అంతే తప్ప నేను స్వయంగా విగ్రహంగా మారి ప్రజలు నన్ను ఆరాధించేలా చేయడానికి కాదు. నేను ఇతరుల కంటే నాకు ఏమాత్రం ప్రాధాన్యతనిచ్చుకోనని సర్వోన్నతుడైన అల్లాహ్‌కు బాగా తెలుసు. నా దృష్టిలో, అహంకారి కంటే ఘోరమైన విగ్రహారాధకుడు మరొకరు లేరు మరియు అంతకంటే దుర్మార్గుడు మరొకరు లేరు. అహంకారి ఏ దేవుణ్ణి ఆరాధించడు. వాస్తవానికి, అతను తనను తాను మాత్రమే ఆరాధించుకుంటాడు.”

**(హజ్రత్ షేక్ యాకూబ్ అలీ ఇర్ఫానీ (రజి), సీరత్ హజ్రత్ మసీహ్-ఎ-మౌవూద్ (అ), పేజీ 314)**

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ (రజి) మున్షీ జాఫర్ అహ్మద్ సాహిబ్‌కు సంబంధించిన ఒక సంఘటనను ఇలా వివరించారు. ఒక సందర్భంలో, ఢిల్లీ నుండి తిరిగి వస్తున్నప్పుడు ‘హజ్రత్ మసీహ్ మౌవూద్’ (అ) అమృత్‌సర్‌లో దిగారు. వారితో పాటు హజ్రత్ ఉమ్ముల్ ముమినీన్ (మసీహ్ మౌవూద్ (అ) గారి భార్య) కూడా ఉన్నారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) తన కుమారులలో ఒకరిని (బహుశా మియాఁ బషీర్ అహ్మద్ సాహిబ్ కావచ్చు) ఒడిలోకి తీసుకుని, మరో చేతి కింద ఒక బరువైన సంచిని పట్టుకున్నారు (అంటే, ఒక వైపు బిడ్డను, మరో వైపు సంచిని ఎత్తుకున్నారు). అప్పుడు నన్ను ఉద్దేశించి, “మీరు ఆ ‘పాన్‌దాన్’ (తాంబూలం మరియు ఇతర సామాగ్రి ఉండే పెట్టె) తీసుకోండి” అని ఆదేశించారు. ఆ సమయంలో అక్కడ ఉన్న మున్షీ జాఫర్ సాహిబ్‌కు ఆ చిన్న పాన్‌దాన్‌ను తీసుకోమని చెప్పారు. నేను, “హజ్రత్! దయచేసి ఆ సంచిని నాకు ఇవ్వండి” అని విన్నవించాను. దానికి హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) “వద్దు” అని సమాధానమిచ్చారు. నేను ఒకటి రెండుసార్లు అభ్యర్థించినప్పటికీ, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) అదే సమాధానాన్ని పునరుద్ఘాటించారు. ఏది ఏమైనప్పటికీ, నేను పాన్‌దాన్‌ను తీసుకున్నాను మరియు మేము బయలుదేరాము. ఇంతలో, స్టేషన్‌లో ఉన్న ఇద్దరు లేదా ముగ్గురు యువ ఆంగ్లేయులు నాతో, “వారిని కాసేపు అలాగే నిలబడమని అడగండి” అని అన్నారు. దాంతో నేను, “హజ్రత్! వారు మిమ్మల్ని కాసేపు అలాగే నిలబడమని అడుగుతున్నారు” అని విన్నవించాను. అప్పుడు హుజూర్ (అ)

| **అహ్‌దీస్ బోధనలు** | దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు: **“ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు.”** (కంజూలుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖరూజుల్ మహ్ది, 38671) |
| --- | --- |

దుఆ ఆశించువారు: ***Muhammad Nazeer Ahmad sb, warangal, (Telangana)***

| **అహ్‌దీస్ బోధనలు** | **“ఒక మునల్మానుడి విశిష్ట లక్షణవేమనగా, తన మునల్మాను సోదరుడిని చూసినప్పుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను.” అనగా అతనికి కూడ కూర్చొవడానికి చోటును ఇవ్వవలెను.** (మిష్కాతుల్ మసాబిహ్, కితాబుల్ అదబ్, బాబుల్‌ఖియామ్, ఫసలుస్సాలిస్) |
| --- | --- |

దుఆ ఆశించువారు: ***Muhammad Vazeer Ahmad sb***

అలాగే నిలబడ్డారు. (ఆ ఆంగ్లేయులు కూడా అదే స్టేషన్‌లో ఉన్నారు.) ఆ స్థితిలోనే అంటే ఒక చేత్తో బిడ్డను, మరో చేత్తో సంచిని పట్టుకుని ఉన్నప్పుడే. వారు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వారి ఛాయాచిత్రాన్ని (ఫోటోను) తీశారు. వారు హుజూర్ (అ) ఫోటో తీయాలని కోరుకున్నారు. హుజూర్ (అ) ఎంతో నిరాడంబరంగా ఉన్నప్పటికీ, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వ్యక్తిత్వం వారిని ఎంతగానో ఆకట్టుకుంది. వారు, “మేము ఈ గౌరవనీయులైన వ్యక్తి యొక్క ఫోటో తీయాలనుకుంటున్నాము” అని అన్నారు.

**(సీరతుల్ మహదీ, సంపుటి 2, పేజీలు 58-59, కథనం 1073)**

హజ్రత్ మాలిక్ మౌలా బక్ష్ సాహిబ్ ఇలా వివరించారు:

“అమృత్‌సర్‌లో మా ఇంటికి ఎదురుగా మియాఁ జాన్ ముహమ్మద్ అనే ఒక పెద్దమనిషి నివసించేవారు. ఆయనకు ఎక్కువగా మాట్లాడే అలవాటు ఉండేది. ఆయన ‘హజ్రత్ మసీహ్ మౌవూద్’ (అ) రాసిన ‘సుర్మా-ఎ-చష్మ్-ఎ-ఆర్య’ అనే పుస్తకాన్ని దాదాపు కంఠస్థం చేసుకున్నారు. చదువురాని వారైనప్పటికీ, ఆయన ఆర్య సమాజీకులతో చాలా ఉత్సాహంగా వాదించేవారు. ఆయనకు ఒక మానసిక అనారోగ్యం (ఒక రకమైన డిప్రెషన్ లేదా కుంగుబాటు, దీనిలో అప్పుడప్పుడు తీవ్రమైన ఉద్వేగ స్థితి లేదా ఉన్మాద స్థితి ఏర్పడుతుంది) కలిగింది. ఆయన ఎవరిని కలిసినా, తన అనారోగ్యానికి సంబంధించిన వివరాలను చాలా సుదీర్ఘంగా మరియు కూలంకషంగా చెప్పేవారు, దీనివల్ల అవతలి వ్యక్తులు చాలా సేపు నిలబడాల్సి వచ్చేది. ఆయన మాటలు వినలేక ప్రజలు విసిగిపోయి, ఆయనకు దూరంగా ఉండటం మొదలుపెట్టారు. ఒకరు ఆయనకు ఖాదియాన్‌కు వెళ్లి హజ్రత్ మౌల్వీ హకీమ్ నూరొద్దీన్ సాహిబ్ వద్ద చికిత్స పొందమని సలహా ఇచ్చారు. దానికి ఆయన, ‘వారు చాలా గొప్ప హోదా కలిగిన వ్యక్తి; నా కథను వారు ఎప్పుడు వింటారు?’ అని అన్నారు. అప్పుడు ఆ వ్యక్తి, ‘లేదు, వారు చాలా ఉత్తమమైన నైతిక గుణాలు కలిగినవారు. వారు ఖచ్చితంగా మీ మాట వింటారు’ అని చెప్పారు. దాంతో, ఆ వ్యక్తి ఖాదియాన్‌కు వచ్చారు. “అదృష్టవశాత్తూ, ఆయన అక్కడికి చేరుకుని గుర్రపు బండి దిగుతున్న సమయంలోనే, హజ్రత్ మసీహ్ మౌవూద్’ (అ) తన సహచరులతో కలిసి నడక ముగించుకుని తిరిగి వస్తున్నారు. గుర్రపు బండి నడిపే వ్యక్తి, హజ్రత్ మసీహ్ మౌవూద్’ (అ) వస్తున్నారని చెప్పారు. వెంటనే ఆ పెద్దమనిషి బండి దిగి, నేరుగా హుజూర్ (అ) వద్దకు వెళ్లి కరచాలనం చేసి, తన అనారోగ్య పరిస్థితిని ఎప్పటిలాగే ఆందోళనతో వివరించడం మొదలుపెట్టారు. ఆయన ఒక సుదీర్ఘమైన కథనాన్ని చెప్పడం ప్రారంభించారు.” “ఆ వృత్తాంతం ఎంత సుదీర్ఘంగా సాగిందంటే అందరూ అలసిపోయారు, అయినప్పటికీ హజ్రత్ మసీహ్ మౌవూద్’ (అలైహిస్సలాం) ప్రశాంతంగా నిలబడి, అతని చేతిని తమ చేతిలో పట్టుకుని, అంతా వింటూనే ఉన్నారు. చివరకు, స్వయంగా మియాఁ జాన్ ముహమ్మద్ సాహిబ్ (రోగి) ఇలా అన్నారు: ‘ఇప్పుడు నా నోరు ఎండిపోయింది; నేను ఇక మాట్లాడలేను. నేను ఇంత సేపటి నుండి మాట్లాడుతున్నాను, మీరు వింటూనే ఉన్నారు.’ అప్పుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇలా అన్నారు: ‘సరే, మీరు అతిథి గృహానికి వెళ్లి, ఏదైనా తిని, ఆ తర్వాత మౌల్వీ సాహిబ్ (అంటే హజ్రత్ హకీమ్ మౌల్వీ నూరుద్దీన్ సాహిబ్ (రజి)కు మీ పరిస్థితిని వివరించి, వారి నుండి మందు తీసుకోండి.’

“తదనుగుణంగా, ఆ వ్యక్తి కాస్త సేదతీరిన తర్వాత, మౌల్వీ సాహిబ్ (అంటే హజ్రత్ హకీమ్ నూరుద్దీన్ సాహిబ్ (రజి) సమక్షంలో హాజరై, అదే సుదీర్ఘ వృత్తాంతాన్ని చెప్పడం ప్రారంభించారు. హజ్రత్ మౌల్వీ సాహిబ్ (రజి) వెంటనే ఒక ప్రిస్క్రిప్షన్ (మందుల చీటీ) రాసి వారికి అందించారు. అతను కొంచెం వివరించగానే మౌల్వీ సాహిబ్ విషయం అర్థం చేసుకున్నారు; వైద్యులు కావడంతో, ఆ వ్యాధి ఏమిటో వారికి తెలిసింది. వారు ప్రిస్క్రిప్షన్ రాసి ఇలా అన్నారు: ‘మీ అనారోగ్యం గురించి నాకు తెలుసు, దాని వివరాలు వినాల్సిన అవసరం లేదు.’ అతను ఆ ప్రిస్క్రిప్షన్ తీసుకున్నాడు కానీ ఇలా అన్నాడు: ‘మౌల్వీ నూరుద్దీన్ సాహిబ్ గొప్ప నైతిక గుణాలు కలిగిన వారని అంటారు, కానీ హజ్రత్ మిర్జా సాహిబ్ నైతిక గుణాలతో పోలిస్తే వీరి స్థాయి ఏమిటి!’ ఈ విషయం అతనిపై ఎంతటి గాఢమైన ప్రభావాన్ని చూపిందంటే, అతను బైఅత్ చేశాడు. అంతకుముందు అతను బైఅత్ చేయలేదు, కానీ ఈ సంఘటన కారణంగా అతను బైఅత్ చేశాడు. దివంగత డాక్టర్ ఇబాదుల్లా సాహిబ్ ఈ సంఘటనను వారి సమక్షంలోనే వివరించారని, జాన్ ముహమ్మద్ కూడా దానిని ధృవీకరించారని చెప్పబడింది. **(అషాబ్-ఎ-అహ్మద్, సంపుటి 1, పేజీలు 143-144)**

అదేవిధంగా, హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ (రజి) ఇలా రాశారు: మాస్టర్ అల్లా దితా సాహిబ్ ఒక వృత్తాంతాన్ని లిఖితపూర్వకంగా తెలియజేశారు. ఒక సందర్భంలో, లాహోర్‌లోని అహ్మదీయా భవనంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) కూర్చుని ఉన్నప్పుడు, షరక్‌పూర్ భైని నుండి ముస్తకీమ్ అనే పేరు గల ఒక బలహీనమైన వృద్ధుడు హుజూర్ (అ)ను కలవడానికి వచ్చారు. జనసందోహం మధ్యలో ఆయన హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వద్దకు చేరుకోలేక, “ఓ మహాత్మా! నేను మిమ్మల్ని కలవడానికే వచ్చాను” అని గట్టిగా పిలిచారు. అప్పుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) “ఆ గౌరవనీయులైన వృద్ధుడిని ముందుకు రానివ్వండి” అని ఆదేశించారు. ఆయన వృద్ధుడు కావడంతో సరిగ్గా నిలబడలేక పోతుండేవారు. దీనిని గమనించిన హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) “ఈ వృద్ధుడికి ఇబ్బంది కలిగించవద్దు” అని సూచించి, స్వయంగా లేచి ఆయన వద్దకు వెళ్లి, ఆయన పక్కన కూర్చున్నారు.

**(సీరతుల్ మహదీ, సంపుటి 1, కథనం 740, పేజీ 672)**

డాక్టర్ మీర్ ముహమ్మద్ ఇస్మాయిల్ సాహిబ్ నుండి హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ (ర) ఇలా ఉదహరించారు: ఒకసారి ‘హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) తన అనుచరులతో కలిసి బాబా నానక్ సాహిబ్ యొక్క ‘చోలా’ (దుస్తులు)ను దర్శించడానికి ‘డేరా బాబా నానక్’కు వెళ్లారు. అక్కడ జమాత్ సభ్యులు ఒక చెట్టు కింద వస్త్రాలు పరిచి హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)తో పాటు కూర్చున్నారు. అక్కడ ఉన్నవారిలో మౌల్వీ ముహమ్మద్ అహ్సాన్ సాహిబ్ కూడా ఉన్నారు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) రాక గురించి తెలిసిన గ్రామస్తులు అక్కడికి గుమిగూడటం ప్రారంభించారు. మొదట వచ్చిన వారిలో కొందరు మౌల్వీ ముహమ్మద్ అహ్సాన్ సాహిబ్‌ను హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) అని పొరబడి, ఆయనతో కరచాలనం చేసి కూర్చున్నారు. అలా మూడు లేదా నాలుగు గురు వ్యక్తులు కరచాలనం చేసిన తర్వాత, వారికి తమ పొరపాటు తెలిసింది. ఆ తర్వాత, తనతో కరచాలనం చేయడానికి ముందుకు వచ్చిన ప్రతి వ్యక్తిని మౌల్వీ ముహమ్మద్ అహ్సాన్ సాహిబ్ హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వైపు మళ్లిస్తూ, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇక్కడ ఉన్నారు” అని చెప్పేవారు. **(సిరతుల్ మహదీ, సంపుటి 1, కథనం 401, పుట 307)**

హజ్రత్ షేక్ అబ్దుల్ ఖాదిర్ సాహిబ్ వ్రాసిన ఇలా ఉల్లేఖించారు: హుజూర్ (అ) పెద్ద కుమారుడైన హజ్రత్ మిర్జా సుల్తాన్ అహ్మద్ సాహిబ్ ఇలా అనేవారు: తన తండ్రి తన జీవితాన్ని ఒక మొఘల్ రారాజుగా గడపలేదు. వారు ఉన్నత వంశానికి చెందినవారైనప్పటికీ మరియు వంశపారంపర్యంగా మొఘలుదైనప్పటికీ, అత్యంత నిరాడంబరంగా, సౌమ్యంగా జీవించారు.

ఖాదియాన్‌కు చెందిన కన్హయ్యా లాల్ సరఫ్ ఇలా తెలిపాడు. ఒక సందర్భంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) బటాలాకు ప్రయాణించవలసి వచ్చి, ఒక గుర్రపు బండిని ఏర్పాటు చేయమని ఆయనకు సూచించారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) కాలువ వద్దకు చేరుకున్నప్పుడు, ఇంట్లో ఏదో మర్చిపోయిన విషయం ఆయనకు గుర్తుకు వచ్చింది. హుజూర్ (అ) సారథిని అక్కడే వదిలి, తాను కాలినడన వెనుదిరిగారు. ఇంతలో, సారథి వంతెన వద్ద ఇతర ప్రయాణికులను చూసి బటాలా వైపు బయలుదేరాడు. ఆ తర్వాత హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) కాలినడన బటాలాకు వెళ్లినట్లు తెలుస్తోంది.

కన్హయ్యా లాల్ ఇలా అన్నారు: నేను ఆ సారథిని పిలిచి, “ఓరి దుర్మార్గుడా! ఒకవేళ అక్కడ మిర్జా నిజాముద్దీన్ ఉండి ఉంటే, మూడు రోజులు వేచి ఉండాల్సి వచ్చినా నువ్వు అక్కడే ఉండిపోయే వాడివి. కానీ వీరు సత్పురుషుడు, దర్వేష్ స్వభావం కలవాడు కాబట్టి, నువ్వు వారిని వదిలి వెళ్ళిపోయావు” అని తీవ్రంగా మందలించాను. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)కు ఈ విషయం తెలిసినప్పుడు, హుజూర్ (అ) కన్హయ్యా లాల్‌ను పిలిచి, “అతను నా కోసం ఎలా వేచి ఉండగలిగాడు? అతను తన ప్రయాణ రుసుము తీసుకుని వెళ్ళిపోయాడు. నువ్వు అతన్ని ఎందుకు మందలించావు?’ అని అన్నారు. **(హయాత్-ఎ-తయ్యబా, పేజీలు 15-16)**

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) సభ్యులకు ఉపదేశిస్తూ ఇలా పేర్కొన్నారు:

“మీలో ప్రతి ఒక్కరూ తహజ్జుద్ నమాజు కొరకు మేల్కొని ఉండటానికి ప్రయత్నించాలి. మరియు మీ ఐదు పూటల నమాజులలో రుకూ తర్వాత నిలబడి నప్పుడు ప్రత్యేక దుఆలు కూడా చేయాలి. దేవునికి అసంతృప్తి కలిగించే ప్రతి దాని నుండి మరియు అన్నింటి నుండి పశ్చాత్తాప పడండి. పశ్చాత్తాపం అంటే దేవునికి అసంతృప్తిని కలిగించే అన్ని చెడు పనులను మరియు పరిస్థితులను విడిచిపెట్టి, ఒక నిజాయితీగల మార్పును తీసుకురావడం. ముందుకు సాగి, ధర్మాన్ని స్వీకరించడం. నైతికతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి, ఎందుకంటే ఇది కూడా దేవుని కరుణను తెస్తుంది. మీ అలవాట్లను శుద్ధి చేసుకోండి. కోపం నుండి విముక్తి పొంది, దాని స్థానంలో వినయాన్ని మరియు సౌమ్యతను అలవర్చుకోండి. మీ నైతికతను సంస్కరించు కోవడంతో పాటు, మీ శక్తి మేరకు దానధర్మాలు చేయండి.”(మల్ఫూజాత్, సంపుటి 1, పేజీ 215)

జమాత్ సభ్యులకు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) అందించిన మార్గదర్శకత్వం ఇది. ఆ తర్వాత వారు ఇలా అన్నారు: “ధర్మ పరులు వినయం మరియు నిరాడంబరతతో కూడిన జీవితాన్ని గడపడం అవసరం. వినయం మరియు నిరాడంబరతతో జీవించడం అనేది దైవభక్తిలో ఒక భాగం. దీని ద్వారానే మనం అనవసరమైన కోపాన్ని జయించాలి. కోపానికి దూరంగా ఉండటం అనేది ఎంతో మంది గొప్ప సాధువులు మరియు సత్యవంతులు ఎదుర్కొన్న అత్యంత కఠినమైన మరియు చివరి దశ. అహంకారం మరియు గర్వం కోపం నుండే పుడతాయి. కొన్ని సందర్భాల్లో, అహంకారం మరియు గర్వం వల్లే కోపం కలుగుతుంది. ఎందుకంటే ఒక వ్యక్తి ఇతరుల కంటే తనను తాను గొప్పగా భావించి నప్పుడు కోపం వస్తుంది. నా సమాజ సభ్యులు తమను తాము గొప్పగానో లేదా తక్కువగానో భావించుకోవడం, (13వ పేజిలో చదవగలరు)

**వర్తమాన ఖలీఫా వాఖ్యములు**

**“అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్గె ఆందోళన కూడ దూరం కాదు. ”**

**(జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018)**

**దుఆ ఆశించువారు:** ***Darga sb, jamat AhmadiyyaVizag (A.P)***





# జుమా ప్రసంగము

హజ్రత్ ముఆవియా (రజి) ఒక ప్రసంగం చేస్తూ ఇలా అన్నారు: "దైవ ప్రవక్త (స) ఇలా తెలుపగా నేను విన్నాను: 'నేను కేవలం పంచిపెట్టేవాడిని మాత్రమే, వాస్తవానికి ప్రసాదించేవాడు అల్లాహ్ ఒక్కడే."

**హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ఇలా ఉల్లేఖించారు: "దైవ ప్రవక్త (స) ప్రజలందరిలో అత్యంత అందమైనవారు, అత్యంత ఉదార స్వభావం కలవారు మరియు అత్యంత ధైర్యవంతులు."**

**దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ఉదాత్త స్వభావం అలాంటిది. వారు (స) ఒక జాతి ప్రజలందరినీ ఆకలి నుండి రక్షించడానికి రుణం సంపాదించడమే కాకుండా, తన శ్రేష్ఠమైన నైతిక గుణాల ద్వారా ఒక యూదు పండితుడిని ఇస్లాంలోకి తీసుకువచ్చారు.**

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 12 జూన్ 2026 ( 12 ఎహసాన్ 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

اَشْهَدُ اَنْ لَّا اِلٰهَ اِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَاَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ

اَمَّا بَعْدُ فَاَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ - بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ -

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ ○

اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

اَلَّذِيْنَ يُنْفِقُوْنَ اَمْوَالَهُمْ بِالَّيْلِ وَالنَّهَارِ سِرًّا وَّعَلَانِيَةً فَلَهُمْ اَجْرُهُمْ عِنْدَ رَبِّهِمْ

وَلَا خَوْفٌ عَلَيْهِمْ وَلَا هُمْ يَحْزَنُوْنَ ۔ (البقرہ:275)

وَفِيْٓ اَمْوَالِهِمْ حَقٌّ لِّلسَّآئِلِ وَالْمَحْرُوْمِ ۔ (الذاریات:20)

నేను పఠించిన మొదటి సూక్తి 'బఖరా'కు చెందినది, దాని అనువాదం ఇలా ఉంది: "ఎవరైతే తమ సంపదను రాత్రింబవళ్లు, రహస్యంగా మరియు బహిరంగంగా ఖర్చు చేస్తారో, వారికి వారి ప్రభువు వద్ద ప్రతిఫలం లభిస్తుంది; వారికి ఎటువంటి భయం ఉండదు మరియు వారు దుఃఖించరు."

రెండవ సూక్తి 'అజ్-జారియాత్'కు చెందినది, ఇందులో సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఇలా అన్నాడు: "మరియు వారి సంపదలో యాచకుడికి మరియు నిరుపేదకు ఒక భాగం ఉంది."

ఈ రోజు, నేను దైవ ప్రవక్త (స) గారి ఉదారత మరియు దాతృత్వానికి సంబంధించిన కొన్ని సంఘటనలను (హదీసులను) మీ ముందు ఉంచుతాను. విశ్వాసుల దృష్టిని ప్రవక్త (స) పదేపదే ఈ విషయం వైపు ఎలా మళ్లించారో మరియు ఈ విషయంలో ప్రవక్త (స) స్వయంగా ఆచరణాత్మక ఉదాహరణగా ఎలా నిలిచారో ఈ సంఘటనలు తెలియజేస్తాయి. నేను చెప్పినట్లుగా, నేను పఠించిన సూక్తులలోనూ మరియు అనేక ఇతర సూక్తులలోనూ, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ అల్లాహ్ పట్ల ఉన్న హక్కులను మరియు ఆయన ప్రాణుల పట్ల ఉన్న హక్కులను నెరవేర్చడం వైపు, అలాగే మతపరమైన అవసరాలను మరియు అవసరంలో ఉన్నవారి హక్కులను తీర్చడం వైపు దృష్టిని ఆకర్షించాడు. ఈ ఆదేశానికి అనుగుణంగా, దైవ ప్రవక్త (స) కూడా నిజమైన విశ్వాసుల దృష్టిని దీని వైపు మళ్లించారు. అన్నిటికంటే ముఖ్యంగా, ప్రవక్త (స) స్వయంగా ఒక ఆదర్శాన్ని నెలకొల్పారు, తద్వారా సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క ఆజ్ఞలను ఎలా పాటించాలో మనకు ఆచరణాత్మకంగా చూపించారు. కాబట్టి, దైవ ప్రవక్త (స) కేవలం ఒక నైతిక గుణాన్ని మాత్రమే కలిగి ఉండడమే కాకుండా, ప్రవక్త (స) జీవితంలోని ప్రతి క్షణం పవిత్ర ఖురాన్‌కు పూర్తిగా అనుగుణంగా ఉండేది. అందుకే హజ్రత్ ఆయిషా (రజి) వారి వ్యక్తిత్వం గురించి ఇలా అన్నారు: **"కాన ఖుల్‌ఖుహుల్ ఖురాన్"** అనగా, ప్రవక్త (స) నైతిక ప్రవర్తన పవిత్ర ఖురాన్ యొక్క సంపూర్ణ ప్రతిరూపం.

**(ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్, సంపుటి 8, పేజీ 144, హదీసు 25108, మక్తబా ఆలముల్ కుతుబ్, బీరూట్ 1998, )**

ఏ నైతిక గుణాన్ని తీసుకున్నా సరే, ప్రవక్త (స) దానికి అత్యంత పరిపూర్ణమైన ఉదాహరణగా నిలిచారు. అంతకంటే గొప్ప ఉదాహరణను మరొకటి చూపించడం సాధ్యం కాదు. ఏది ఏమైనప్పటికీ, నేను చెప్పినట్లుగా, ఈ రోజు నేను ప్రవక్త (స) ఉదారత మరియు దాతృత్వ గుణాలకు సంబంధించిన కొన్ని సంఘటనలను మీ ముందు ఉంచుతాను. హజ్రత్ అనస్ (రజి) ఇలా ఉల్లేఖించారు. దైవ ప్రవక్త (స) ఈ క్రింది పదాలలో ప్రార్థించేవారు:

اَللّٰهُمَّ اِنِّيْٓ اَعُوْذُبِكَ مِنَ الْبُخْلِ وَالْكَسَلِ وَاَرْذَلِ الْعُمُرِ وَعَذَابِ الْقَبْرِ وَفِتْنَةِ الْمَحْيَا وَالْمَمَاتِ ۔

"ఓ అల్లాహ్! నేను లోపము, సోమరితనం, వృద్ధాప్యానికి చేరుకోవడం, సమాధి శిక్ష మరియు జీవిత మరియు మరణ పరీక్షల నుండి నిన్ను ఆశ్రయిస్తున్నాను."

**(సహీహ్ ముస్లిం ఉర్దూ అనువాదం, వాల్యూం. 14, కితాబ్ అల్-జికర్ వా అల్-దువా వా అల్-తౌబా, హదీస్ 4865, నూర్ ఫౌండేషన్, పేజి 79)**

అదేవిధంగా, ఈ విషయంలో క్రింది మరో దుఆ ఉంది. ప్రవక్త (స) ఈ క్రింది విధంగా దుఆ చేసేవారని హజ్రత్ అనస్ (రజి) పేర్కొన్నారు:

اَللّٰهُمَّ إِنِّيْ أَعُوْذُبِكَ مِنَ الْهَمِّ وَالْحَزَنِ وَالْعَجْزِ وَالْكَسَلِ وَالْجُبْنِ وَالْبُخْلِ وَضَلَعِ الدَّيْنِ وَغَلَبَةِ الرِّجَالِ ۔

"ఓ అల్లాహ్! కష్టాలు మరియు దుఃఖం, నిస్సహాయత మరియు సోమరితనం, పిరికితనం మరియు జంకుతనం, భారీగా అప్పుల నుండి మరియు మనుష్యులచే అధిగమించ బడకుండా నేను నిన్ను ఆశ్రయిస్తున్నాను."

**(సహీహ్ అల్-బుఖారీ ఉర్దూ అనువాదం, వాల్యూం. 15, కితాబ్-ఉల్-దావత్, హదీస్ 6369, నజరత్ ఇషాత్, పేజి 109)**

అలాగే, సర్వశక్తిమంతుడైన దేవుని మార్గంలో ఖర్చు చేయడం మరియు అతని సేవకులకు సహాయం చేయడం గురించి, ప్రవక్త (స) విశ్వాసులకు ఈ క్రింది సలహా ఇచ్చారు. ప్రవక్త (స) నాతో ఇలా అన్నారని హజ్రత్ అస్మా (రజి) తెలియజేసారు: "మీ డబ్బు సంచి గట్టిగా మూసి ఉంచవద్దు, దానిని తెరవండి, లేకపోతే మీ నుండి ఆశీర్వాదాలు నిలిపి వేయబడతాయి." మరో మాటలో చెప్పాలంటే, మీ సంపద ఎక్కడ దాగి ఉన్నా దానిని మూసివేయకండి. దానికి బదులుగా, అవసరమై నప్పుడు దాని నుండి ఖర్చు చేయండి మరియు ఇతరులకు సహాయం చేయండి.

మరొక హదీసులో ఈ క్రింది మాటలు కనబడుతున్నాయి: "దానిని లెక్కపెట్టకండి; లేకపోతే సర్వశక్తిమంతుడైన అల్లాహ్ కూడా మీకు కొలత ప్రకారమే ఇస్తాడు." **(సహీహ్ అల్-బుఖారీ ఉర్దూ అనువాదం, సంపుటి 3, కితాబ్-ఉల్-జకాత్, హదీస్ 1433, నజరత్ ఇషాత్, పేజీలు 55-56)**

అనగా, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మిమ్మల్ని అనుగ్రహిస్తే, మీరు ఆయన పట్ల మీ కృతజ్ఞతను న్యాయంగా వ్యక్తపరచాలి. మరియు ఆయన పట్ల కృతజ్ఞతను న్యాయంగా వ్యక్తపరచడమంటే ఇతరులకు సహాయం చేయడమే. దాని ఫలితంగా, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మీకు ఇంకా ఎక్కువగా ప్రసాదిస్తాడు.

హజ్రత్ అబూ హురైరా (రజి) ఇలాఉల్లేఖించారు: దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "ఉదార స్వభావం గల వ్యక్తి అల్లాహ్‌కు, స్వర్గానికి, ప్రజలకు దగ్గరగా ఉంటాడు మరియు నరకాగ్నికి దూరంగా ఉంటాడు. అదేవిధంగా, పిసినారి అల్లాహ్‌కు, స్వర్గానికి, ప్రజలకు దూరంగా ఉంటాడు మరియు నరకాగ్నికి దగ్గరగా ఉంటాడు. ఇంకా, పిసినారి ఆరాధకుడి కంటే, ఉదారంగా ఉండి జ్ఞానం లేనివాడే అల్లాహ్‌కు ఎక్కువ ప్రియమైనవాడు."

**(జామి' అత్-తిర్మిధి, అబ్వాబ్-ఉల్-బిర్ర్ వా అల్-సిలాహ్, హదీస్ 1961)**

మరో మాటలో చెప్పాలంటే, ఒక వ్యక్తి ఎక్కువగా ఆరాధించినా, అతడు పిసినారైనచో, మరొక వ్యక్తికి ఎక్కువ జ్ఞానం లేకపోయినా ఉదారంగా ఉన్నచో, అల్లాహ్ ఉదారంగా ఉండే వ్యక్తినే ఎక్కువగా ప్రేమిస్తాడు.

అదేవిధంగా, హజ్రత్ అబూబకర్ (రజి) ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త (స.అ.) ఇలా అన్నారు: "మోసగాడు, పిసినారి మరియు తాను చేసిన మేలును ఇతరులకు నిరంతరం గుర్తుచేసేవాడు స్వర్గంలో ప్రవేశించలేడు."

**(జామీ అత్ తిర్మిధి, అబ్వాబ్-ఉల్-బిర్ వా అల్-సిలాహ్, హదీస్ 1963)**

స్వర్గంలో ప్రవేశించని వారిలో మూడు లక్షణాలు ఉంటాయి: మోసగాడు, పిసినారి మరియు ఇతరులకు చేసిన ఉపకారాల వల్ల వారిని పదే పదే తమకు రుణపడి ఉన్నట్లు భావించేలా చేసే వ్యక్తి.

మరొక కథనంలో, హజ్రత్ అబూహురైరా (రజి) ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: " సరళ స్వభావం మరియు ఉదారత కలిగినవాడు విశ్వాసి, కాగా మోసపూరితమైన మరియు నీచమైన స్వభావం కలిగినవాడు దుర్మార్గుడు."

**(జామిఅత్తిర్మిజీ, అబ్వాబ్-ఉల్-బిర్ర్ వ అస్-సిలా, హదీసు 1964)**

మన సాధారణ వాడుక భాషలో కొందరు అర్థం చేసుకున్నట్లుగా, ఇక్కడ, సరళ స్వభావం కలిగి ఉండటం అంటే తెలివితేటలు లేకపోవడం అని అర్థంకాదు. వాస్తవానికి, విశ్వాసులు లోతైన అంతర్దృష్టి మరియు విచక్షణ కలిగిన వారిగా వర్ణించబడ్డారు, మరియు వారి అంతర్దృష్టికి గొప్ప విలువ ఉంటుంది.

**(జామిఅ త్రిర్మిజీ, కితాబ్ అత్-తఫ్సీర్-ఉల్-ఖురాన్, హదీసు 3127)**

వారు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి. దీని అర్థం ఏమిటంటే, విశ్వాసి అనవసరమైన వివాదాలకు దూరంగా ఉంటాడు, గొప్ప గుణవంతుడు, విశాల హృదయం కలవాడు, అందరితో కలిసిమెలిసి ఉండేందుకు ఆహ్లాదకరమైన వ్యక్తి మరియు గౌరవనీయుడు. కాబట్టి, ఇది విశ్వాసి యొక్క లక్షణం మరియు దీని ఆధారంగానే మనల్ని మనం సరిచూసుకోవాలి.

మరొక కథనంలో, ముతర్రఫ్ తన తండ్రి నుండి ఇలా ఉల్లేఖించారు. "నేను దైవ ప్రవక్త (స) వద్దకు వచ్చాను, అప్పుడు ప్రవక్త (స) అల్ హాకుముత్తకాసుర్ అధ్యాయాన్ని పఠిస్తున్నారు. ఆ క్రమంలో దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: "ఆదమ్ సంతతి ఇలా అంటుంది: "నా సంపద, నా సంపద." (అంటే, ఒక ధనవంతుడు "ఇది నా సంపద" "ఇది నా సంపద "అని అంటాడు. ప్రవక్త (స) ఇలా అన్నారు.

"కానీ, ఓ ఆదం కుమారుడా! నువ్వు తిని వినియోగించుకున్నది, వాడుకుని అరిగిపోయేలా చేసినది లేదా దానధర్మాలు చేసి పరలోకం కోసం ముందుగా పంపినది మాత్రమే నీ నిజమైన సంపద." **(సహీహ్ ముస్లిం ఉర్దూ అనువాదం, సంపుటి 15, హదీసు 5244, నూర్ ఫౌండేషన్, పేజీ 155)**

దైవప్రవక్త (స) ఇలా వివరించారు: నిజానికి నువ్వు ఖర్చు చేసేదే నీ సంపద. కానీ అత్యుత్తమ సంపద ఏమిటంటే, దానధర్మాలు చేయడం ద్వారా మరియు అల్లాహ్ ప్రాణుల యొక్క హక్కులను నెరవేరుస్తూ, ఆయన మార్గంలో ఖర్చు చేస్తూ, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ సమక్షంలో సమర్పించేది అత్యుత్తమ సంపద. ఆ సంపద పరలోకంలో నీకు అనేక రెట్లుగా తిరిగి లభిస్తుంది. అందుకే సర్వశక్తిమంతుడైన దేవుడు ఇలా సెలవిచ్చాడు (దీనిని నేను ఇంతకుముందు ఒక సూక్తి ద్వారా చదివి వినిపించాను) అటువంటి వారికి ఎటువంటి భయం ఉండదు, వారు ఏమాత్రం దుఃఖించరు. ఎందుకంటే వారు చేసిన త్యాగాలు, చూపిన ఉదారత మరియు ఇతరుల కోసం ఖర్చు చేసిన సంపద వారికి పరలోకంలో తిరిగి లభిస్తాయి.

హజ్రత్ అబ్దుల్లా బిన్ మసూద్ (రజి) ఇలా ఉల్లేఖించారు, దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: "కేవలం రెండు సందర్భాల్లోనే అసూయ (అంటే మంచి విషయంలో పోటీపడే భావన) అనుమతించబడింది: ఒకటి, అల్లాహ్ సంపదను ప్రసాదించి, దానిని స్వేచ్ఛగా మరియు సముచితంగా ఖర్చు చేసే సామర్థ్యాన్ని కూడా ఇచ్చిన వ్యక్తి; మరొకటి, అల్లాహ్ జ్ఞానాన్ని ప్రసాదించి, దాని ప్రకారం తీర్పునిచ్చే, దానిని ఆచరించే మరియు ఇతరులకు బోధించే వ్యక్తి." **(సహీహ్ అల్-బుఖారీ ఉర్దూ అనువాదం, సంపుటి 1, కితాబుల్ ఇల్మ్, హదీసు 73, నజారత్-ఎ-ఇషాత్, పేజీలు 144-145)**

అలాగే హజ్రత్ అబూ ఉమామా (రజి) ఇలా ఉల్లేఖించారు: మరొక సందర్భంలో ఉపదేశం ఇస్తూ దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: "ఓ ఆదం కుమారుడా! నీ అదనపు సంపదను అల్లాహ్ మార్గంలో ఖర్చు చేయడం నీకు శ్రేయస్కరం."

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నీకు ఇచ్చిన సంపదను మొదట నీ నిజమైన అవసరాలను తీర్చుకోవడానికి ఉపయోగించాలి, కానీ అంతకు మించి ఉన్నదానిని ఖర్చు చేయాలి. "దానిని దాచుకోవడం నీకు హానికరం. నీకు అవసరమైన దానిని ఉంచుకున్నందుకు నిన్ను నిందించరు. (నీ అవసరాలను తీర్చుకోవడానికి సంపదను పక్కన పెట్టినందుకు నిన్ను ప్రశ్నించరు.) మరియు ఎవరి సంరక్షణ అయితే నీ బాధ్యతో, వారి కోసం ఖర్చు చేయడం ప్రారంభించు." దీని అర్థం ఏమిటంటే, మీ సంపదను ఖర్చు చేసే విషయంలో మీ పిల్లలు, మీ జీవిత భాగస్వామి, మీపై ఆధారపడిన వారు, పేద బంధువులు మరియు మీ సంరక్షణలో ఉన్నవారికి ఆ సంపద నుండి ప్రయోజనం పొందే మొదటి హక్కు ఉంటుంది. మరల దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: "తీసుకునే చేయి కంటే ఇచ్చే చేయి మిన్న." **(సహీహ్ ముస్లిం ఉర్దూ అనువాదం, సంపుటి 4, కితాబ్-ఉల్-జకాత్, హదీసు 1704, నూర్ ఫౌండేషన్, పేజీ 209)**

హజ్రత్ అబ్దుల్లా బిన్ మసూద్ (రజి) కూడా ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త (స) "మీలో ఎవరు తమ వారసుల సంపదను తమ సొంత సంపద కంటే ఎక్కువగా ప్రేమిస్తారు?" అని అడిగారు. తమ వద్ద ప్రస్తుతం ఉండి, తమ కోసం ఖర్చు చేసుకునే సంపద కంటే, తాము తమ వారసుల కోసం వదిలివెళ్ళే సంపదనే ఎక్కువగా ప్రేమిస్తానని చెప్పే వారు ఎవరైనా ఉన్నారా?. అందుకు సహచరులు ఇలా సమాధానమిచ్చారు: "ఓ అల్లాహ్ ప్రవక్త (స)! తమ సొంత సంపద కంటే వారసుల సంపదను ఎక్కువగా ప్రేమించేవారు మాలో ఎవరూ లేరు." సహజంగానే, తమ వద్ద అప్పటికే ఉన్న సంపద వారికి అత్యంత ప్రియమైనదిగా ఉండేది. దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: "మీ సంపద అంటే మీరు (పుణ్యకార్యాల ద్వారా) ముందుగా పంపినదే. ఇక మీరు వెనుక వదిలి వెళ్ళేది మీ వారసుల సంపద అవుతుంది." **(సహీ బుఖారీ ఉర్దూ అనువాదం, సంపుటి 15, కితాబ్-ఉల్-రికాఖ్, హదీసు 6442, నజారత్-ఎ-ఇషాత్, పేజీలు 206-207)**

అనగా, మీరు దేవుని మార్గంలో మరియు అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడానికి ఏది ఖర్చు చేస్తారో అదే అత్యుత్తమమైనది. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పవిత్ర ఖురాన్‌లో పేర్కొన్నట్లుగా, చివరికి దానికి మీకు ప్రతిఫలం లభిస్తుంది.

ఉదారంగా ఖర్చు చేయడం మరియు సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌పై సంపూర్ణ విశ్వాసం ఉంచడం విషయంలో దైవ ప్రవక్త (స) వారి వ్యక్తిగత ఉదాహరణ గురించి హజ్రత్ అబ్దుల్లా బిన్ మసూద్ (రజి) ఇలా వివరిస్తున్నారు:

ఒకసారి దైవ ప్రవక్త (స) హజ్రత్ బిలాల్ (రజి) వద్దకు వచ్చి, బిలాల్ (రజి) ఖర్జూర పండ్ల కుప్పను పోగు చేసి ఉంచడాన్ని చూశారు. ప్రవక్త (స) "బిలాల్, ఇదంతా ఏమిటి?" అని అడిగారు. హజ్రత్ బిలాల్ (ర) ఇలా సమాధానమిచ్చారు: "ఓ అల్లాహ్ ప్రవక్త (స), నేను దీనిని మీ కోసం మరియు మీ అతిథుల కోసం భద్రపరిచాను." అప్పుడు దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: "ఈ నిల్వ నరకాగ్నికి ఇంధనంగా మారుతుందేమోనని నీకు భయం లేదా?" ఆ తర్వాత ప్రవక్త (స) హజ్రత్ బిలాల్ (రజి)కు ఇలా ఉపదేశించారు: "బిలాల్, ఖర్చు చేస్తూనే ఉండు; సింహాసనానికి అధిపతి (అల్లాహ్) నీకు జీవనోపాధిని సమకూర్చేవాడిగా ఉన్నప్పుడు పేదరికం గురించి భయపడకు." **(ముజిమ్-ఉల్-కబీర్, అల్-తబ్రానీ, సంపుటి 1, హదీసు 1020, మక్తబా ఇబ్న్ తైమియ్యా అల్-కాహిరా, పేజీ 340)**

ఈ విషయంలో దైవ ప్రవక్త (స) ఆచరణకు సంబంధించిన మరొక ఉదాహరణను హజ్రత్ ఆయిషా (రజి) వివరించారు. వారు(రజి) ఒక మేకను వధించి, దాని మాంసాన్ని పేదలకు పంచిపెట్టానని, తినడం కోసం కొంత భాగాన్ని ఇంట్లో ఉంచు కున్నానని తెలిపారు. అప్పుడు దైవ ప్రవక్త (స) ఎంత మాంసం మిగిలి ఉందని అడిగారు. దానికి హజ్రత్ ఆయిషా (రజి) కేవలం ముందు కాలు (మేక ముందు భాగం) మాత్రమే మిగిలి ఉందని సమాధానమిచ్చారు. అది విన్న తర్వాత దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: "ఈ ముందు కాలు తప్ప మిగిలినదంతా అలాగే మిగిలి పోయింది." అంటే, దానధర్మాల రూపంలో పంచిపెట్టినదే వాస్తవానికి భద్రపరచ బడింది. కానీ తమ కోసం ఉంచుకున్న భాగం నిజానికి మిగిలి ఉన్నట్లు కాదు, ఎందుకంటే అది కేవలం తాత్కాలిక లౌకిక అవసరానికి మాత్రమే ఉపయోగపడింది. పరలోకంలో ఒక వ్యక్తికి ప్రయోజనం చేకూర్చేది అల్లాహ్ మార్గంలో ఖర్చు చేసినది మాత్రమే.

**(జామిఅ-త్తిర్మిజీ, కితాబ్ సిఫత్-ఉల్-ఖియామహ్, హదీసు 2470)**

హజ్రత్ ముఆవియా (రజి) ఒక ప్రసంగం చేస్తూ ఇలా అన్నారు: "దైవ ప్రవక్త (స) ఇలా తెలుపగా నేను విన్నాను: 'నేను కేవలం పంచిపెట్టేవాడిని మాత్రమే, వాస్తవానికి ప్రసాదించేవాడు అల్లాహ్ ఒక్కడే." **(సహీ-బుఖారీ ఉర్దూ అనువాదం, సంపుటి 15, కితాబ్-ఉల్-ఇల్మ్, హదీసు 71, నజారత్-ఎ-ఇషాత్, పేజీలు 206-207)**

దైవ ప్రవక్త (స) వారిలో ఉదారత అనే గుణం ప్రవక్త పదవిని స్వీకరించడానికి ముందే పూర్తిగా నిండి ఉండేది. దీనికి సాక్ష్యంగా, దైవప్రవక్త (స) పై మొట్టమొదటి దైవవాణి (వహీ) అవతరించినప్పుడు వారు (స) ఆందోళనతో ఇంటికి వచ్చిన సందర్భాన్ని మనం చూడవచ్చు. అప్పుడు హజ్రత్ ఖదీజా (రజి) ఇలా అన్నారు: "ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. అల్లాహ్ ప్రమాణం!. ఆయన మిమ్మల్ని ఎప్పటికీ అవమానించడు. మీరు బంధుత్వాలను కాపాడతారు, బలహీనుల భారాలను మోస్తారు, కనుమరుగైన సద్గుణాలను ఆచరిస్తారు, అతిథులకు ఆతిథ్యం ఇస్తారు మరియు నిజమైన కష్టాల్లో ఉన్నవారికి సహాయం చేస్తారు." **(దాయిరే మారిఫ్ సీరత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ (స), సంపుటి 11, బజమ్-ఎ-ఇక్బాల్ లాహోర్, పేజీ 48)**

అలాగే, హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ (రజి) ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త (స) ఇలా తెలిపారు: "ఒక విశ్వాసిలో రెండు గుణాలు కలిసి ఉండవు: పిసినారితనం మరియు దుశ్చరిత్ర (చెడు ప్రవర్తన)."

**(జామి అత్-తిర్మిదీ, అబ్వాబ్-ఉల్-బిర్ర్ వ అస్-సిలాహ్, హదీసు 1962)**

అనగా, ఒక విశ్వాసి పిసినారిగా ఉండడు మరియు దుష్ప్రవర్తన కలిగిన వాడిగా కూడా ఉండడు. ఇది కూడా ఒక కొలమానం, దీని ద్వారా ఒక వ్యక్తి తన స్వంత స్థాయిని విశ్లేషించుకోవచ్చు. హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి) ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త (స) పిసినారితనాన్ని విడిచిపెట్టమని ప్రజలకు బోధిస్తూ ఇలా అన్నారు: "అన్యాయానికి దూరంగా ఉండండి, నిశ్చయంగా పునరుత్థాన దినాన అన్యాయం చీకటిగా మారుతుంది. మరియు పిసినారితనం, దురాశల పట్ల జాగ్రత్త వహించండి, నిశ్చయంగా పిసినారితనం మీ పూర్వీకులను నాశనం చేసింది. అది వారిని రక్తపాతం చేయడానికి మరియు నిషిద్ధమైన వాటిని ధర్మబద్ధమైనవిగా ప్రకటించడానికి ప్రేరేపించింది." **(సహీహ్ ముస్లిం ఉర్దూ అనువాదం, సంపుటి 13, కితాబ్-ఉల్-బిర్ర్ వా అల్-సిలాహ్, హదీస్ 4661, నూర్ ఫౌండేషన్, పేజీ 242)**

హజ్రత్ అబూ హురైరా (రజి) ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు, "అల్లాహ్ మార్గంలో (ధర్మ పోరాటంలో) చేరిన దుమ్ము మరియు నరకపు పొగ ఒక వ్యక్తిలో ఎప్పటికీ కలిసి ఉండవు. అలాగే, అత్యాశ, పిసినారితనం మరియు విశ్వాసం ఒక వ్యక్తి హృదయంలో ఎప్పటికీ కలిసి ఉండవు."

**(సునన్ అన్-నసాయీ, కితాబుల్ జిహాద్, హదీసు 3112)**

మరొక ఉల్లేఖనంలో ఇలా గలదు. ఇంతకు ముందే చెప్పినట్లుగా, అత్యాశ, దురాశ మరియు పిసినారితనం కలిగిన వ్యక్తి ఎప్పటికీ నిజమైన విశ్వాసి కాలేడు. ఇవే ప్రమాణాలు. ఒక వ్యక్తి విశ్వాసిగా మారాలనుకుంటే, అతను అత్యాశ, దురాశ మరియు పిసినారితనానికి దూరంగా ఉండాలి.

హజ్రత్ అబూ హురైరా (రజి) ఇలా ఉల్లేఖించారు. దైవ ప్రవక్త (స) ఇలా తెలిపారు: "ప్రజలు ఉదయం నిద్రలేచినప్పుడు ఇద్దరు దేవదూతలు దిగిరాని రోజు అంటూ ఏదీ ఉండదు. వారిలో ఒకరు ఇలా అంటారు: 'ఓ అల్లాహ్! ఖర్చు చేసేవారికి ప్రతిఫలాన్ని ప్రసాదించు.' మరొకరు ఇలా అంటారు: 'ఓ అల్లాహ్! పిసినారి సంపదను నాశనం చేయి." **(సహీ బుఖారీ ఉర్దూ అనువాదం, సంపుటి 3, కితాబుజ్-జకాత్, హదీసు 1442, నజారత్ ఇషాత్, పేజీ 66)**

మరో మాటలో చెప్పాలంటే, ఖర్చు చేసే వ్యక్తికి మరింత ప్రసాదించు, కానీ పిసినారి మరియు అత్యాశ గల వ్యక్తి సంపదను వృథా చేయి. ఈ లోకంలో కూడా, అటువంటి వ్యక్తి సంపదలో అభివృద్ధి ఉండదు. మనం దీనిని చూస్తూనే ఉంటాము, చాలా మంది ప్రజలు కూడా దీనిని వ్యక్తం చేస్తుంటారు. ఇక పరలోకంలో, ఆ సంపద అటువంటి వ్యక్తికి ఏమాత్రం ఉపయోగపడదు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఒక చోట ఇలా పేర్కొన్నాడు: ఎవరైతే ఆయన మార్గంలో మరియు ఆయన పట్ల ప్రేమతో ఖర్చు చేస్తారో, వారికి ఆయన దాని ప్రతిఫలాన్ని ప్రసాదిస్తాడు.

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ఇలా ఉల్లేఖించారు: "దైవ ప్రవక్త (స) ప్రజలందరిలో అత్యంత అందమైనవారు, అత్యంత ఉదార స్వభావం కలవారు మరియు అత్యంత ధైర్యవంతులు." **(సహీహ్ ముస్లిం ఉర్దూ అనువాదం, సంపుటి 12, కితాబ్-ఉల్-ఫజాయిల్, హదీసు 4252, నూర్ ఫౌండేషన్, పేజీ 217)**

అదేవిధంగా, హజ్రత్ అనస్ (రజి) ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: "అత్యంత ఉదారస్వభావం కలవారిలో కెల్లా అత్యంత ఉదారుడైన వారిగురించి నేను మీకు చెప్పనా?" ఆ తర్వాత ప్రవక్త (స) ఇలా అన్నారు: "ఉదారు లందరిలోనూ అల్లాహ్ అత్యంత ఉదారుడు, మరియు ఆదం సంతతిలో నేను అత్యంత ఉదారుడిని." **(మజ్మా-ఉల్-జవాహిద్, సంపుటి 8, కితాబ్ అలామాత్ అన్-నబువ్వా, హదీసు 14178, దారుల్-కుతుబ్ అల్-ఇల్మియ్యా, బీరూట్, 2001, పేజీ 409)**

మరో మాటలో చెప్పాలంటే, ప్రవక్త (స) ప్రపంచంలోనే అత్యంత ఉదార స్వభావం కలిగినవారు.

అదేవిధంగా, హజ్రత్ ఇబ్నే అబ్బాస్ (రజి) ఇలా వివరించారు: మంచి పనులు చేయడంలో మరియు దయ చూపడంలో ప్రవక్త (స) ప్రజలందరిలోనూ అత్యంత ఉదారుడిగా ఉండేవారు. ముఖ్యంగా రమజాన్ మాసంలో వారి ఉదారత మరింత ఎక్కువగా ఉండేది. రమజాన్ మాసం ముగిసే వరకు ప్రతి సంవత్సరం జిబ్రాయీల్ (అ) ప్రవక్త(స)ను కలిసేవారు. ప్రవక్త (స) జిబ్రాయిల్‌కు ఖుర్ఆన్ వినిపించేవారు. జిబ్రయీల్ (అ) ప్రవక్త(స)ను కలిసినప్పుడల్లా, ప్రవక్త (స) మంచి పనులు మరియు దయ చూపడంలో వేగంగా వీచే బలమైన గాలి కంటే కూడా అధిక ఉదారతను ప్రదర్శించేవారు. **(సహీహ్ ముస్లిం, ఉర్దూ అనువాదం, సంపుటి 12, కితాబుల్-ఫజాయిల్, హదీసు 4254, నూర్ ఫౌండేషన్, పేజీలు 218-219)**

ప్రవక్త (స) ఎంత ధారాళంగా ఖర్చు చేసేవారంటే, అది ఒక శక్తివంతమైన గాలి తుఫాను లేదా వేగవంతమైన గాలులు వీస్తున్నట్లుగా ఉండేది. హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ (రజి) ఈ విషయాన్నే తన ఉపన్యాసాలలో ఒకదానిలో ఈ క్రింది విధంగా వివరించారు:

"దైవ ప్రవక్త (స) ఉదారతను చూపినప్పుడు, వారు దానిని అత్యధిక స్థాయిలో చూపేవారు. సహచరులు చెప్పినదాని ప్రకారం, ముఖ్యంగా రమజాన్ మాసంలో ప్రవక్త (స) బలమైన గాలివాటంలా ఉదారంగా ఉండేవారు. అదే సమయంలో, 'మరియు దుబారా చేయవద్దు' అనే ఆజ్ఞకు వారి ఆచరణ కట్టుబడి ఉండేది. మరో మాటలో చెప్పాలంటే, వారు (స) ఉదారతను ఎన్నడూ వృథాగా భావించలేదు, అలాగే అనుచితంగా లేదా ప్రయోజనం లేకుండా ఖర్చు చేయలేదు." ప్రవక్త (స) ఉదారంగా ఉండేవారు, కానీ సంపదను వృథా చేయకూడదని లేదా నిరుపయోగంగా ఖర్చు చేయకూడదని సర్వశక్తిమంతుడైన అల్లాహ్ కూడా ఆజ్ఞాపించాడు. అల్లాహ్ దుబారాను నిషేధించాడు.

హాతిమ్ తాయి తన ఉదారతకు ప్రసిద్ధి చెందాడు, కానీ తరచుగా ఆ ఉదారత సరైన సందర్భం లేదా అవసరం లేకుండా ప్రదర్శించబడేది (అంటే, ఆలోచన లేకుండా చేసేవారు). ఇది "మిఠాయి దుకాణంలో తాతగారు చూపించే ఉదారత" లాంటిది (ఇది ఒక జాతీయం). ఆ సంపద అతని సొంతం కాదు. తన తండ్రి సంపదను పంచిపెట్టే హక్కు అతనికి ఎక్కడిది? హాతిమ్ తాయికి చిన్నప్పటి నుండే ఉదారస్వభావం ఉండేదని చెబుతారు. కాలక్రమేణా, తన సంపదను వృథా చేస్తున్నాడని గమనించిన అతని తండ్రి, ఒంటెల సంరక్షణ బాధ్యతను అప్పగించి అతన్ని దూరంగా పంపేశాడు. ఒకరోజు, ప్రయాణంలో ఉన్న ముగ్గురు ప్రసిద్ధ కవులు తన వైపు రావడం అతను చూశాడు. వారిని కలిసినప్పుడు, అతిథులుగా వారిని ఆదరించడానికి అతను మూడు ఒంటెలను వధించాడు. అప్పుడు వారు, "మేము ముగ్గురమే కదా, ఒక ఒంటె సరిపోతుంది" అని అన్నారు. దానికి అతను, "వద్దు, నేను ఒక్క ఒంటెను మాత్రమే వధిస్తే, మిగిలిన ఇద్దరు అతిథులు ఆ ఒక్క ఒంటె మాంసంపై ఆధారపడాల్సి వస్తుంది" అని బదులిచ్చాడు. అది తన తండ్రి సంపద కావడం మరియు ఉచితంగా లభించడం వల్ల, అతను వారి కోసం ఆ మూడు ఒంటెలను వధించాడు. మిగిలిన మాంసం వృథా అయ్యేది లేదా ఇతరులకు పంచబడేది. తన సంపద ఈ విధంగా పంచిపెట్టబడటం చూసి అతని తండ్రి చాలా బాధపడేవారు. అయితే, దైవ ప్రవక్త (స)కు లభించిన సంపద వారి సొంతం. వారు దానిని ఖురాన్ మార్గదర్శకత్వానికి అనుగుణంగా, సరైన సమయం మరియు అవసరాన్ని పరిగణనలోకి తీసుకుని ఖర్చు చేసేవారు.

సంకోచం లేకుండా ఖర్చు చేయమని దైవ ప్రవక్త (స) సూచించిన సందర్భాలను ఇది స్పష్టం చేస్తుంది. దీని అర్థం ఏమిటంటే: సందర్భానికి తగినట్లుగా ఖర్చు చేయాలి, ఆ తర్వాత ఎలాంటి సంకోచం ఉండకూడదు. ఉదాహరణకు, ఎడారిలో ముగ్గురు వ్యక్తులు వచ్చినప్పుడు మూడు ఒంటెలను వధించడం దీని అర్థం కాదు. ఎందుకంటే ఆ తర్వాత తినడానికి అక్కడ ఎవరూ ఉండరు కాబట్టి ఆ మాంసం వృథా అవుతుంది. నిజానికి, ఎడారి మధ్యలో చాలా తక్కువ మంది మాత్రమే కనిపిస్తారు. ఒకవేళ కొద్దిమంది దగ్గరలో ఉన్నా, గణనీయమైన మొత్తంలో మాంసం మిగిలిపోయి వృథా అవుతుంది. దానివల్ల ఎలాంటి ప్రయోజనం ఉండదు. కాబట్టి, పరిస్థితికి అనుగుణంగా ఖర్చు చేయాలి. అయితే, మీరు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మార్గంలో మరియు సందర్భోచితంగా ఖర్చు చేస్తున్నట్లయితే, నిశ్చింతగా ఉండండి. ఎందుకంటే ఖురాన్ వాక్యంలో అల్లాహ్ తెలిపినట్లుగా, అల్లాహ్ వాగ్దానం ఏమిటంటే, అటువంటి వారికి ఎటువంటి భయం గానీ, బాధ గానీ ఉండదు.

ఏది ఏమైనప్పటికీ, హజ్రత్ ముస్లేహ్-ఎ-మౌవూద్ (రజి) ఇలా పేర్కొన్నారు: "వీటన్నింటితో పాటు, ఒకవైపు దైవ ప్రవక్త (స) ఎంత ఉదారస్వభావి అంటే కథనాల ప్రకారం, రమజాన్ రోజుల్లో వారు(స) ఎంత ధారాళంగా దానం చేసేవారంటే అది వేగంగా వీచే గాలిలా ఉండేది. అదే సమయంలో, ప్రవక్త (స) వివేకం మరియు విచక్షణతో ఖర్చు చేసే వ్యక్తి కూడా." **(ఖుత్బాతే మహమూద్, సంపుటి 18, పేజీ 641)**

హజ్రత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఇలా ఉల్లేఖించారు: అల్లాహ్ ప్రవక్త (స) ఇలా అన్నారు: "నా దగ్గర తిహామా (అరేబియాలోని తీరప్రాంత పర్వత శ్రేణి) పర్వతాలంత బంగారం ఉన్నట్లయితే, నేను దానినంతటినీ మీ మధ్య పంచిపెట్టేవాడిని; అప్పుడు మీరు నన్ను అబద్ధాలకోరుగా గానీ లేదా పిసినారిగా గానీ భావించేవారు కాదు."

**(సుబుల్ అల్-హుదా వ అల్-రిషాద్, సంపుటి 7, దారుల్-కుతుబ్ అల్-ఇల్మియ్యా, బీరూట్, 1993, పేజీ 53)**

మరొక ఉల్లేఖనంలో హజ్రత్ అబూజర్ (రజి) ఇలా తెలిపారు: నేను దైవ ప్రవక్త (స)తో కలిసి మదీనా శివార్లలో నడుస్తున్నప్పుడు, ఉహుద్ పర్వతం మా కళ్ళ ముందు కనిపించింది. ప్రవక్త (స) ఓ "అబూ జర్!" అని పిలిచారు. నేను "అల్లాహ్ ప్రవక్త (స), మీ సేవలో ఉన్నాను" అని బదులిచ్చాను. వారు (స) ఇలా అన్నారు: "ఈ ఉహుద్ పర్వతం అంత బంగారం నా దగ్గర ఉండి, అప్పు తీర్చడానికి కేటాయించి నది తప్ప, కనీసం ఒక్క దీనార్ కూడా మిగిలి ఉండగా నాపై మూడవ రాత్రి గడిచిపోవడం నాకు ఏమాత్రం ఇష్టం ఉండదు. బదులుగా, నేను దానిని అల్లాహ్ సేవకుల మధ్య ఖచ్చితంగా పంచిపెట్టేవాడిని. ఇలా, ఇలా, మరియు ఇలా" (అని నడుస్తూ తన కుడివైపు, ఎడమవైపు మరియు వెనుకవైపు సైగ చేస్తూ చెప్పారు). ఆ తర్వాత ప్రవక్త (స) ఇలా అన్నారు: "ఎవరైతే అత్యధిక సంపదను కలిగి ఉంటారో, వారే పునరుత్థాన దినాన అత్యంత నిరుపేదలుగా ఉంటారు" అంటే, సంపదను పోగు చేసుకుని, దానిని అవసరంలో ఉన్నవారికి మరియు పేదలకు ఖర్చు చేయని వారు. తీర్పు దినాన వారు నిరుపేదలుగా ఉంటారు ."అయితే, ఎవరైతే ఇలా, ఇలా, మరియు ఇలా ఖర్చు చేస్తారో వారు తప్ప." దానం చేసేవారు తీర్పు దినాన నిరు పేదలుగా ఉండరు. అంటే, తమ కుడివైపు, ఎడమవైపు మరియు వెనుకవైపు ఉన్న వారికి దానం చేసేవారు. మరియు ఇలా అన్నారు: "అల్లాహ్ మార్గంలో అంత ఉదారంగా దానం చేసేవారు చాలా తక్కువ మంది. విశ్వాసులలోని ధనవంతుల విషయాని కొస్తే వారు సంపదను దాచుకోరు. బదులుగా, వారు ఎటువంటి భయం లేదా సంకోచం లేకుండా అల్లాహ్ మార్గంలో ఖర్చు చేస్తారు, తద్వారా అల్లాహ్ వారికి మరింత ఎక్కువగా తన అనుగ్రహాన్ని కురిపిస్తాడు."

**(సహీ బుఖారీ ఉర్దూ అనువాదం, సంపుటి 15, కితాబ్-ఉల్-రికాఖ్, హదీసు 6444, నజారత్ ఇషాత్, పేజీలు 211-212)**

హజ్రత్ అనస్ (రజి) ఇలా ఉల్లేఖించారు: ఒక వ్యక్తి ప్రవక్త (స)ను రెండు పర్వతాల మధ్య మేస్తున్న గొర్రెలన్నింటినీ అడగగా, ప్రవక్త (స) వాటినన్నింటినీ అతనికి ఇచ్చేశారు. అప్పుడు ఆ వ్యక్తి తన ప్రజల వద్దకు తిరిగి వెళ్ళి ఇలా అన్నాడు: "ఓ నా ప్రజలారా! ఇస్లాంను స్వీకరించండి; ఎందుకంటే అల్లాహ్ ప్రమాణం!, ముహమ్మద్ (స) ఎంత ఉదారంగా ఇస్తారంటే, ఇక పేదరికం పట్ల ఎలాంటి భయం ఉండదు." హజ్రత్ అనస్ (రజి) ఇలా జోడించారు: "కొందరు వ్యక్తులు కేవలం ప్రాపంచిక ప్రయోజనం కోసమే ఇస్లాంను స్వీకరించే సందర్భాలు ఉండేవి, కానీ వారు ఇస్లాంలోకి ప్రవేశించిన మరుక్షణమే, ఆ మతం వారికి ఈ ప్రపంచం మరియు అందులోని సమస్తం కంటే అత్యంత ప్రియమైనదిగా మారిపోయేది." **(సహీముస్లిం ఉర్దూ అనువాదం, సంపుటి 12, కితాబుల్ ఫజాయిల్, హదీసు 4262, పేజీలు 223-224)**

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ఇలా చెబుతున్నారు: ప్రవక్త (స) మరుసటి రోజు కోసం ఏదీ దాచి ఉంచేవారు కాదు.

**(షమాయిలున్ నబీ, హదీసు 339, పేజీ 148)**

హజ్రత్ ఉఖ్బా బిన్ హారిస్ (రజి) ఇలా ఉల్లేఖించారు: ప్రవక్త (స) మాకు అసర్ నమాజు చేయించారు, ఆ తర్వాత ప్రవక్త (స) వేగంగా ఇంటికి వెళ్ళి, కొద్ది సేపటికే తిరిగి బయటకు వచ్చారు. ఉల్లేఖకుడు ఇలా అన్నారు: నేను వారిని అడిగాను లేదా మరొకరు వారిని అడిగారు - అప్పుడు ప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు: "ధర్మకార్యాల కోసం ఉంచిన నిధులలోని ఒక బంగారు ముక్కను నేను ఇంట్లో వదిలి వచ్చాను. అది రాత్రంతా నా దగ్గర ఉండిపోవడం నాకు ఇష్టం లేదు, అందుకే దాన్ని పంపిణీ చేయించాను." **(సహీ బుఖారీ, ఉర్దూ అనువాదం, సంపుటి 3, కితాబుజ్ జకాత్, హదీసు 1430, నజారత్ ఇషాత్, పేజీలు 53-54)**

హజ్రత్ ఉమ్మే సలమా (రజి) ఇలా పేర్కొన్నారు: "అల్లాహ్ ప్రవక్త (స) నా దగ్గరకు వచ్చారు, అప్పుడు వారి ముఖం రంగు మారిపోయి ఉంది." ఆమె ఇలా అంటారు, "ఏదైనా నొప్పి లేదా అసౌకర్యం వల్ల అలా జరిగి ఉంటుందని నేను భావించాను." నేను ఇలా అడిగాను: "ఓ అల్లాహ్ ప్రవక్తా (స)! మీ ముఖం రంగు మారినట్లుగా నాకు కనిపిస్తోంది; ఏదైనా అసౌకర్యం వల్ల అలా జరిగిందా?" వారు (స) ఇలా సమాధానమిచ్చారు: "కాదు, నిన్న సాయంత్రం మాకు వచ్చిన ఏడు దీనార్ల (బంగారు నాణేల) కారణంగానే ఇలా జరిగింది. రాత్రంతా గడిచినా మేము వాటిని ఖర్చు చేయలేదు. మంచం మూలలో వాటిని ఉంచిన విషయం నేను మర్చి పోయాను; ఆ విషయం గుర్తుకు వచ్చినప్పుడు, అది నా మనసుపై గొప్ప భారంగా అనిపించింది."

**(ముస్నద్ అహ్మద్ బిన్ హన్బల్, సంపుటి 8, హదీసు 207, మక్తబా ఆలం-ఉల్-కుతుబ్, బైరూట్, 1998, పేజీలు 630-631)**

హజ్రత్ ఉఖ్బా(రజి) ఇలా ఉల్లేఖించారు: "నేను మదీనాలో దైవప్రవక్త (స) వెనుక అసర్ నమాజు చేశాను." వారు నమాజు ముగించిన వెంటనే వేగంగా లేచి, ప్రజల వరుసల మధ్య నుండి తన భార్యల నివాస గృహాల వైపు వెళ్లారు. వారి ఆ తొందర పాటును చూసి ప్రజలు ఆందోళన చెందారు. ఆ తర్వాత ప్రవక్త (స) తిరిగి బయటకు వచ్చి, వారి ఆశ్చర్యాన్ని గమనించి ఇలా అన్నారు: "నా దగ్గర ఉన్న కొంత బంగారం విషయం నాకు గుర్తుకు వచ్చింది. అల్లాహ్ స్మరణ నుండి నా ధ్యానాన్ని మళ్లించేలా ఆ బంగారం ఉండటం నాకు ఇష్టం అనిపించలేదు . అందుకే దానిని పంపిణీ చేయమని ఆదేశించాను." **(సహీహ్ అల్-బుఖారీ ఉర్దూ అనువాదం, సంపుటి 2, కితాబ్-ఉల్-అజాన్, హదీసు 851, నజారత్ ఇషాత్, పేజీలు 252-253)**

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా పేర్కొన్నారు: దైవ ప్రవక్త (స) స్వభావం ఎలా ఉండేదంటే, తన దగ్గర ఉన్నదానిని వారు ఉదారతతో దానం చేసేవారు. ఒక సందర్భంలో, వారి ఇంట్లో ఒక బంగారు నాణెం ఉంది; వారు దానిని తీసుకుని పంపిణీ చేయించారు. **(మల్ఫూజాత్, 2022, సంపుటి 3, పేజీ 323)**

అదే సంఘటనను ప్రస్తావిస్తూ, హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ (రజి) ఒక చోట ఇలా రాశారు: "ఒక సందర్భంలో కొంత దానధర్మాల సొమ్ము వచ్చింది. దానిని పంపిణీ చేస్తున్నప్పుడు, ఒక దినార్ (నాణెం) ఒక మూలకు పడిపోయింది; దానిని తీసుకోవడం ప్రవక్త (స) గారికి అప్పుడు గుర్తుకు రాలేదు. నమాజ్ తర్వాత ఆ విషయం గుర్తుకు రాగానే, వారు ప్రజల వరుసల మధ్య నుండి వేగంగా అడుగులు వేస్తూ ఇంటికి వెళ్లారు. అప్పుడు సహచరులు, 'ఓ అల్లాహ్ ప్రవక్తా (స)! ఏమి జరిగింది?' అని అడిగారు.

దానికి వారు, 'అక్కడ ఒక దినార్ పంపిణీ కాకుండా ఉండి పోయింది. దానిని వీలైనంత త్వరగా పంపిణీ చేయాలనుకున్నాను' అని సమాధాన మిచ్చారు. క్లుప్తంగా చెప్పాలంటే, వారి చేతుల మీదుగా ఎంత సంపద వెళ్ళినప్పటికీ, దాని పట్ల వారు ఎంతో నిస్సంగత్వాన్ని మరియు స్వేచ్ఛా భావనను ప్రదర్శించేవారు .అది చూసి ఆశ్చర్యం కలుగుతుంది; తనకు లభించిన దేనినైనా వారు(స) అల్లాహ్ మార్గంలో పంపిణీ చేసేవారు."

**(తఫ్సీర్-ఎ-కబీర్, 2023, సంపుటి 7, పేజీలు 478-479)**

హజ్రత్ అనస్ (రజి) ఇలా ఉల్లేఖించారు: బహెరైన్ నుండి ప్రవక్త (స) వద్దకు కొంత సంపద తీసుకురాబడింది. వారు "దీనిని మసీదులో పరచండి" అని ఆదేశించారు. అల్లాహ్ ప్రవక్త (స) వద్దకు తీసుకురాబడిన సంపదలో ఇదే అత్యధిక మొత్తం. వారు (స) నమాజ్ కోసం బయటకు వెళ్లారు, ఆ సంపద వైపు ఏమాత్రం దృష్టి సారించలేదు. కనీసం దానిని చూడటానికి కూడా ప్రయత్నించలేదు. నమాజ్ పూర్తయ్యాక, వారు (స) తిరిగి వచ్చి ఆ సంపద దగ్గర కూర్చుని, తన కంటికి కనిపించిన వారికి దానిని ఇవ్వసాగారు. ఆ సమయంలో, హజ్రత్ అబ్బాస్ (రజి) అక్కడికి వచ్చి ఇలా అన్నారు: "ఓ అల్లాహ్ ప్రవక్త (స), నాకు కూడా కొంత ఇవ్వండి. ఎందుకంటే బదర్ యుద్ధం రోజున నా విముక్తి ధనాన్ని (ఫిద్‌యా) నేనే చెల్లించుకున్నాను, అలాగే అఖీల్ విముక్తి ధనాన్ని కూడా నేనే చెల్లించాను" అఖీల్ అంటే ఆయన మేనల్లుడు, అఖీల్ బిన్ అబూ తాలిబ్. అల్లాహ్ ప్రవక్త (స) ఆయనతో, "దీని నుండి తీసుకోండి" అని అన్నారు. అప్పుడు ఆయన రెండు చేతులతో సంపదను నింపుకుని తన వస్త్రంలో పోసుకున్నారు, ఆపై దానిని ఎత్తడానికి ప్రయత్నించారు .కానీ ఎత్తలేకపోయారు. ఆయన, "ఓ అల్లాహ్ ప్రవక్త (స), దీనిని మోయడంలో నాకు సహాయపడమని ఎవరికైనా చెప్పండి" అని కోరారు. ప్రవక్త (స) "వద్దు, నేను అలా చేయలేను" అని అన్నారు. అప్పుడు ఆయన, "అయితే కనీసం మీరే స్వయంగా దానిని ఎత్తి నా మీద ఉంచండి" అని అడిగారు. ప్రవక్త (స) "వద్దు" అని అన్నారు. దాంతో ఆయన కొంత సంపదను బయటకు తీసి మళ్లీ ఎత్తడానికి ప్రయత్నించారు. కానీ అప్పటికీ ఎత్తలేకపోయారు. ఆయన, "ఓ అల్లాహ్ ప్రవక్త (స), దీనిని మోయడంలో నాకు సహాయపడమని ఎవరికైనా చెప్పండి" అని కోరారు. ప్రవక్త (స) "వద్దు" అని అన్నారు. ఆయన, "అయితే మీరే స్వయంగా దానిని నా మీద ఉంచండి" అని అడిగారు. ప్రవక్త (స) "వద్దు" అని అన్నారు. అప్పుడు ఆయన మరికొంత సంపదను బయటకు తీసి, దానిని ఎత్తి, తన భుజంపై వేసుకుని అక్కడి నుండి వెళ్లిపోయారు. ఆయన వెళ్తుండగా, అల్లాహ్ ప్రవక్త (స) ఆయన కంటికి కనిపించకుండా పోయేంత వరకు చూస్తూనే ఉన్నారు.

ప్రతి సందర్భంలోనూ, ప్రవక్త (స) తన సహచరులకు మితంగా వ్యవహరించాలని ఉపదేశించేవారు. దాని అంతరార్థం ఏమిటంటే: నేను ఇస్తాను. మీరు తప్పక తీసుకోండి. కానీ ఒక పరిమితితో తీసుకోండి. అవతలి వ్యక్తి అత్యంత సన్నిహిత బంధువైనప్పటికీ, మితంగా వ్యవహరించడం అవసరం. మీకు ఎంత అవసరమో అంతే తీసుకోండి, అంతకు మించి వద్దు. ఈ హదీసు చివరలో, ఉల్లేఖనకర్త తన సొంత పరిశీలనను జోడించారు: హజ్రత్ అబ్బాస్ (రజి) చూపిన ఆశను (లోభాన్ని) చూసి ప్రవక్త (స) ఆశ్చర్యపోయారు. **(సహీహ్ అల్-బుఖారీ ఉర్దూ అనువాదం, సంపుటి 1, కితాబ్-ఉస్-సలాత్, హదీసు 421, నజరాత్ ఇషాత్, పేజీలు 517-518)**

అయితే, ఇది ఆ హదీసును వివరించే వ్యక్తి (రావి) యొక్క వ్యక్తిగత అభిప్రాయం మాత్రమే. వారి ఆసక్తిని చూసి ప్రవక్త (స) ఆశ్చర్యపోయి వారి వైపు చూడకపోవడం జరిగి ఉండకపోవచ్చు. బదులుగా, ఆ సహచరులు ఒకప్పుడు అనుభవించిన పేదరికం మరియు వారి పూర్వపు పరిస్థితులు ప్రవక్త (స)కు గుర్తుకు వచ్చి ఉండవచ్చు. దీని గురించి ఆలోచిస్తూ, వారు దూరంగా వెళ్ళే వరకు చూస్తూ ఉండిపోయారు. ఆ ప్రజలు ఎలా త్యాగాలు చేస్తూ వచ్చారో, వారి పరిస్థితులు ఒకప్పుడు ఎంత కష్టంగా మరియు పేదరికంతో కూడుకుని ఉండేవో, మరియు నేడు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వారికి ఎలా అనుగ్రహాలను ప్రసాదిస్తూ పోషిస్తున్నాడో అని వారు ఆలోచిస్తూ ఉండి ఉంటారు.

వివిధ వ్యాఖ్యాతలు కూడా ఈ వ్యాఖ్యను ఆ సందర్భం పట్ల ఆ వ్యక్తికి కలిగిన వ్యక్తిగత అవగాహనగా పేర్కొన్నారు మరియు ఇతర వివరణలను అందించారు. అంటే ప్రవక్త (స) వారిలో ఏదైనా దురాశను చూసి ఆశ్చర్యపోవడం కాకుండా, వారి పవిత్ర మనస్సులో పూర్తిగా భిన్నమైన ఆలోచనలు మెదులుతూ ఉండేవని వారు చెప్పారు. **(అల్-ఇఫ్సాహ్ అన్ మఆనీ అస్-సిహాహ్, సంపుటి 5, దారుల్-వతన్, పేజీ 323)**

హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి) ఇలా పేర్కొన్నారు: ప్రవక్త (స)ను ఏదైనా అడిగినప్పుడు వారు ఎప్పుడూ నిరాకరించిన సందర్భం లేదు.

**(సహీహ్ ముస్లిం ఉర్దూ అనువాదం, సంపుటి 12, కితాబ్-ఉల్-ఫజాయిల్, హదీసు 4260, నూర్ ఫౌండేషన్, పేజీలు 222-223)**

హజ్రత్ సహల్ బిన్‌సద్ (రజి) ఇలా పేర్కొన్నారు: ప్రవక్త (స) అత్యంత నిరాడంబర స్వభావం కలవారు; ఎవరైనా వారిని ఏదైనా అడిగినప్పుడు, వారు దానిని తప్పక ఇచ్చేవారు. **(సుబుల్ అల్-హుదా వ అల్-రిషాద్, సంపుటి 7, దారుల్-కుతుబ్ అల్-ఇల్మియ్యాహ్, బీరూట్, 1993, పేజీ 50)**

ఇబ్నే అబీ ఖైసమా, హజ్రత్ అలీ (ర)ని ఆధారం చేసుకోని ఇలా పేర్కొన్నారు: హజ్రత్ అలీ (రజి) ఎప్పుడైనా ప్రవక్త (స) యొక్క గుణగణాలను వర్ణించేటప్పుడు, ప్రవక్త (స) అందరికంటే అత్యంత ఉదారస్వభావం కలవారని చెప్పేవారు.

**(సుబుల్ అల్-హుదా వ అల్-రిషాద్, సంపుటి 7, దారుల్-కుతుబ్ అల్-ఇల్మియ్యాహ్, బైరూట్, 1993, పేజీ 52)**

హజ్రత్ సహల్ బిన్ సద్ (రజి) ఇలా వివరిస్తారు: ఒక మహిళ 'బుర్దా' (ఒక రకమైన పై వస్త్రం) తీసుకుని వచ్చి, "ఓ అల్లాహ్ ప్రవక్త (స)! మీరు ధరించాలని నేను దీనిని స్వయంగా నేసాను" అని చెప్పింది. ప్రవక్త (స)కు అప్పుడు ఒక పై వస్త్రం అవసరం ఉండటంతో వారు దానిని స్వీకరించారు. ఆ తర్వాత వారు ఆ వస్త్రాన్నే తమ నడుముకు కట్టుకునే వస్త్రంగా (లూంగీ లేదా తహ్‌బంద్‌లా) ధరించి బయటకు వచ్చారు. అప్పుడు అక్కడి వారిలో ఒక వ్యక్తి, "ఓ అల్లాహ్ ప్రవక్త (స)! దయచేసి ఆ వస్త్రాన్ని నాకు ఇవ్వండి, నేను ధరిస్తాను" అని అడిగాడు. ప్రవక్త (స) "సరే" అని అన్నారు. వారు కాసేపు ఆ సభలో కూర్చుని, ఆపై లోపలికి వెళ్లి, ఆ వస్త్రాన్ని మడతపెట్టి, వేరొక వస్త్రాన్ని ధరించిన తర్వాత దానిని ఆ వ్యక్తికి పంపించారు. అప్పుడు ప్రజలు ఆ వ్యక్తితో, "ప్రవక్త (స)ను అలా అడగడం నువ్వు చేసిన పని సరికాదు. అడిగిన వారిని వారు(స) ఎప్పుడూ నిరాకరించరని నీకు తెలుసు కదా" అని అన్నారు. దానికి ఆ వ్యక్తి, "అల్లాహ్ ప్రమాణం! నేను చనిపోయినప్పుడు అది నా కఫన్ (మృతదేహాన్ని చుట్టే వస్త్రం)గా ఉపయోగపడాలనే ఉద్దేశంతోనే దానిని అడిగాను" అని సమాధానమిచ్చాడు. హజ్రత్ సహల్ (రజి) చెబుతున్నట్లుగా, ఆ తర్వాత అదే వస్త్రం అతని అంత్యక్రియల సమయంలో కఫన్‌గా ఉపయోగించబడింది. **(సహీహ్ అల్-బుఖారీ ఉర్దూ అనువాదం, సంపుటి 4, కితాబుల్-బుయూ', హదీసు 2093, నజరాత్ ఇషాత్, పేజీలు 58-59)**

మరొక కథనంలో, హజ్రత్ మిస్వర్ బిన్ మఖ్‌రమా (రజి) ఇలా వివరిస్తారు: ప్రవక్త (స) కొన్ని వస్త్రాలను (అంగీలను) పంపిణీ చేశారు, కానీ మఖ్‌రమాకు మాత్రం ఒకటి ఇవ్వలేదు. అప్పుడు మఖ్రమా తన కుమారుడితో, "నాయనా, అల్లాహ్ ప్రవక్త (స) వద్దకు నాతో రా" అని అన్నారు. ఆయన కుమారుడు మిస్వర్ ఇలా చెబుతారు: "నేను ఆయనతో వెళ్లాను. ఆయన నాతో, 'లోపలికి వెళ్లి ప్రవక్త(స)ను నా దగ్గరకు పిలుచుకురా' అని చెప్పారు." మిస్వర్ ఇంకా ఇలా అంటారు: "అప్పుడు నేను చిన్నవాడిని. నేను లోపలికి వెళ్లి ప్రవక్త (స)ను పిలిచి, మా నాన్నగారు వచ్చారని చెప్పాను. ప్రవక్త (స) ఆ వస్త్రాలలో ఒకదానిని చేతిలో పట్టుకుని బయటకు వచ్చి, 'నేను దీనిని నీ కోసమే పక్కన ఉంచాను' అని అన్నారు." అంటే, మఖ్రమా తన అసంతృప్తిని లేదా ఫిర్యాదును వ్యక్తం చేయకముందే, ప్రవక్త (స) ఆ వస్త్రాన్ని ఆయనకు ఇచ్చి, అది ఆయన కోసమే ఉంచినట్లు చెప్పారు. ప్రవక్త (స) మఖ్రమాను చూడగానే ఆ వస్త్రం ఆయన కోసమేనని చెప్పారని, దాంతో మఖ్రమా సంతోషించారని ఆ కథనకర్త పేర్కొన్నారు. **(సహీహ్ ముస్లిం ఉర్దూ అనువాదం, సంపుటి 4, కితాబుజ్-జకాత్, హదీసు 1736, నూర్ ఫౌండేషన్, పేజీ 229; ఫత్హుల్ బారీ, సంపుటి 10, కితాబుల్ లిబాస్, హదీసు 5800, మక్తబుల్ మాలిక్ ఫహద్, రియాద్, 2001, పేజీ 281)**

మరొక కథనంలో ఇలా పేర్కొనబడింది: ప్రవక్త (స) హజ్రత్ మఖ్రమా (రజి) గొంతును గుర్తించి స్వయంగా బయటకు వచ్చారు. కుమారుడు లోపలికి వెళ్లి పిలిచే వరకు వేచి ఉండకుండా, వారు(స) స్వయంగా బయటకు వచ్చారు. వారి వద్ద ఒక వస్త్రం ఉంది; దానిని మఖ్రమాకు చూపిస్తూ, అది ఆయన కోసమే పక్కన ఉంచానని చెబుతూ దాని విశేషాలను వివరించడం ప్రారంభించారు. **(సహీహ్ ముస్లిం ఉర్దూ అనువాదం, సంపుటి 4, కితాబుజకాత్, హదీసు 1737, నూర్ ఫౌండేషన్, పేజీ 229)**

హజ్రత్ అనస్ బిన్ మాలిక్ (రజి) ఇలా పేర్కొన్నారు: "నేను అల్లాహ్ ప్రవక్త (స)తో కలిసి నడుస్తున్నాను. వారు (స) నజ్రాన్ ప్రాంతానికి చెందిన, గరుకైన అంచు కలిగిన ఒక దుప్పటిని ధరించి ఉన్నారు. ఒక బదవీ (అరేబియా గ్రామీణుడు) ప్రవక్త (స) వద్దకు వచ్చి, వారి దుప్పటిని చాలా గట్టిగా లాగాడు. నేను ప్రవక్త (స) మెడ వైపు చూసినప్పుడు, ఆ దుప్పటిని బలంగా లాగడం వల్ల దాని అంచు వారి మెడపై ఒక గుర్తును మిగిల్చినట్లు గమనించాను. అప్పుడు ఆ బదవీ ఇలా అన్నాడు: 'ఓ ముహమ్మద్! నీ వద్ద ఉన్న అల్లాహ్ సంపద నుండి నాకు కొంత వాటా ఇచ్చేలా ఆదేశించు.' ప్రవక్త (స) అతని వైపు తిరిగి చిరునవ్వు చిందించి, అతనికి కొంత ఇవ్వాలని ఆదేశించారు."

**(సహీహ్ ముస్లిం ఉర్దూ అనువాదం, సంపుటి 4, పేజీలు 227-228, కితాబుజ్-జకాత్, హదీసు 1735, నూర్ ఫౌండేషన్)**

ఈ సంఘటన హజ్రత్ అబూ హురైరా (రజి) కథనంలో కూడా వివరించబడింది. ప్రవక్త (స) వారితో ఒక సమావేశంలో కూర్చుని మాట్లాడేవారు. వారు వెళ్ళడానికి లేచినప్పుడు, వారు కూడా లేచేవారు; వారు(స) తన భార్యల ఇళ్ళలో ఒకదానిలోకి ప్రవేశించే వరకు వారు అలాగే ఉండేవారు. వారు ఇలా అంటున్నారు: "ఒక రోజు, ప్రవక్త (స) మాతో మాట్లాడుతుండగా లేచి నిలబడ్డారు, మేము కూడా లేచి నిలబడ్డాము. అప్పుడు ఒక బదవీ వారి దుప్పటిని పట్టుకుని లాగడం మేము చూశాము, దానివల్ల వారి (స) మెడ ఎర్రబడింది." ప్రవక్త (స) ధరించిన దుప్పటి చాలా గరుకుగా ఉండేదని హజ్రత్ అబూ హురైరా (రజి) వివరించారు. ప్రవక్త (స) అతని వైపు తిరిగినప్పుడు, ఆ బదవీ ఇలా అన్నాడు: "నా ఈ రెండు ఒంటెలపై సంపదను నింపండి; ఎందుకంటే మీరు వాటిని మీ సొంత సంపద నుండి గానీ, మీ తండ్రి సంపద నుండి గానీ నింపడం లేదు కదా." అతను చాలా కఠినమైన లేదా అసభ్యకరమైన రీతిలో మాట్లాడాడు. ఆ కథకుడు చెప్పిన దాని ప్రకారం, ప్రవక్త (స) ఇలా సమాధానమిచ్చారు: "కాదు, నేను అల్లాహ్ నుండి క్షమాపణ కోరుతున్నాను. కాదు, నేను అల్లాహ్ నుండి క్షమాపణ కోరుతున్నాను. కాదు, నేను అల్లాహ్ నుండి క్షమాపణ కోరుతున్నాను." వారు (స) అల్లాహ్ నుండి క్షమాపణ కోరుతూనే ఉండి, అతని అభ్యర్థనను తిరస్కరించారు. అప్పుడు దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: "నా పైవస్త్రాన్ని (చాదర్‌ను) ఆ విధంగా లాగినందుకు నాకు పరిహారం చెల్లించేంత వరకు నేను నీకు ఏమీ ఇవ్వను" (దైవప్రవక్త (స) దీనిని పూర్తిగా నిరాకరించలేదు, బదులుగా ఒక షరతు విధించారు). మరో మాటలో చెప్పాలంటే, తన వస్త్రాన్ని లాగి తన మెడకు గాయం కలిగించినందుకు పరిహారం చెల్లించమని వారు కోరారు. ప్రతిసారీ ఆ బదూవీ (అరేబియా గ్రామీణుడు) ఇలా అనేవాడు: "అల్లాహ్ ప్రమాణం!, నేను దీనికి ఎటువంటి పరిహారం చెల్లించను." అతను ఇలా అన్నాడు: "లేదు, నేను ఎటువంటి పరిహారం ఇవ్వను, ఎందుకంటే మీరు చెడుకు ప్రతిగా చెడు చేయరు కదా." ఆ బదూవీ ఈ వాదనను ఉపయోగించాడు, మరియు అలా చేయడంలో

అతను తెలివిగా వ్యవహరించాడు. అంటే అతని ఉద్దేశ్యం ఇది: "మీరు చెడుకు ప్రతిగా చెడుతో స్పందించరు కాబట్టి, నేను మీకు పరిహారం చెల్లించాల్సిన ప్రశ్ననే లేదు. నేను తప్పు చేశాను, కానీ మీరు దానికి ప్రతిగా తప్పు చేయరు." దీనికి దైవ ప్రవక్త (స) చిరునవ్వు నవ్వారు. ఆ తర్వాత, ఆ బదూవీ ఒంటెలలో ఒకదానిపై బార్లీని, మరొకదానిపై ఖర్జూరాలను ఎక్కించమని హజ్రత్ ఉమర్ (ర)కు ఆదేశించారు. అలా వారు (స) అతనికి సంపదను ఇవ్వడమే కాకుండా, అతని కఠిన ప్రవర్తనను కూడా క్షమించారు.

**(సునన్ అబీ దావూద్, కితాబుల్ అదాబ్, హదీసు 4475)**

హజ్రత్ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి) ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త (స) "నాకు బహ్రైన్ సంపద లభిస్తే, నేను మీకు ఇంత, ఇంత మరియు ఇంత ఇస్తాను" అని తన రెండు చేతులను కలిపి సైగ చేస్తూ చెప్పేవారు. అయితే, బహ్రైన్ సంపద వచ్చేలోపే దైవ ప్రవక్త (స) పరమపదించారు. వారి మరణానంతరం ఆ సంపద హజ్రత్ అబూబకర్ (ర) వద్దకు చేరింది. దైవ ప్రవక్త (స) నుండి ఎవరికైనా ఏదైనా వాగ్దానం లేదా బాకీ ఉంటే వారు ముందుకు రావాలని చాటింపు వేయమని వారు(రజి) ఒక వ్యక్తిని ఆదేశించారు. హజ్రత్ జాబిర్ (రజి) ఇలా చెబుతున్నారు: "నేను లేచి ఇలా విన్నవించాను, 'బహ్రైన్ నుండి సంపద వస్తే, నాకు ఇంత, ఇంత మరియు ఇంత (మొత్తం) ఇస్తానని ప్రవక్త (స) చెప్పి ఉన్నారు.' అప్పుడు హజ్రత్ అబూ బకర్ (రజి) తమ రెండు చేతులను కలిపి నింపి, వాటిని లెక్కించమని నన్ను అడిగారు. నేను లెక్కించగా, అది ఐదు వందల దిర్హమ్‌లు అని తేలింది. అప్పుడు ఆయన, 'దీనికి రెట్టింపు మొత్తాన్ని కూడా తీసుకో' అని అన్నారు." ఈ సంపదను హజ్రత్ అలా బిన్ హద్రమీ (రజి) పంపారు; వీరిని ప్రవక్త (స) బహ్రైన్‌కు గవర్నర్‌గా నియమించి ఉన్నారు. ప్రవక్త (స) మరణానంతరం కూడా హజ్రత్ అలా (రజి) ఆ పదవిలో కొనసాగారు.

**(సహీహ్ ముస్లిం ఉర్దూ అనువాదం, సంపుటి 12, కితాబుల్ ఫజాయిల్, హదీసు 4264, నూర్ ఫౌండేషన్, పేజీలు 224-225)**

హారూన్ బిన్ రియాబ్ ఇలా పేర్కొన్నారు: ఒక సందర్భంలో, ప్రవక్త (స) వద్దకు డెబ్బై వేల దిర్హమ్‌లు తీసుకురాబడ్డాయి. ఈ కథనం ప్రకారం, ప్రవక్త (స)కు లభించిన సంపదలో ఇదే అత్యధిక మొత్తం. ఆ సంపదను ఒక చాపపై ఉంచారు. అప్పుడు ప్రవక్త (స) దానిని పంపిణీ చేయడానికి నిలబడ్డారు; అడిగి వచ్చిన వారిలో ఎవరినీ ఖాళీ చేతులతో పంపలేదు. ఆ మొత్తం సంపద పంపిణీ పూర్తయ్యే వరకు వారు (స) ఇస్తూనే ఉన్నారు. **(అఖ్లాఖున్-నబీ వ ఆదాబిహి, హదీసు 97, మక్తబా దారుల్-లులు, పేజీలు 103-104)**

ప్రవక్త (స) వద్దకు తీసుకురాబడిన సంపదలో ఇదే అత్యధిక మొత్తం అని ఈ కథనం పేర్కొంటుంది, అయితే ఆ తర్వాత అంతకంటే ఎక్కువ మొత్తాలు కూడా వచ్చాయి. బహుశా కథనం చెప్పిన వ్యక్తికి తెలిసినంత వరకు ఇదే అత్యధిక మొత్తం అయి ఉండవచ్చు, లేదా ఈ కథనం చెప్పబడుతున్న సమయానికి అప్పటి వరకు లభించిన వాటిలో ఇదే అత్యధిక మొత్తం అయి ఉండవచ్చు. బహ్రైన్ నుండి వచ్చిన సంపదకు సంబంధించిన మునుపటి కథనం దీనికంటే చాలా ఎక్కువ మొత్తాన్ని సూచిస్తుంది.

హజ్రత్ అబూ హురైరా (రజి) ఇలా ఉల్లేఖించారు: ఒక వ్యక్తి ప్రవక్త (స) వద్దకు వచ్చి ఏదైనా ఇవ్వమని అడిగాడు. ప్రవక్త (స) అప్పుగా అర 'వస్క్' ధాన్యాన్ని తీసుకుని అతనికి ఇచ్చారు. ఒక 'వస్క్' అంటే సుమారు అరవై 'సా'లకు సమానం, మరియు ఒక 'సా' అంటే సుమారు రెండున్నర కిలోలకు సమానం. తరువాత, ఎవరి దగ్గరైతే ఆ వస్తువు అప్పుగా తీసుకోబడిందో, వారు దానిని తిరిగి అడగడానికి వచ్చారు. అప్పుడు దైవ ప్రవక్త (స) వారికి ఒక పూర్తి 'వస్క్' (కొలత) పరిమాణంలో ధాన్యాన్ని ఇచ్చి ఇలా అన్నారు: "ఇందులో సగం అప్పు తీర్చడానికి, మిగిలిన సగం మీకు బహుమతిగా ఇవ్వడానికి." **(అల్-షిఫా బి తారీఫ్ హుకూఖ్ అల్-ముస్తఫా, ఖాదీ అయ్యాజ్, దారుల్-కుతుబ్ అల్-ఇల్మియ్యా, బీరూట్, 2002, పేజీలు 77-78; లుఘతుల్-హదీస్, సంపుటి 2, పేజీ 648 మరియు సంపుటి 4, పేజీ 487)**

అప్పు తీర్చడానికి ఇది అత్యుత్తమ విధానం. వారు(స) ఒక అవసరంలో ఉన్న వ్యక్తికి ఇవ్వడం కోసం అర 'వస్క్' ధాన్యాన్ని అప్పుగా తీసుకున్నారు, కానీ ఎవరి దగ్గరైతే అప్పు తీసుకున్నారో వారికి తిరిగి ఇచ్చేటప్పుడు ఒక పూర్తి 'వస్క్' ఇచ్చారు. అప్పు తీర్చడంలో ఇది ఒక గొప్ప పద్ధతి. అప్పు చెల్లింపులో జాప్యం చేయడం, సాకులు చెప్పడం లేదా అసలు మొత్తాన్ని తిరిగి ఇవ్వడంలో సంకోచించడం వంటివి చేయకూడదు.

హజ్రత్ సహల్ బిన్ సద్ సైదీ (రజి) ఇలా పేర్కొన్నారు: దైవ ప్రవక్త (స) కోసం నల్లని ఉన్ని దుప్పటి (అంగీ) ఒకటి తయారు చేయబడింది. ఒక రోజు, దైవ ప్రవక్త (స) ఆ దుప్పటిని ధరించి తన సహచరుల ముందుకు వచ్చారు. అప్పుడు దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు: "ఇది ఎంత అందంగా ఉందో మీరు గమనించలేదా?" అప్పుడు ఒక గ్రామీణ అరబ్ వ్యక్తి ఇలా విన్నవించుకున్నాడు: "ఓ అల్లాహ్ ప్రవక్త (స) గారూ! నా తల్లిదండ్రులు మీ కోసం బలి కావచ్చు (అంటే మీ పట్ల ఎంతో భక్తిభావం కలిగి ఉన్నాను), దయచేసి ఈ దుప్పటిని నాకు ప్రసాదించండి."తమను అడిగిన వారిని కాదనడం దైవ ప్రవక్త (స) అలవాటు కాదు. కాబట్టి, ప్రవక్త (స) ఆ దుప్పటిని తీసి అతనికి బహుకరించారు. **(సుబుల్ అల్-హుదా వ అల్-రిషాద్, సంపుటి 7, దారుల్-కుతుబ్ అల్-ఇల్మియ్యా, బీరూట్, 1993, పేజీ 53)**

ఒక చాలా చక్కని వృత్తాంతం ఉంది, దీనిలో హజ్రత్ ఇబ్నే ఉమర్ (రజి) ఇలా వివరించారు: దైవ ప్రవక్త (స) ఒక వస్త్ర వ్యాపారి నుండి నాలుగు దిర్హమ్‌లకు ఒక చొక్కాను కొనుగోలు చేశారు. ఆ చొక్కాను ధరించిన తర్వాత, దైవ ప్రవక్త (స) బయటకు వచ్చారు. అప్పుడు అన్సార్లలో ఒకరు ఇలా అన్నారు: "ఓ అల్లాహ్ ప్రవక్త (స), దయచేసి ఈ చొక్కాను నాకు ప్రసాదించండి. అల్లాహ్ మీకు స్వర్గపు వస్త్రాలను ధరింపజేయుగాక." దైవ ప్రవక్త (స) ఆ చొక్కాను విప్పి అతనికి ఇచ్చేశారు. ఆ తర్వాత, ప్రవక్త (స) తిరిగి ఆ వర్తకుని వద్దకు వెళ్లి నాలుగు దిర్హమ్‌లకు మరొక చొక్కాను కొనుగోలు చేశారు. ప్రవక్త (స) వద్ద మొదట ఉన్న పది దిర్హమ్‌లలో రెండు దిర్హమ్‌లు మిగిలాయి; మొదటి చొక్కా కోసం నాలుగు, రెండవ దాని కోసం నాలుగు ఖర్చయ్యాయి, దాంతో రెండు దిర్హమ్‌లు మిగిలిపోయాయి. దైవ ప్రవక్త (స) తిరిగి వస్తుండగా, దారి పక్కన ఒక చిన్న పని మనిషి (బాలిక) ఏడుస్తూ ఉండటం చూశారు. ఆమె బాధకు కారణం ఏమిటని ప్రవక్త (స)అడిగారు. ఆమె ఇలా సమాధానమిచ్చింది: "ఓ అల్లాహ్ ప్రవక్త (స), పిండి కొనడానికి మా అమ్మ నాకు రెండు దిర్హమ్‌లు ఇచ్చింది, కానీ నేను వాటిని పోగొట్టుకున్నాను." దైవ ప్రవక్త (స) మిగిలి ఉన్న ఆ రెండు దిర్హమ్‌లను ఆమెకు ఇచ్చారు. ఆమె వెళ్ళడానికి ఉపక్రమించింది, కానీ మళ్ళీ ఏడవడం మొదలుపెట్టింది. అప్పుడు దైవ ప్రవక్త (స) ఇలా అడిగారు: "ఇప్పుడు ఎందుకు ఏడుస్తున్నావు? నీ దగ్గర ఆ రెండు దిర్హమ్‌లు ఉన్నాయి కదా. వెళ్లి పిండి కొనుక్కో." ఆమె ఇలా బదులిచ్చింది: "నేను చాలా సేపు బయట ఉండిపోయాను కాబట్టి, మా అమ్మ నన్ను శిక్షిస్తుందేమోనని భయంగా ఉంది. నేను ఎక్కడికి వెళ్ళానని వారు అడుగుతారు." ఇది విన్న దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆమెను తన ఇంటి వరకు తీసుకొని వెళ్లారు. వారు అక్కడికి చేరుకున్నప్పుడు, ప్రవక్త (స) ఆ ఇంటివారికి సలాం చేశారు. వారు ప్రవక్త (స) స్వరాన్ని గుర్తించినప్పటికీ మౌనంగా ఉండిపోయారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారికి రెండవసారి సలాం చేశారు, అయినా వారు మళ్ళీ మౌనంగానే ఉండిపోయారు. ప్రవక్త (స) వారికి మూడవసారి సలాం చేశారు, అప్పుడు మాత్రమే వారు తిరిగి సలాం చేశారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అడిగారు, "నేను మొదటిసారి చేసిన సలాం మీకు వినపడలేదా?" దానికి వారు ఇలా జవాబిచ్చారు, "నిశ్చయంగా, మేము విన్నాము, కానీ మీరు మాపై పదేపదే సలాం పంపుతూ ఉండాలని మేము కోరుకున్నాము." సహచరుల ఆత్రుత మరియు భక్తి అలాంటివి. అప్పుడు వారు ఇలా అడిగారు, "ఓ అల్లాహ్ ప్రవక్తా! (సల్లల్లాహు అలైహి వసల్లం), మా తండ్రులు మరియు తల్లులు మీ కోసం బలిదానం చేయుగాకా! మిమ్మల్ని ఇక్కడికి ఎవరు తీసుకు వచ్చింది?" దానికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా జవాబిచ్చారు, "ఈ యువతి. మీరు తనను శిక్షిస్తారేమోనని భయపడింది." అప్పుడు ఆ దాసి యజమాని, "మీరు ఆమె తరఫున దయతో ఇక్కడికి వచ్చినందున, నేను అల్లాహ్ కొరకు ఆమెను విడిపిస్తున్నాను" అని అన్నాడు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారికి శుభ వార్తను మరియు స్వర్గాన్ని గురించి తెలియజేశారు. ఆ తర్వాత ఇలా అన్నారు: "ఈ పది దిర్హమ్‌లలో అల్లాహ్ గొప్ప అనుగ్రహాన్ని ప్రసాదించాడు. వాటి ద్వారా అల్లాహ్ తన ప్రవక్తకు వస్త్రాలు ఇచ్చాడు, ఒక అన్సారీకి వస్త్రాలు ఇచ్చాడు, మరియు ఒక దాసికి స్వేచ్ఛను ప్రసాదించాడు." **(ముఅజమ్-ఉల్-కబీర్, అల్-తబ్రానీ, సంపుటి 12, హదీస్ 13607, మక్తబా ఇబ్న్ తైమియ్యా అల్-ఖైరా, పేజీలు 441-442)**

ఒక కథనములో ఇలా గలదు. హజ్రత్ ఉస్మాన్ (రజియల్లాహు అన్హు) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు బహుమతిగా ఒక ద్రాక్ష గుత్తిని సమర్పించారు. మరొక ఉల్లేఖనంలో, అది ద్రాక్ష గుత్తి కాకుండా ఖర్జూరపు గుత్తి అని పేర్కొనబడింది. ఒక ఉల్లేఖనంలో ద్రాక్ష అని, మరొక దానిలో ఖర్జూరపు గుత్తి అని ఉంది. ఏదేమైనా, కథనం ప్రకారం ఒక బిచ్చగాడు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు రాగా, ప్రవక్త (స) అతనికి ఆ కానుకను ఇచ్చారు. ఆ తర్వాత హజ్రత్ ఉస్మాన్ (రజియల్లాహు అన్హు) ఆ బిచ్చగాడి నుండి ఆ గెలని ఒక దిర్హమ్‌కు కొనుగోలు చేశారు. అది ద్రాక్షపండైనా లేదా ఖర్జూరపండైనా, అత్యంత శ్రేష్ఠమైన నాణ్యత కలిగినదై ఉండవచ్చని తెలుస్తోంది. దానిని తిరిగి కొనుగోలు చేసిన తర్వాత, హజ్రత్ ఉస్మాన్ (రజి) దానిని మరొకసారి దైవ ప్రవక్త (స) వారికి సమర్పించారు. ఆ యాచకుడు తిరిగి వచ్చాడు, అప్పుడు దైవ ప్రవక్త (స) ఆ గెలను (ఖర్జూరపు గుత్తి)ను అతనికి మళ్లీ ఇచ్చారు. ఇదే విధంగా మూడుసార్లు జరిగింది. హజ్రత్ ఉస్మాన్ (రజి) ఆ యాచకుడి నుండి దానిని కొనుగోలు చేసి దైవ ప్రవక్త (స) వారికి సమర్పించేవారు. ప్రతిసారీ ఆ యాచకుడు తిరిగి వచ్చి దానిని అడిగేవాడు, అప్పుడు దైవ ప్రవక్త (స) దయతో దానిని అతనికి ఇచ్చేవారు. చివరకు, దైవ ప్రవక్త (స) ఆ వ్యక్తితో ఎంతో దయ మరియు వివేకంతో ఇలా అన్నారు: "ఓ ఫలానా వ్యక్తి, నువ్వు యాచకుడివా లేక వ్యాపారివా?. నువ్వు సహాయం కోరడానికి వచ్చావా లేక వ్యాపారం చేస్తున్నావా? అవసరంలో ఉన్న వ్యక్తి సాధారణంగా అడిగే పద్ధతి ఇది కాదు. ఈ పద్ధతి ద్వారా నువ్వు దిర్హమ్‌లు (డబ్బు) సంపాదిస్తూ వ్యాపారం చేస్తున్నట్లు కనిపిస్తోంది." **(తఫ్సీరుల్-మానీ, సంపుటి 15, దారుల్-కుతుబ్ అల్-ఇల్మియ్యా, బీరూట్, పేజీ 376)**

దైవ ప్రవక్త (స) ఆ వ్యక్తి అభ్యర్థనను తిరస్కరించలేదు. బదులుగా, అటువంటి ప్రవర్తన సముచితం కాదని సూచిస్తూ, ఆయనకు మృదువైన మరియు వివేకవంతమైన రీతిలో హితబోధ చేశారు.

హజ్రత్ అబ్దుల్లా బిన్ సలామ్ (రజి) ఇలా పేర్కొన్నారు: అల్లాహ్ తఆలా జైద్ బిన్ సనాకు మార్గనిర్దేశం చేయాలని సంకల్పించినప్పుడు, ఆయన ఇలా అన్నారు: "ముహమ్మద్ (స) వారి పవిత్ర ముఖంలో ప్రవక్త లక్షణాలన్నీ నాకు స్పష్టంగా కనిపించాయి, కేవలం రెండు లక్షణాల విషయంలో తప్ప. అవి వారిలో ఉన్నాయో లేదో నేను అప్పటికి ఇంకా నిర్ధారించుకోలేదు. "మొదటిది ఏమిటంటే, ఈ ప్రవక్త యొక్క దయ ఎల్లప్పుడూ వారి కోపంపై పైచేయి సాధిస్తుంది (కోపం కంటే దయ అధికంగా ఉంటుంది). "రెండవది ఏమిటంటే, ప్రజలు వారి పట్ల ఎంత కఠినంగా మరియు అజ్ఞానంతో ప్రవర్తించినా, వారి సహనం మరియు క్షమాగుణం అంతకంతకూ పెరుగుతూ ఉండేవి. "ఈ రెండు లక్షణాలను కూడా పరీక్షించి నిర్ధారించుకోవడానికి నేను ఒక అవకాశం కోసం ఎదురుచూస్తూనే ఉన్నాను." "ఏది ఏమైనప్పటికీ, ఈ క్రింది విధంగా ఒక అవకాశం లభించింది:"(జైద్ బిన్ సనా ఇలా వివరిస్తున్నారు:)

"ఒక రోజు, ప్రవక్త (స) తమ ఇంటి నుండి బయటకు వచ్చారు, వారి వెంట హజ్రత్ అలీ బిన్ అబీ తాలిబ్ (ర) కూడా ఉన్నారు. ఆ సమయంలో, ఒక వ్యక్తి వాహనంపై అక్కడికి వచ్చాడు. అతను చూడటానికి ఒక బదూవీ (అరేబియా గ్రామీణ ప్రాంతానికి చెందిన వ్యక్తి) లాగా కనిపించాడు. అతను ఇలా విన్నవించుకున్నాడు: 'ఓ అల్లాహ్ ప్రవక్తా (స)! బుస్రా సమీపంలోని ఫలానా గ్రామానికి చెందిన ప్రజలు ఇస్లాంను స్వీకరించారు. వారు ఇస్లాంను స్వీకరిస్తే వారికి సమృద్ధిగా జీవనోపాధి లభిస్తుందని నేను వారికి చెప్పియుంటిని. ఇప్పుడు, వర్షాలు లేకపోవడం వల్ల వారు కరువు మరియు కష్టాలతో బాధపడుతున్నారు. ఓ అల్లాహ్ ప్రవక్తా (స)! వారు లౌకిక సంపద ఆశతో ఎలాగైతే ఇస్లాంలోకి ప్రవేశించారో, అలాగే ఇప్పుడు దురాశ మరియు స్వార్థం కారణంగా ఇస్లాం నుండి వెనక్కి మళ్ళుతారేమోనని నేను భయపడుతున్నాను. మీరు దయతలచి, సముచితమని భావిస్తే, దయచేసి వారికి సహాయం మరియు ఉపశమనం కలిగించేలా ఏదైనా పంపండి." దైవ ప్రవక్త (స) ఆ వ్యక్తి వైపు చూశారు. వారితో ఉన్న హజ్రత్ అలీ (ర) ఇలా విన్నవించారు: "ప్రస్తుతం వారి సహాయం కోసం వెంటనే పంపగలిగేది ఏమీ అందుబాటులో లేదు." జైద్ బిన్ సనా ఇలా చెబుతున్నారు: "నేను దగ్గరలోనే నిలబడి ఇదంతా గమనిస్తున్నాను. నేను దగ్గరకు వచ్చి ఇలా అన్నాను: 'ఓ ముహమ్మద్ (స)! ఫలానా తెగకు చెందిన తోటలోని ఖర్జూరాలను, నిర్ణీత పరిమాణంలో మరియు నిర్ణీత సమయంలో అందజేసే షరతుపై నాకు అమ్ముతారా?'దైవ ప్రవక్త (స) ఇలా సమాధాన మిచ్చారు: "'ఓ యూదుడా! (సనా ఒక యూదుడు) నేను నిర్ణీత పరిమాణం మరియు నిర్ణీత గడువుతో ఖర్జూరాలను అమ్మగలను, కానీ అవి కచ్చితంగా ఫలానా తెగ తోట నుండే రావాలనే షరతుకు మాత్రం అంగీకరించలేను."'నేను, 'సరే' అని అన్నాను."అలా, దైవ ప్రవక్త (స) నాతో ఆ లావాదేవీని ఖరారు చేశారు. నేను నా సంచిని తెరిచి, నిర్ణీత సమయంలో నిర్ణీత పరిమాణంలో ఖర్జూరాలు అందజేస్తారనే ఒప్పందంపై వారికి ముందస్తుగా ఎనభై మిత్ఖాల్‌ల బంగారాన్ని చెల్లించాను. (ఒక మిత్ఖాల్ అంటే సుమారు 4.25 గ్రాములు.)"అప్పుడు దైవ ప్రవక్త (స) ఆ బంగారాన్ని సహాయం కోరి వచ్చిన వ్యక్తికి ఇచ్చి ఇలా ఆదేశించారు: "దీనిని కష్టాల్లో ఉన్నవారి మధ్య సమానంగా పంచిపెట్టి, దాని ద్వారా వారికి సహాయం చేయండి." జైద్ బిన్ సనా ఇంకా ఇలా చెబుతున్నారు: "ఒప్పందం ప్రకారం గడువు ముగియడానికి రెండు లేదా మూడు రోజులు మిగిలి ఉండగా, నేను దైవ ప్రవక్త (స) దగ్గరకు వచ్చి, వారి చొక్కా కాలర్‌ను పట్టుకుని, వారి పై వస్త్రాన్ని (చాదర్) లాగుతూ, కోపంతో కూడిన స్వరంతో ఇలా అన్నాను: 'ఓ ముహమ్మద్! నాకు చెల్లించాల్సిన బాకీని మీరు చెల్లించరా? దేవుని ప్రమాణం!, బనూ అబ్దుల్ ముత్తలిబ్ వారి అలవాట్లు నాకు బాగా తెలుసు. అప్పులు తీర్చడంలో వారు చాలా నిర్లక్ష్యంగా ఉంటారు, అలాగే చెల్లింపులో జాప్యం చేసే మీ అలవాటు గురించి కూడా నాకు తెలుసు."' వాస్తవానికి దైవ ప్రవక్త (స) విషయంలో అలాంటి నిర్లక్ష్యానికి ఆస్కారమే లేదు, కానీ అతను ఒక శత్రువు, ఆ సమయంలో అతని హృదయంలో ద్వేషం ఉంది, లేదా బహుశా అతను వారిని పరీక్షించాలనుకున్నాడు. ఏది ఏమైనప్పటికీ, అతను అలా చేశాడు మరియు వారి వ్యవహార శైలిని తాను అనుభవపూర్వకంగా తెలుసుకున్నానని చెబుతాడు. ఆయన ఇంకా ఇలా అంటున్నాడు. "ఆ సమయంలో, నేను దగ్గరలో నిలబడి ఉన్న ఉమర్ (రజి) వైపు చూశాను. కోపంతో ఆయన కళ్ళు వేగంగా తిరుగుతున్న చక్రంలా కదులుతున్నాయి. ఆయన నా వైపు తీవ్రమైన చూపుతో చూస్తూ ఇలా అన్నారు: "ఓ అల్లాహ్ శత్రువా! నేను వింటున్నట్లుగా నువ్వు అల్లాహ్ ప్రవక్త (స)తో మాట్లాడుతున్నావా? మరియు నేను చూస్తున్నట్లుగా వారి పట్ల అంతటి దురుసుగా ప్రవర్తిస్తున్నావా? వారిని సత్యంతో పంపిన ఆ దేవుని ప్రమాణంగా చెబుతున్నాను, వారి పట్ల నాకున్న గౌరవం లేకపోతే, నా కత్తితో నీ తల నరికేసేవాడిని!" జైద్ ఇలా అంటున్నాడు. "అదే సమయంలో, అల్లాహ్ ప్రవక్త (స) పూర్తి ప్రశాంతతతో ఉమర్ (రజి) వైపు చూస్తూ చిరునవ్వు చిందిస్తున్నారు. అప్పుడు ప్రవక్త (స) ఇలా అన్నారు: "'ఓ ఉమర్, ఈ కోపానికి బదులుగా, నీ హితబోధకు అతనూ, నేనూ అర్హులం. నేను నా బాధ్యతను సరిగ్గా నిర్వర్తించడానికి మరియు అతను తన డిమాండ్‌ను మర్యాదపూర్వకంగా అడగడానికి. ఓ ఉమర్, అతన్ని తీసుకువెళ్ళి అతనికి చెల్లించాల్సినది చెల్లించు. అంతేకాదు, అతనికి అదనంగా ఇరవై 'సా'ల (కొలత) ఖర్జూరాలను ఇవ్వు.'"నేను అడిగాను, 'ఓ ఉమర్, ఈ అదనపు మొత్తం ఎందుకు?' ఆయన బదులిచ్చారు, 'నేను నీతో కఠినంగా మాట్లాడినందుకు పరిహారంగా నీకు ఇది ఇవ్వమని ప్రవక్త (స) నాకు ఆదేశించారు.' అప్పుడు నేను ఉమర్ (రజి)ని అడిగాను, 'నేనెవరో మీకు తెలుసా?' ఉమర్ (రజి) బదులిచ్చారు, 'లేదు."' "నేను అడిగాను, 'మీరు ఎవరు?' ఆయన, 'నేను జైద్ బిన్ సనాహ్' అని చెప్పారు. హజ్రత్ ఉమర్ (రజి) అడిగారు, 'ఆ గొప్ప యూదు పండితుడివేనా?' నేను బదులిచ్చాను, 'అవును, యూదుల పండితుడినే."'"అప్పుడు హజ్రత్ ఉమర్ (రజి) ఇలా అన్నారు, 'అంత గొప్ప పండితులై ఉండి కూడా, అల్లాహ్ ప్రవక్త (స) పట్ల మీరు ఎందుకు అంత అగౌరవంగా ప్రవర్తించారు?' నేను ఇలా సమాధానమిచ్చాను, 'ఓ ఉమర్! నేను అల్లాహ్ ప్రవక్తను చూసినప్పుడు, ప్రవక్తకు ఉండాల్సిన లక్షణాలన్నీ నాకు స్పష్టంగా కనిపించాయి; అయితే నేను ఇంకా సరిచూసుకోని రెండు లక్షణాలు మాత్రం మిగిలి ఉన్నాయి. మొదటిది, ఆ ప్రవక్త యొక్క సహన గుణం నిజంగానే వారి కోపంపై విజయం సాధిస్తుందా లేదా అనేది. రెండవది, ప్రజలు వారితో ఎంత కఠినంగా మరియు అసభ్యంగా ప్రవర్తించినా, వారు అంతకంటే ఎక్కువ సహనంతో మరియు ఓర్పుతో స్పందిస్తారా లేదా అనేది. ఇప్పుడు నేను ఈ రెండు విషయాలను పరీక్షించి చూశాను.ఓ ఉమర్! అల్లాహ్‌ను నా ప్రభువుగా, ఇస్లాంను నా ధర్మంగా మరియు ముహమ్మద్ (స)ను నా ప్రవక్తగా అంగీకరిస్తున్నానని మీకు సాక్షిగా చెబుతున్నాను. అలాగే, నాకున్న సంపదలో సగభాగాన్ని ముహమ్మద్ (స) అనుచర వర్గం (ఉమ్మత్) కోసం దానధర్మంగా ఇస్తున్నానని కూడా మీకు సాక్షిగా తెలియజేస్తున్నాను. ఎందుకంటే నేను సంపన్నుడిని. ఉమర్ (రజి) ఇలా బదులిచ్చారు, 'అలా అనకండి, "ముహమ్మద్ (స) అనుచర వర్గంలోని కొందరి కోసం" అని అనండి. ఎందుకంటే ఆ మొత్తం అనుచర వర్గం (ఉమ్మత్) సంఖ్య అపారం. మీ సంపద వారందరికీ ఎలా సరిపోతుంది?' నేను అన్నాను, 'సరే, అయితే వారిలో కొందరి కోసం అని అంటాను. ఆ తర్వాత, జైద్ దైవ ప్రవక్త (స) సమక్షానికి వచ్చి ఇలా విన్నవించుకున్నారు: "అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హులైన వారు ఎవరూ లేరని నేను సాక్ష్యం ఇస్తున్నాను, మరియు ముహమ్మద్ (స) ఆయన దాసుడు మరియు ప్రవక్త అని సాక్ష్యం ఇస్తున్నాను. నేను వారిని విశ్వసిస్తున్నాను." ఈ విధంగా, జైద్ ఇస్లాంను స్వీకరించారు, దైవ ప్రవక్త (స) సత్యత్వాన్ని అంగీకరించారు మరియు ప్రవక్త (స) బైఅత్ చేశారు. ఆ తర్వాత ఆయన దైవ ప్రవక్త (స)తో కలిసి అనేక యుద్ధములలో పాల్గొన్నారు మరియు తబూక్ యుద్ధం నుండి తిరిగి వస్తున్నప్పుడు, ప్రవక్త (స) పరమపదించే వరకు ప్రవక్త (స) తోనే ఉన్నారు.

**(అల్-ముస్తద్రిక్ అలల్-సహీహైన్, హకీమ్, సంపుటి 4, కితాబ్ మారిఫ్ అల్-సహాబా, హదీసు 6665, దారుల్-ఫిక్ర్, బీరుట్, 2002, పేజీలు 328-329)**

అతను ఒక యూదు పండితుడు మరియు ఉన్నత స్వభావం కలవాడు. అన్ని సూచనలను చూసిన తరువాత, అతను ఇస్లాంను స్వీకరించాడు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ఉదాత్త స్వభావం అలాంటిది. వారు (స) ఒక జాతి ప్రజలందరినీ ఆకలి నుండి రక్షించడానికి రుణం సంపాదించడమే కాకుండా, తన శ్రేష్ఠమైన నైతిక గుణాల ద్వారా ఒక యూదు పండితుడిని ఇస్లాంలోకి తీసుకువచ్చారు.

اَللّٰهُمَّ صَلِّ عَلٰى مُحَمَّدٍ وَّعَلٰى اٰلِ مُحَمَّدٍ وَّبَارِكْ وَسَلِّمْ اِنَّكَ حَمِيْدٌ مَّجِيْدٌ

---

(7వ పేజీ తరువాత ) అహంకారంతో ప్రవర్తించడం లేదా ఒకరినొకరు తక్కువ చేసి చూడటం నాకు ఇష్టం లేదు. ఎవరు గొప్పవారో లేదా తక్కువవారో దేవుడికి మాత్రమే తెలుసు. ఇది అవమానభావంతో కూడిన ఒక రకమైన నిర్లక్ష్యం. ఈ అవమానభావం ఒక విత్తనంలా పెరిగి, అటువంటి వ్యక్తిని నాశనం చేస్తుందేమోనని నేను భయపడుతున్నాను. కొందరు వ్యక్తులు ఉన్నత హోదా కలిగిన వారిని ఎంతో గౌరవంతో కలుస్తారు, కానీ నిజంగా గొప్పవారు ఎవరంటే , సామాన్యుల మాటలను వినయంతో వినేవారు, వారికి ఓదార్పునిచ్చేవారు, వారి అభిప్రాయానికి విలువ నిచ్చేవారు మరియు వారికి బాధ కలిగించే విధంగా మందలించని వారు. సర్వశక్తి మంతుడైన అల్లాహ్ ఇలా అంటున్నాడు: **వలా తనాబజూ బిల్ అల్ఖాబ్ బిఇసల్ ఇస్ముల్ ఫుసూఖు బఅదల్ ఈమాని వమన్‌లమ్ యతుబ్ ఫ ఉలాయిక హుము జ్వాలిమూన్ (హుజ్‌రాత్:12) అనగా** "ఒకరినొకరు అపహాస్యం చేసే పేర్లతో పిలుచు కోవద్దు. విశ్వాసం స్వీకరించిన తర్వాత చెడు పేరును (అపఖ్యాతిని) పొందడం చాలా దుర్మార్గం; మరియు పశ్చాత్తాపపడని వారు అన్యాయం చేసేవారే.'

దీనిని మరింత వివరిస్తూ, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) ఇలా అన్నారు:

"చిరాకుతో ఒకరినొకరు బాధ కలిగించే విధంగా పిలవకండి. ఎందుకంటే ఇది పాపాత్ములు మరియు హద్దులు మీరేవారి మార్గం. ఇతరులను ఎగతాళి చేసే వ్యక్తి, స్వయంగా అటువంటి పరిస్థితిని ఎదుర్కొనే వరకు మరణించడు. మీ తోటి సోదరులను తక్కువ చేసి చూడకండి. అందరూ ఒకే ప్రవాహం నుండి నీరు త్రాగుతు న్నప్పుడు, మీలో ఎవరు ఎక్కువ నీరు త్రాగుతారో ఎవరికి తెలుసు?" లౌకిక నిర్వచనాలు ఒక వ్యక్తికి గౌరవాన్ని లేదా గొప్పతనాన్ని ప్రసాదించలేవు. సర్వశక్తి మంతుడైన అల్లాహ్ దృష్టిలో, నీతిమంతుడే గొప్పవాడు. ఇన్న అక్రమకుం ఇందల్లాహి అత్ఖాకుం ఇన్నల్లాహా అలీమున్ ఖబీర్ (హుజ్‌రాత్ :14) అనగా "'నిశ్చయంగా, అల్లాహ్ దృష్టిలో మీలో అత్యంత నీతిమంతులే (దైవభీతి గలవారే) మీలో అత్యంత గౌరవనీయులు. నిశ్చయంగా, అల్లాహ్ సర్వజ్ఞుడు మరియు సమస్త విషయాల పట్ల పూర్తి అవగాహన కలవాడు.' **(మల్ఫూజాత్, సంపుటి 1, పేజీలు 35-36)**

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనలో నిజమైన వినమ్రతను మరియు సాత్విక గుణాన్ని పెంపొందించుకునే సామర్థ్యాన్ని ప్రసాదించుగాకా!. అలాగే, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బైఅత్ చేసిన వారిగా, మనం ఇస్లాం యొక్క నిజమైన బోధనలకు అనుగుణంగా నడుచుకుంటూ, చిత్తశుద్ధి మరియు స్థిరచిత్తంతో దాని పట్ల మన బాధ్యతలను నెరవేర్చేవారిగా ఉందుము గాకా!.

J.K WOOD WORKS Mob.9393727201
Spl.Capboard & Interior 7989385296
#8-125/A, Chandanagar, Hyderabad
దువా ఆశించువారు: *SK Meera sb, Jagadth giri gutta, Hyderabad, (Telangana)*



Love for All Hatred for None
99493-56387
Prop:Muhammad Saleem
MASROOR HOTEL
TEA,TIFFIN,MEALS,CHICKEN-BIRYANI,FAST-FOOD AVAILABLE HERE
Near Naidu Petrol Pump, Khammam Rd. Warangal (Telengana)
Mohammad Saleem (Naib Ameer Zila Jamat Ahmadiyya Warangal (Telengana)

## సీరత్ ఖాతమున్నబియ్యీన్ (సల్లల్లాహు అలైహి వసల్లం):-

سیرت خاتم النبیین صلی اللہ علیہ وسلم

రచన: హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ ఎం.ఏ (రజి).

**తొలి దైవవాణి:-**

ఆ సమయానికి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం నలభై సంవత్సరాల వయస్సుకు చేరువవుతున్నారు. తూర్పు ఆకాశంలో ఉదయపు తొలి కాంతి కనిపించాల్సిన సమయం ఆసన్నమైంది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మక్కా సమాజంతో విస్తృతంగా కలిసిమెలిసి ఉండేవారు కాదు. అయితే ఆ రోజుల్లో, ముఖ్యంగా, ప్రవక్త (స) ఆధ్యాత్మిక స్థితి అలా మారడంతో పగలు రాత్రి అల్లాహ్‌ను అన్వేషించడం, ఆయనను స్మరించడంలోనే నిమగ్నమై ఉండేవారు. మక్కా నుంచి సుమారు మూడు మైళ్ల దూరంలో, మినా వైపు వెళ్లే మార్గంలో హిరా పర్వతం ఉంది. ఆ పర్వతం ఎడమవైపున హిరా గుహ అని పిలువబడే ఒక గుహ ఉంది. ఆ కాలంలో దైవ ప్రవక్త (స) అక్కడికి వెళ్లి ఏకాంతంగా ఆలోచన, ధ్యానం మరియు దేవుని స్మరణలో నిమగ్నమవడం అలవాటుగా ఉండేది. సాధారణంగా ప్రవక్త (స) కొన్ని రోజులకు సరిపడే ఆహారాన్ని వెంట తీసుకెళ్లేవారు. ఆ సమయంలో తిరిగి నగరానికి వచ్చేవారు కాదు. కొన్ని సందర్భాల్లో హజ్రత్ ఖదీజా (రజియల్లాహ్ అనుహా) కూడా ప్రవక్త (స)తో పాటు వెళ్లేవారు. ఈ కాలాన్నే పవిత్ర ఖుర్‌ఆన్‌లో సత్యాన్వేషణకు సంబంధించిన కాలంగా పేర్కొనడం జరిగింది. అల్లాహ్ తాలా ఇలా పేర్కొన్నాడు: **వవజదక జ్వాల్లన్ ఫహదా** అనగా "ఆయనను అన్వేషిస్తూ నీవు సంచరిస్తూ ఉండగా ఆయన నిన్ను కనుగొని, తనవైపు మార్గనిర్దేశం చేశాడు."

ఈ కాలంలో సత్యము మరియు సత్ప్రవర్తనకు సంబంధించిన కలలు కనిపించడం ప్రారంభమయ్యాయి. ఈ దశ ఆరు నెలల పాటు కొనసాగిందని వర్ణించబడింది. ఈ విధంగా, ఇది ప్రవక్తత్వానికి దారితీసిన తొలి అడుగువంటిది. హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హా) ఇలా వర్ణించారు...

اَوَّلَ مَا بُدِیَٔ بِہٖ رَسُوْلُ اللّٰہِ صَلَّی اللّٰہُ عَلَیْہِ وَاٰلِہٖ وَسَلَّمَ مِنَ الْوَحْیِ الرُّؤْیَا الصَّا
لِحَۃُ فِی النَّوْمِ۔ وَکَانَ لَا یَرٰی رُؤْیَا اِلَّا جَاءَتْ مِثْلَ فَلَقِ الصُّبْحِ وَحُبِّبَ اِلَیْہِ الْخَلَاءُ
فَکَانَ یَخْلُو بِغَارِ حِرَاءَ فَیَتَحَنَّثُ فِیْہِ وَھُوَ التَّعَبُّدُ اللَّیَالِیَ ذَوَاتِ الْعَدَدِ قَبْلَ اَنْ یَنْزِعَ
اِلٰی اَھْلِہٖ وَیَتَزَوَّدُ لِذَالِکَ ثُمَّ یَرْجِعُ اِلٰی خَدِیْجَۃَ فَیَتَزَوَّدُ لِمِثْلِھَا حَتّٰی جَا
ءَہُ الْحَقُّ وَھُوَ فِی غَارِ حِرَاءَ۔[1]

అనగా: ఆరంభం నుండే హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారికి వహీ (దైవసందేశం) సత్ప్రవచనాలైన స్వప్నాల రూపంలో అవతరిస్తూ ఉండేది. వారు (స) నిద్రలో చూసే ప్రతి స్వప్నం ఉదయపు తెల్లవారుజామున వెలుగు ప్రసరించినట్లుగా సత్యంగా నెరవేరేది. ఆ కాలంలో ఏకాంతంగా, ఒంటరిగా ఉండటం వారికి ఎంతో ఇష్టంగా ఉండేది. వారు (స) హిరా గుహకు వెళ్లి, అక్కడ అనేక రాత్రులు ఆరాధనలో గడిపేవారు. తరువాత ఇంటికి తిరిగి వచ్చి, మరికొంత ఆహార సామగ్రిని వెంట తీసుకెళ్లేవారు. అది అయిపోయినప్పుడు మళ్లీ హజ్రత్ ఖదీజా రజియల్లాహు అన్హా గారి వద్దకు వెళ్లి తీసుకువచ్చేవారు. వారు ఈ స్థితిలో ఉన్నప్పుడు, అల్లాహ్ తరఫునుండి సత్యసందేశం వారి (స) వద్దకు వచ్చింది. ఆ సమయంలో వారు హిరా గుహలోనే ఉన్నారు.

**ప్రారంభ జీవితంపై ఒక సారాంశ దృష్టి:-**

**సంఘటనల కొరత :** ఇప్పుడు ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి జీవితంలోని మొదటి దశ ముగిసింది. అయితే నా మనసుకు ఇంకా తృప్తి కలగలేదు. కలం పక్కన పెట్టాలని కూడా అనిపించడం లేదు. ఎందుకంటే ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారి తొలి నలభై సంవత్సరాల జీవితానికి సంబంధించిన సంఘటనలు, తదుపరి కాలానికి సంబంధించినట్లుగా వివరంగా, విస్తృతంగా భద్రపరచబడలేదనే భావన కలుగుతోంది. ఒక స్థాయివరకు ఇది సహజమైన విషయమే. ఎందుకంటే ప్రవక్తత్వ కాలంలో ప్రవక్త (స)ను ఏ దృష్టితో పరిశీలించేవారో, ఆ దృష్టి వారి ప్రవక్తుత్వానికి ముందు కాలంలో లేదు. కావున ఒకవేళ తొలి చరిత్రకారులు వారి ప్రవక్తుత్వానికి పూర్వం గడిపిన జీవిత పరిస్థితులను మరింత శ్రద్ధగా పరిశీలించి, సంఘటనలను తెలుసుకోవడానికి ఎక్కువ కృషి చేసి ఉంటే, మరికొన్ని వివరాలు వెలుగులోకి వచ్చి ఉండేవి. అయినప్పటికీ, ప్రస్తుతం మనకు అందుబాటులో ఉన్న వివరాలన్నింటిని, గత ఇతర ప్రవక్తల జీవితాలతో పోలిస్తే అవి ఎంతో ఎక్కువ. అంతేకాక, ప్రవక్తుత్వానికి ముందు వారు (స) గడిపిన ఆ మహత్తరమైన, పవిత్రమైన, నిస్వార్థ జీవితానికి అవి తగినంత బలమైన సాక్ష్యాన్ని అందిస్తున్నాయి.

**ప్రవక్త (స) వారి నిరక్షరాస్యత:-**

ఈ నలభై సంవత్సరాల జీవితాన్ని గురించి ఇంతవరకు చదివిన పాఠకులు ఒక విషయాన్ని గమనించి ఉండవచ్చు. అదేమనగా, ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వారి విద్యాభ్యాసం గురించి ఎక్కడా ప్రస్తావన రాలేదు. వాస్తవానికి అరేబియా దేశంలో విద్య చాలా తక్కువగా ఉండేది. ఈ విషయంలో ఉన్నత వర్గాలవారికి, సామాన్య ప్రజలకు మధ్య కూడా పెద్దగా తేడా ఉండేది కాదు. పెద్ద పెద్ద నాయకులు, ప్రముఖులు కూడా సాధారణ ప్రజల మాదిరిగానే ఎక్కువగా చదువులేని వారై, నిరక్షరాస్యులై ఉండేవారు. అయితే దేశంలో అక్కడక్కడ చదువుకున్నవారు కూడ ఉండే వారనే విషయంలో కూడ ఎలాంటి సందేహం లేదు. ఇతర ప్రాంతాలతో పోలిస్తే మక్కాలో అలాంటి విద్యావంతులు కొంత ఎక్కువగానే ఉండేవారు. కానీ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం పూర్తిగా చదువు రాని, నిరక్షరాస్యుడైన 'ఉమ్మీ' అని నిర్ధారించబడింది. వారి (స) నిరక్షరాస్యతలో కూడా దైవిక సంకల్పం ఒక పాత్ర పోషించినట్లు కనిపిస్తుంది. తద్వారా అల్లాహ్ వారి (స)కి ప్రసాదించిన జ్ఞాన సంబంధిత అద్భుతపు మహిమ మరింత ప్రకాశవంతంగా ప్రపంచపు వెలుగులోకి రావడానికి ఇది కారణమై ఉండవచ్చు. అయితే అదే సమయంలో, ప్రవక్తుత్వ కాలంలో ఎక్కువగా ఉత్తరాలు, ఒప్పందాలు మొదలైనవి ప్రవక్త (స) సమక్షంలో సిద్ధం చేయబడుతూ, వారి దృష్టికి తీసుకవస్తూ ఉండేవారు. అందువల్ల వారి (స) జీవితపు చివరి దశలో కొంత మేరకు అక్షర పరిజ్ఞానం ఏర్పడి ఉండవచ్చని తెలుస్తోంది. ఉదాహరణకు, హుదైబియా సంధి సమయంలో ఒప్పందం వ్రాయబడుతున్నప్పుడు, అవిశ్వాసుల తరఫున అభ్యంతరం వ్యక్తమైన కారణంగా, తన పేరుతో పాటు ఉన్న "రసూలుల్లాహ్" (అల్లాహ్ ప్రవక్త) అనే పదాలను తన చేతితో తొలగించి, వాటి స్థానంలో "ఇబ్నే అబ్దుల్లాహ్" (అబ్దుల్లాహ్ కుమారుడు) అనే పదాలను వ్రాసినట్లు ఒక హదీసు ద్వారా తెలుస్తోంది.

ఈ సందర్భంలో హదీసులో వ్రాయడం కోసం ఉపయోగించబడిన "కతబ" అనే పదం, "వ్రాయించడం" అనే అర్థాన్ని కల్గి ఉండటం కూడ పూర్తిగా సాధ్యమే. ఎందుకంటే సాధారణ వ్యవహారిక భాషలో కొన్ని సందర్భాల్లో "వ్రాయడం" మరియు "వ్రాయించడం" రెండింటికీ ఒకే పదాన్ని ఉపయోగిస్తారు. ఈ అర్థాన్ని తీసుకుంటే, భావం ఇలా ఉంటుంది: ప్రవక్త ముహమ్మద్ (స)వారు ఒప్పందంలోని ఒక భాగాన్ని స్వయంగా తన చేతితో చెరిపివేశారు. అయితే దాన్ని తొలగించిన తర్వాత వ్రాయబడిన విషయాన్ని మాత్రం తన లేఖకునితో వ్రాయించారు. ఏ అర్థాన్ని స్వీకరించినప్పటికీ, దాని వల్ల ప్రవక్త (స)వారి "ఉమ్మీయత్" (నిరక్షరాస్యత స్థితి) విషయంలో ఎలాంటి ప్రభావమూ పడదు.

**స్నేహితుల పరిధి:-**

ప్రవక్తగా ప్రకటించబడుటకు ముందు, హజ్రత్ మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి స్నేహపూర్వక సంబంధాల పరిధి చాలా పరిమితంగా కనిపిస్తుంది. నిజానికి మొదటి నుంచే వారి స్వభావం ఏకాంతాన్ని ఇష్టపడేదిగా ఉండేది. తన జీవితంలోని ఏ దశలోనూ మక్కాలోని సాధారణ సమాజంతో వారు(స) ఎక్కువగా కలిసిమెలిసి ఉండలేదు. అయినప్పటికీ, కొందరు వ్యక్తులతో వారికి స్నేహపూర్వక సంబంధాలు ఉండేవి. వారిలో అందరికంటే ప్రముఖుడు హజ్రత్ అబూబకర్ రజియల్లాహు అన్హు, అంటే అబ్దుల్లాహ్ బిన్ అబూ ఖహాఫా. ఆయన ఖురైష్‌లోని ఒక ఉన్నత కుటుంబానికి చెందినవారు. తన సౌశీల్యం, గుణగణాలు మరియు సామర్థ్యం కారణంగా సమాజంలో ఎంతో గౌరవంగా చూడబడేవారు. తదుపరి స్థానంలో హకీమ్ బిన్ హిజామ్ ఉన్నారు. ఆయన హజ్రత్ ఖదీజా రజియల్లాహు అన్హా గారి మేనల్లుడు. ఆయన చాలా సద్గుణాలు కలిగిన, మంచి స్వభావం గల వ్యక్తి. ప్రారంభంలో ఆయన ఇస్లాం స్వీకరించలేదు. అయినప్పటికీ ఆ సమయంలో కూడా హజ్రత్ మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారి పట్ల ఎంతో ప్రేమ, నిజాయితీ మరియు ఆప్యాయతను కలిగి ఉండేవారు. చివరకు ఆయన సహజమైన సద్గుణ స్వభావం ఆయనను ఇస్లాం వైపు ఆకర్షించింది. అలాగే జైద్ బిన్ అమర్ తో కూడా హజ్రత్ మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వారికి స్నేహ పూర్వక సంబంధాలు ఉండేవి. ఆయన హజ్రత్ ఉమర్ రజియల్లాహు అన్హు గారి సన్నిహిత బంధువు. మూర్ఖత్వపు కాలంలోనే విగ్రహారాధనను విడిచిపెట్టిన వారిలో ఆయన ఒకరు. తనను తాను ఇబ్రాహీం అలైహిస్సలాం వారి ధర్మానికి చెందినవాడిగా భావించేవారు. అయితే ఇస్లాం ఆవిర్భవించడానికి ముందే ఆయన మరణించారు. **(పేజి: 127-129)**

---

**(1వ పేజి తరువాత తఫ్సీర్)** కావున బటాలా లేదా అమృత్‌సర్ నుంచే తిరిగి వెళ్లిపోయారు. వారు ఆ సమయంలో ఖాదియాన్‌కు చేరుకుని ఉండి ఉంటే, సహాబాలలో చేరిపోయేవారు. అయినప్పటికి అల్లాహ్ తఆలా వారి నిజాయితీ మరియు చిత్తశుద్ధిని చూసి వారిని అహ్మదియ్యంలో చేర్చాడు. అయితే సహాబీయత్ అనే గొప్ప స్థానంను వారు కోల్పోయారు. .......

ఎవరు ఎన్నడు ఊహించని స్థాయిలో ప్రజలు ఇక్కడ సమావేశమయ్యే దృశ్యాలు ఈ జల్సా రోజులలో కనివిందు చేయడం కూడ ఒక సంకేతమే. ఇతర జాతులలోని దాహంతో ఉన్నవారు కూడా త్రాగనంతగా ఎంతో ఆసక్తి మరియు ఉత్సాహంతో ఈ సెలయేరు నుండి అజ్ఞానులుగా భావించబడే వారెందరో దాహం తీర్చుకోవడం కూడ మరొక సంకేతమే.

ఖాదియాన్‌లో నివసించే ప్రజలను అల్లాహ్ తఆలా ఈ 'ద్వార్' (నిలయం) సంరక్షణకు ఒక సాధనంగా చేశాడు. దీని శుభముల కోసం ఆయన ప్రజలను సమీకరించి ఇక్కడికి తీసుకువస్తాడు.కాబట్టి, ఇక్కడి జమాఅత్‌కు చెందిన సోదరులకు నేను ఉపదేశించేది ఏమిటంటే, రాబోయే ఆ రోజు కోసం సిద్ధపడండి. ఇళ్లను కలిగి ఉన్నవారు అతిథుల కోసం తమ ఇళ్లను అందుబాటులో ఉంచాలి. అంతేకాకుండా, తమ శరీరాలను మరియు తమ సమయాన్ని కూడా సేవ కోసం అర్పించాలి. ఇక నిర్వాహకులకు నేను ఇచ్చే ఉపదేశం ఏమిటంటే, నేను పదేపదే చెప్పినట్లుగా సేవకులతో సేవ తీసుకోవడానికి ముందు వారితో అభ్యాసం చేయించాలి."

**(ఖుత్బాతే మహ్మూద్, సంపుటి 12, పేజి 509-513)**

## సీరతుల్ మహ్దీ
## ( అలైహిస్సలాతు వస్సలాం):-

రచన: హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ ఎం.ఏ (రజి).

**(37)బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం:** మా తల్లి గారు నాకు ఇలా తెలిపారు: ముహమ్మదీ బేగం వివాహం వేరే చోట జరిగినప్పుడు, ఖాదియాన్‌లోని బంధువు లందరూ హజ్రత్ సాహిబ్‌కు తీవ్రంగా వ్యతిరేకంగా నిలబడి, వారికి వ్యతిరేకంగా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. వారందరూ ముహమ్మదీ బేగం తండ్రి అయిన అహ్మద్ బేగ్‌కు మద్దతు ఇచ్చారు. అంతేకాకుండా, స్వయంగా ప్రయత్నించి ఆ అమ్మాయికి వేరే చోట వివాహం జరిపించారు. అప్పుడు హజ్రత్ సాహిబ్ గారు, మిర్జా సుల్తాన్ అహ్మద్ మరియు మిర్జా ఫజల్ అహ్మద్ ఇద్దరికీ విడివిడిగా ఉత్తరాలు రాసి ఇలా అన్నారు: “ఈ ప్రజలందరూ నన్ను తీవ్రంగా వ్యతిరేకించారు. ఇకపై వారితో మనకు ఎలాంటి సంబంధమూ లేదు. ఇప్పుడు మన సమాధులు కూడా వారి సమాధులతో కలిసి ఉండలేవు. కాబట్టి మీరు మీ తుది నిర్ణయం తీసుకోండి. మీరు నాతో సంబంధం కొనసాగించాలనుకుంటే, వారితో సంబంధాలను పూర్తిగా తెంచుకోవాలి. ఒకవేళ మీరు వారితో సంబంధం కొనసాగించాలనుకుంటే, నాతో మీకు ఎలాంటి సంబంధమూ ఉండదు. అటువంటి పరిస్థితిలో నేను మిమ్మల్ని వారసత్వ హక్కుల నుండి తొలగిస్తున్నాను (అంటే మిమ్మల్ని అఖ్/ అవిధేయునిగా ప్రకటిస్తున్నాను).” నా తల్లి గారు మరల ఇలా తెలిపారు: మిర్జా సుల్తాన్ అహ్మద్ ఇలా సమాధానమిచ్చారు: “ పెద్దమ్మ (తాయి సాహిబా)గారు నాకు ఎంతో ఉపకారం చేశారు. కాబట్టి నేను ఆమెతో సంబంధాలు తెంచుకోలేను.” అయితే, మిర్జా ఫజల్ అహ్మద్ ఇలా రాశారు: “నాకు మీతోనే సంబంధం ఉంది. వారితో నాకు ఎలాంటి సంబంధమూ లేదు.” దానికి హజ్రత్ సాహిబ్ ఇలా సమాధానమిచ్చారు: “ఇది నిజమైతే, నీ భార్య అయిన మిర్జా అలీ షేర్ కుమార్తెకు విడాకులు ఇవ్వు.” ఆమె తీవ్రంగా వ్యతిరేకించే వ్యక్తి, అలాగే మిర్జా అహ్మద్ బేగ్‌కు మేనకోడలు. మిర్జా ఫజల్ అహ్మద్ వెంటనే విడాకుల పత్రాన్ని రాసి హజ్రత్ సాహిబ్ వద్దకు పంపించారు. నా తల్లి గారు మరల ఇలా తెలిపారు: ఆ తర్వాత ఫజల్ అహ్మద్ బయట నుండి వచ్చినప్పుడు మా వద్దే ఉండేవారు. అయితే ఆయన రెండవ భార్య కలహాలు రేపడం మరియు ఆమె ప్రభావం కారణంగా, చివరకు ఆయన మళ్లీ క్రమంగా వారి వైపుకు వెళ్లిపోయారు. నా తల్లి గారు మరల ఇలా తెలిపారు: ఫజల్ అహ్మద్ చాలా సిగ్గుపడే స్వభావం కలవారు. హజ్రత్ సాహిబ్ ఎదుట ఆయన కళ్లెత్తి కూడా చూసేవారు కాదు. హజ్రత్ సాహిబ్ ఆయన గురించి ఇలా చెప్పేవారు: “ఫజల్ అహ్మద్ సూటి స్వభావం కలవాడు. అతనిలో ప్రేమాభావం ఉంది. అయితే ఇతరుల ప్రేరేపణకు లోనై వారి వైపుకు వెళ్లిపోయాడు.” నా తల్లి గారు మరల ఇలా తెలిపారు: ఫజల్ అహ్మద్ మరణించిన వార్త వచ్చినప్పుడు, ఆ రాత్రి హజ్రత్ సాహిబ్ దాదాపు రాత్రంతా నిద్రపోలేదు. రెండు మూడు రోజుల పాటు విచారంగా ఉన్నారు. నేను అడిగాను: “హజ్రత్ సాహిబ్ దాని గురించి ఏమైనా చెప్పారా?” నా తల్లి గారు ఇలా సమాధానమిచ్చారు: హజ్రత్ సాహిబ్ గారు కేవలం ఇలా అన్నారు: “మనకు అతనితో ఎలాంటి సంబంధం లేకపోయినప్పటికీ, మన వ్యతిరేకులు అతని మరణాన్ని కూడా మనపై అభ్యంతరం వ్యక్తం చేయడానికి ఒక కారణంగా చేసుకుంటారు.” ఈ భవదీయుడు తెల్పునది ఏమనగా, ముహమ్మదీ బేగం ఉమరున్నిసా గారి కుమార్తె. ఆమె హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) గారి తండ్రి వైపు బంధువైన కజిన్. మరో మాటలో చెప్పాలంటే, ఆమె మిర్జా నిజామ్-ఉద్-దీన్, మిర్జా ఇమామ్-ఉద్-దీన్ తదితరులకు స్వంత మేనకోడలు. మా తండ్రి పెద్దమ్మ, అంటే మిర్జా గులామ్ ఖాదిర్ సాహిబ్ గారి వితంతుభార్య, ముహమ్మదీ బేగం గారికి పిన్నమ్మ అవుతుంది. అందువల్ల, హోషియార్‌పూర్‌కు చెందిన మిర్జా అహ్మద్ బేగ్ సాహిబ్, ముహమ్మదీ బేగం గారి తండ్రి మిర్జా ఇమామ్-ఉద్-దీన్ తదితరులకు బావగారు అవుతారు. ఇవిగాక, మరికొన్ని కుటుంబ సంబంధాలు కూడా ఉన్నాయి. ఉదాహరణకు, హజ్రత్ మసీహ్ గారి స్వంత సోదరి మిర్జా గులామ్ గౌస్ సాహిబ్‌ను వివాహం చేసుకున్నారు. ఆయన మిర్జా అహ్మద్ బేగ్ గారి అన్నయ్య. ఇది చాలా పాత విషయం. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) వారి ఈ బంధువులందరూ అత్యంత మతవిరుద్ధ భావాలు కలవారై, ఇస్లాంతో ఎటువంటి సంబంధమూ లేకుండా ఉండేవారు; అంతేకాక, వారు మత ధర్మశాస్త్రాన్ని అవమానించేవారు. వారి పరిస్థితిని చూసి, వాగ్దానిత మసీహ్ గారు అల్లాహ్ వైపు దృష్టి మళ్లించి, వారి విషయంలో ఏదైనా సంకేతం ప్రత్యక్షమై, వారు సంస్కరించ బడటానికైనా లేదా వారి విషయంలో ఏదైనా నిర్ణయం వెలువడటానికైనా ప్రార్థించారు. దానికి ప్రతిస్పందనగా, అహ్మద్ బేగ్ కుమార్తె ముహమ్మదీ బేగంతో వివాహ సంబంధం ఏర్పరచడానికి ప్రయత్నించమని అల్లాహ్ వెల్లడించాడు. వారు ఈ ప్రతిపాదనను అంగీకరించి, ఆ బాలికను హుజూర్ (అ)గారితో వివాహం చేస్తే, వారికి అనుగ్రహాలలో ఒక భాగం లభిస్తుంది. అయితే వారు నిరాకరిస్తే, అల్లాహ్ శిక్ష వారిపై అవతరిస్తుంది, వారి ఇళ్లు వితంతు స్త్రీలతో నిండిపోతాయి. ముఖ్యంగా ఆ బాలిక తండ్రి విషయంలో, అతను మూడు సంవత్సరాలలో నిజానికి అతి త్వరలోనే మరణిస్తాడని ముందుగానే తెలియజేయబడింది. అలాగే, ఆ బాలిక ఎవరిని వివాహం చేసుకుంటుందో ఆ వ్యక్తి కూడా రెండున్నర సంవత్సరాలలో మరణిస్తాడని ప్రవచించబడింది. ఆ తరువాతి ఇద్దరు వ్యక్తులకు సంబంధించిన ఈ సంకేతం ఎలా నెరవేరిందో హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) తమ గ్రంథాలలో అనేక చోట్ల పొందుపర్చారు. భవిష్యవాణి ప్రకారం, తన కుమార్తె వివాహమైన కొద్ది నెలలకే అహ్మద్ బేగ్ మరణించాడు. ఈ ప్రజలు ముహమ్మదీ బేగంను వివాహం చేసిన మిర్జా సుల్తాన్ ముహమ్మద్, దైవిక శిక్షకు భయపడ్డాడు. ఆయన బంధువులలో కొందరు వినయపూర్వకంగా, ప్రార్థనతో కూడిన అనేక ఉత్తరాలను హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)గారికి పంపారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)వారి పట్ల తన గౌరవాన్ని వ్యక్తం చేసిన వారి స్వంత ఉత్తరం కూడా తషీహిజుల్ అజ్‌హాన్ పత్రికలో ప్రచురించబడింది. ఫలితంగా, అల్లాహ్ విధానం (సున్నతుల్లాహ్) ప్రకారం, ఆ శిక్ష అతని నుండి తొలగించబడింది. ఇతర బంధువుల విషయానికి వస్తే, వారిని గురించి వచ్చిన భవిష్యవాణి సాధారణమైనది. దాని ప్రభావంగా, భవిష్యవాణి వెలువడిన సమయంలో జనాలతో నిండిపోయి ఉన్న వారి ఇళ్లు పూర్తిగా ఖాళీ అయ్యాయి. ఇప్పుడు ఆ మొత్తం కుటుంబంలో ఒక బాలుడు తప్ప మరే పురుషుడు మిగలలేదు. ఆ బాలుడు కూడా అహ్మదీగా మారాడు. అంతేకాక, మిర్జా ఇమామ్-ఉద్-దీన్ గారి కుమార్తె కూడా చాలా కాలం క్రితమే అహ్మదీగా మారింది. ఆ తరువాత, ముహమ్మదీ బేగం గారి తల్లి, మిర్జా అహ్మద్ బేగ్ గారి విధవరాలుమిర్జా అహ్మద్ బేగ్ గారి మనుమడు, అలాగే మా తండ్రి వైపు పిన్ని, అంటే ముహమ్మదీ బేగం గారి తల్లి వైపు పిన్ని. అందరూ అహ్మదీయా జమాఅత్‌లో ప్రవేశించారు. ముహమ్మదీ బేగం గారి స్వంత సోదరి కూడా అహ్మదీగా మారారు, అయితే ఆమె తరువాత మరణించారు. అదనంగా, మరికొందరు బంధువులు కూడా అహ్మదీలుగా మారారు. ఇంకా సంఘంలో ప్రవేశించని వారు కూడ తమ వ్యతిరేకతను విడిచిపెట్టారు. ఈ విధంగా, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారికి వచ్చిన ఈ దివ్యవాణి “మేము ఈ ఇంటిలో ప్రవేశిస్తాము. కొందరు హసన్ విధానంలో, మరికొందరు హుసైన్ విధానంలో” దాని సంపూర్ణ మహిమతో నెరవేరింది.

---

**(2వ పేజి తరువాత)** అక్కడ వేలాది మంది అతిథుల సమక్షంలో జల్సా-ఎ-సాలానా ఎంతో ఘనంగా నిర్వహించబడుతున్నాయి. నిశ్చయంగా, జల్సా-ఎ-సాలానా హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం వారి సత్యతకు మరియు నిజాయితీకి ఒక గొప్ప నిదర్శనం. అల్హమ్దులిల్లాహ్! భారతదేశంలోని అహ్మదీలు ఎంతో అదృష్టవంతులు. ఈ పవిత్రమైన దారుల్-అమాన్‌లో జరిగే జల్సాలో ప్రతి సంవత్సరం పాల్గొనే అవకాశం మనకు లభిస్తోంది. హజ్రత్ మసీహ్ పాక్ అలైహిస్సలాం మరియు వారి సహాబాలు పాల్గొన్న ఈ పవిత్ర స్థలంలో, అహ్మదీయత్ యొక్క పవిత్ర ఖలీఫాలు జల్సా సాలానాలలో పాల్గొంటూ వచ్చారు. ఇక్కడే అల్లాహ్ యొక్క మసీహ్ రాత్రింపగలు ప్రార్థనలు చేసిన పవిత్ర స్థలాలు కూడా ఉన్నాయి. కాబట్టి, మనం ఈ అదృష్టాన్ని గర్వంగా భావించడంతో పాటు, మన బాధ్యతలను కూడా అర్థం చేసుకోవాలి. నేటి నుండే మనం స్వయంగా, అలాగే మన పర్యవేక్షణలో ఉన్న స్నేహితులను కూడా జల్సా సాలానా 2026లో పాల్గొనేందుకు ఉత్సాహపరచడానికి మరియు ప్రోత్సహించడానికి పూర్తిగా కృషి చేయాలి.

ఇది అందరికీ తెలిసిన విషయమే, ఖాదియాన్‌లో ఆయా రోజుల్లో తీవ్రమైన చలికాలం ఉంటుంది. కాబట్టి ఆ దృష్ట్యా కూడా తగిన విధంగా ముందస్తు ఏర్పాట్లు చేసుకుని రావాలి. అలాగే హుజూర్ అలైహిస్సలాం గారి ఉపదేశం ఏమిటంటే, ఈ ప్రయోజనం కోసం కొద్దికొద్దిగా డబ్బును పొదుపు చేస్తూ ఉంటే, ప్రయాణ ఖర్చులు మరియు ప్రయాణానికి అవసరమైన సామగ్రిని సులభంగా సమకూర్చుకోవచ్చు.

అందువల్ల దైవిక విషయాలను వినడానికి, దుఆలలో పాల్గొనడానికి, ముఖ్యంగా హజ్రత్ అమీరుల్ మోమినీన్ (అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్) చేయునట్టి ప్రసంగం మరియు దుఆలో పాల్గొనడానికి, దీనిని ఒక అమూల్యమైన నిధిగా భావించి, నేటి నుండే అందులో పాల్గొనేందుకు సన్నాహాలు ప్రారంభించాలి. అల్లాహ్ తాలా ఇట్టి భాగ్యాన్ని కల్పించుగాకా!.

### ఉపశాఖల వార్షిక సమావేశాలు ఖాదియాన్

సయ్యద్నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ గారు మజ్లిస్ అన్సారుల్లాహ్, ఖుద్దాముల్ అహ్మదియ్య, అత్ఫాలుల్ అహ్మదియ్యకు చెందిన వార్షిక సమావేశాలు ఖాదియాన్ కొరకు 23, 24, 25 అక్టోబర్ 2026 (శుక్రవారం, శనివారము, ఆదివారము) తేదీలను ఆమోదించినారు. కావున నేటి నుండే ఈ పవిత్ర సమావేశాలలో పాల్గొనుటకు సంకల్పించి సన్నాహాలు ప్రారంభించగలరు. ఈ ఆధ్యాత్మిక సమావేశాలతో ప్రయోజనము పొందే అనుగ్రహము అల్లాహ్ మనందరికి కలిగించుగాక! ఈ వార్షిక సమావేశాలు అన్ని విధాలా విజయవంతమగుటకు, దీని ద్వారా సత్యవంతులు మార్గదర్శనము పొందాలని ప్రార్థనలు చేయగలరు. అల్లాహ్ అందరికి ఉత్తమ ప్రతి ఫలములు అందించు గాకా! (ఆమీన్)

EDITOR : SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
e-mail:
akhbaarbadarteluguqdn@gmail.com
www.akhbarbadr.in

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817

Weekly BADAR Qadian బదర్

Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA తెలుగు వార పత్రిక

POSTAL REG NO GDP-38/2026-2028. Vol. 11. Thursday, 10-17 SEP 2026, Issue No : 37- 38

ACT.MANAGER
ATHAR AHMAD SHAMIM
Mobile. : +91 98156 39670
e-mail
managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.600/- (Per Issue: 12/- ) (WEIGHT: 20-50, grms / issue)

**సయ్యదినా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా గారి ఆస్ట్రేలియా పర్యటన 2013.**

# బక్రీద్ పండుగ నమాజ్ మరియు ప్రసంగం:

**(గత సంచిక తరువాత భాగం) –**

ప్రతి పనిని 'ఇది అల్లాహ్ కోసం' అనే భావనతో, అలాగే మనం చేసే ప్రతి పనిని అల్లాహ్ గమనిస్తున్నాడనే స్పృహతో మరియు భయంతో నిర్వహించినట్లయితే, ప్రతి రోజును మనం బలి యొక్క ప్రతిఫలాన్ని పొందే రోజుగా మారవచ్చు."

హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ వారు మరల ఇలా పేర్కొన్నారు: "కావున, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రసన్నతను పొందేందుకు కృషి చేయడం మనలో ప్రతి ఒక్కరి కర్తవ్యం.

అల్లాహ్ పట్ల భయభక్తులు మరియు ప్రేమ యొక్క నిజమైన అవగాహనను పెంపొందించుకోవడానికి మనం ప్రయత్నించాలి. అల్లాహ్ కోసం మన ప్రాణాన్ని, సంపదను, సమయాన్ని మరియు గౌరవాన్ని త్యాగం చేస్తామనే మన ప్రతిజ్ఞ యొక్క వాస్తవికతను మనకు స్పష్టంగా తెలియజేసే నిజమైన పండుగను జరుపుకోవడానికి మనం కృషి చేయాలి. మన ప్రతి పండుగ సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రసన్నతను పొందడానికే ఉద్దేశించబడాలి. "మనలో ఈ విధమైన ఆలోచనా విధానం అభివృద్ధి చెందినప్పుడు, ఈ పండుగ సంవత్సరానికి ఒకసారి మాత్రమే రాదని, ఇది కేవలం జంతువులను వధించడం ద్వారా సంతోషాన్ని వ్యక్తం చేసే సందర్భం కాదని లేదా తమ జంతువు నుండి ఎన్ని కిలోల మాంసం లభించిందో చెప్పుకునే సందర్భం కూడా కాదని తెలుస్తుంది. నిజానికి ఇలాంటి బాహ్య ప్రదర్శనలను అధిగమించే నిజమైన పండుగ అవుతుంది. అది ప్రతిరోజూ వచ్చే పండుగ అవుతుంది. ఇన్షా అల్లాహ్, మనపై ఉదయించే ప్రతి రోజు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రసన్నతను తనతో తీసుకుని ఉదయిస్తుంది.

"అల్లాహ్ మనకు ఈ నిజమైన ఈద్‌ను జరుపుకునే సామర్థ్యాన్ని ప్రసాదించుగాకా!. ఆయన అనుగ్రహాలకు మనం మళ్లీ మళ్లీ పాత్రులమవుతూ ఉండేలా చేయుగాకా!. ఈ అనుగ్రహాలు మనతోనే ముగియకుండా, అంతిమ కాలం వరకు మన సంతతి సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రసన్నతను పొందేందుకు నిరంతరం కృషి చేస్తూ ఉండు గాకా!. వారు ఆయన కృపను, దయను, ఆశీర్వాదాలను పొందుతూ, ఆయన అనుగ్రహాలను ఆస్వాదిస్తూ ఉండుగాకా!. అలాగే జరుగుగాకా!."

ఆ తరువాత, హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు ఇలా అన్నారు: "రెండవ ఖుత్బా అనంతరం దుఆ చేయబడుతుంది. దుఆలలో అమరవీరులందరి స్థాయిలు మరింత ఉన్నతం కావాలని ప్రార్థించండి. వారి కుటుంబ సభ్యుల కోసం కూడా ప్రార్థించండి. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వారికి సహనం మరియు స్థైర్యాన్ని ప్రసాదించుగాకా!. ప్రస్తుతం పాకిస్తాన్ మినహా ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో నిర్బంధించబడి ఉన్న మన ఖైదీలందరి కోసం ప్రార్థించండి; సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వారి త్వరితగతిన విడుదలకు మార్గాలను ఏర్పరచుగాకా!. మనం అహ్మదీలమైనందున మనపై మోపబడిన తప్పుడు కేసుల నుండి నిర్దోషులుగా విముక్తి పొందేందుకు అల్లాహ్ మార్గాలను సృష్టించుగాకా! అని ప్రార్థించండి.

హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా ఇలా తెలిపారు: "ఆర్థిక త్యాగాలు చేసేవారి కోసం ప్రార్థించండి. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వారికి ఉత్తమ ప్రతిఫలాన్ని ప్రసాదించి, వారి సంపదలోను, జీవితాల్లోను శుభములను ప్రసాదించుగాకా!. ఏ రూపంలోనైనా త్యాగాలు చేస్తున్న వారందరి త్యాగాలను సర్వశక్తిమంతుడైన అల్లాహ్ అంగీకరించుగాకా!. వక్ఫ్-ఎ-నౌ విశ్వాస సేవకు తమ జీవితాలను అంకితం చేసిన వారు మరియు ప్రపంచవ్యాప్తంగా విశ్వాస సేవలో నిమగ్నమైన వారందరి కోసం ప్రార్థించండి. ముఖ్యంగా తీవ్రమైన వ్యతిరేకత ఉన్న ప్రాంతాల్లో ధైర్యంగా నిలిచి తమ బాధ్యతలను నిర్వర్తిస్తున్న వారి కోసం ప్రార్థించండి. "పాకిస్తాన్‌లోని జమాఅత్ కోసం ఎంతో బాగా దుఆలు చేయండి. నేను ఇంతకుముందు అనేకసార్లు చెప్పినట్లుగా, అక్కడి పరిస్థితులు మరింతగా దిగజారుతున్నాయి. అయితే, ఒక పరిస్థితి తన తీవ్రతకు చేరుకున్న తరువాత, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రతీకారానికి సంబంధించిన మార్గాలు కూడా ఏర్పడతాయి. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ త్వరలోనే అలాంటి మార్గాలను సృష్టించుగాకా!. ఇది కేవలం పాకిస్తాన్‌కు మాత్రమే పరిమితం కాదు; ఇతర దేశాల్లో కూడా వ్యతిరేకత ఉంది. ఇండోనేషియా కూడా ఇలాంటి దేశాల్లో ఒకటి. అక్కడ కొన్ని ప్రాంతాల్లో తీవ్రమైన వ్యతిరేకత ఉంది. అహ్మదీలైనందుకు కొంతమంది చాలా కాలంగా నిరాశ్రయులుగా ఉన్నారు. వారి కోసం ప్రార్థించండి; అల్లాహ్ సర్వశక్తిమంతుడు వారి శాంతి మరియు భద్రతకు మార్గాలను సృష్టించుగాకా!. "ఎక్కడెక్కడ జమాఅత్‌కు వ్యతిరేకత ఉందో, అక్కడి అహ్మదీలు కష్టాలను ఎదుర్కొంటున్నారు. వారి కోసం దుఆలు చేయండి. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వారి కష్టాలన్నింటినీ తొలగించుగాకా!. 'వీటన్నింటితో పాటు, మీ అందరికీ ఈద్ ముబారక్. ఎం.టి.ఏ. ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న అహ్మదీలందరికీ కూడా ఈద్ ముబారక్. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఈ ఈద్‌ను మనకు లెక్కలేనన్ని ఆశీర్వాదాలకు మూలంగా చేయుగాకా!."

ఆ తరువాత, హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా రెండవ ఖుత్బాను ప్రసంగించి, జమాఅత్‌తో కలిసి నమాజ్‌కు నాయకత్వం వహించారు. ఆ తరువాత, హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా మస్జిద్ పై అంతస్తుకు వెళ్లి, అక్కడ హాజరైన మిత్రులకు "అస్సలాము అలైకుమ్" అంటూ తన సలామును తెలియజేశారు. అనంతరం వారు మహిళల హాల్‌కు, అలాగే మార్కీలకు వెళ్లి, అక్కడ ఉన్న వారికి కూడా "అస్సలాము అలైకుమ్" అంటూ తన సలామును తెలియజేశారు. మహిళలకు హుజూర్ అన్వర్ వారిని) దర్శించే భాగ్యం లభించింది.

ఆ తరువాత, హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా వారు ఏంటిఏ స్టూడియోకు వచ్చి, కార్యక్రమం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ సమయంలో, ఈద్ ఖుత్బా అనంతరం హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ చేసిన ఈ సంక్షిప్త పర్యటన కూడా ప్రత్యక్ష ప్రసారం చేయబడుతోంది.

తన నివాసానికి వెళ్లే ముందు, హుజూర్ అన్వర్ గౌరవనీయ అమీర్ సాహిబ్ ఆస్ట్రేలియా, నాయిబ్ అమీర్లు, ఖాఫిలా సభ్యులు, సద్ర్ ఖుద్దాముల్ అహ్మదీయ్యా మరియు విధుల్లో ఉన్న ఖుద్దామ్‌లతో ఎంతో స్నేహపూర్వకంగా కరచాలనం చేశారు. వారికి వీడ్కోలు పలికి తన నివాసానికి వెళ్లారు.

సిడ్నీ జమాఅత్ సభ్యులతో పాటు, బ్రిస్బేన్, మెల్‌బోర్న్ మరియు అడిలైడ్ వంటి ఇతర జమాఅత్‌లకు చెందిన కొంతమంది సభ్యులు కూడా హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా వెనుక పండుగ నమాజ్ చదువుటకు చాలా దూర ప్రయాణం చేసి సిడ్నీకి వచ్చారు. 2,500 మందికి పైగా సభ్యులు తమ ప్రియమైన ఇమామ్ వెనుక పండుగ నమాజ్ చదివారు. కొద్దిమందిని మినహాయిస్తే, వారందరికీ హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా వారి వెనక నమాజ్ చదవడం ఇదే మొదటిసారి. ఈ గొప్ప అనుగ్రహంతో ప్రతి ఒక్కరూ ఎంతో ఆనందించారు. ప్రజలు తమ భావాలను వ్యక్తం చేస్తూ, "ఈ రోజు మా అనేక పండుగలు ఒక్కటిగా కలిసిపోయినట్లుగా అనిపిస్తోంది" అని అన్నారు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఈ పండుగను మనందరికీ శాశ్వతమైన శుభములకు మూలంగా చేయుగాకా! ఆమీన్.

మధ్యాహ్నం 1:30 గంటలకు, హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా జొహర్ మరియు అసర్ నమాజ్‌లను జమాఅత్‌తో కలిసి చదివించారు. నమాజ్‌లను చదివించిన అనంతరం, హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా వారు తమ నివాసానికి వెళ్లారు. (కొనసాగుతుంది)

**(అల్ ఫజల్ ఇంటర్నేషనల్, 29 నవంబర్-5 డిసెంబర్ 2013)**

**131 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్**

సయ్యద్నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 131 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్ కొరకు 25, 26,27 డిశంబర్ 2026 (శుక్రవారం, శనివారము, ఆదివారము) తేదీలను ఆమోదించినారు. ఇప్పటి నుండే జమాఅత్ సభ్యులు ఈ పవిత్ర సభలో పాల్గొనుటకు సంకల్పించి సన్నాహాలు ప్రారంభించగలరు. ఈ ఆధ్యాత్మిక సభతో ప్రయోజనము పొందే అనుగ్రహము అల్లాహ్ మనందరికి కలిగించుగాక! ఈ వార్షిక మహాసభ అన్ని విధాలా విజయవంతమగుటకు, దీని ద్వారా సత్యవంతులు మార్గదర్శనము పొందాలని ప్రార్థనలు చేయగలరు. అల్లాహ్ అందరికి ఉత్తమ ప్రతి ఫలములు అందించు గాక! (ఆమీన్) **( నజారత్ ఇస్లాహి ఇర్షాద్ దక్షిణ భారత దేశపు ఖాదియాన్ )**

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz